

పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :25 | సంచిక :29 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | ఆదివారం 07 జూన్ 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


### మీ ఏరియా వాల్యూ
## ఎంతో తెలుసా..?



**హైదరాబాద్, జూన్ 6:**రాష్ట్రంలో వ్యవసాయ భూములు, ప్లాట్లు, అపార్టుమెంట్లు, ఇళ్లకు కొత్త మార్కెట్ విలువ శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లన్నీ 5వ తేదీ నుంచి కొత్త విలువ ఆధారంగానే జరగనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగు భూములు, ఖాళీ స్థలాలకు మార్కెట్ విలువను 50 నుంచి 100శాతంకు పెంచగా.. అపార్టుమెంట్లకు సంబంధించి 10 శాతం నుంచి 20శాతం వరకు పెంపుదల జరిగింది. కొన్ని ప్రాంతాల్లో పాత విలువనే కొనసాగించారు. అయితే, రాష్ట్రంలో కనిష్ఠంగా భూముల ధర ఇంతకుముందు ఎకరా రూ.1.75 లక్షలు ఉండగా దాన్ని రూ.2.75 లక్షలకు పెంచారు.

**ఇలా చెక్ చేసుకోండి..**

తెలంగాణ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డిపార్ట్ మెంట్ వెబ్ సైట్ లోకి వెళ్లండి. https://registration.telangana.gov.in/ అందులో ఆన్ లైన్ సర్వీసెస్ అనే - మిగతా3లో

### మహిళలు ధైర్యంగా పనిచేస్తేనే
## అభివృద్ధి వేగవంతం..

**: డీజీపీ ఆనంద్**



**హైదరాబాద్, జూన్6** : ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారిత సాధించాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. దాని కోసం ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో స్త్రీ రైడ్స్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. 55 మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పించి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు గిగ్ వర్క్‌లో పురుషులు ఉండేవారని, ఇప్పటినుంచి మహిళలు కూడా రాబోతున్నారని తెలిపారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్ వేదికగా డీజీపీ సీవీ ఆనంద్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలో లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌కు.. మహిళా ఎస్‌హెచ్‌వో లేరని డీజీపీ ఆనంద్ వివరించారు. తాను హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహిళా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించానని ప్రస్తావించారు. ఇప్పుడు 55 మంది మహిళలు ప్యాసింజర్ రవాణా సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణ అంతటా లాజిస్టిక్, కార్గో, డెలివరీ సర్వీసెస్‌లో మహిళా డ్రైవర్లకు అవకాశం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. దేశ జీడీపీ పెరగాలంటే మహిళలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి పని చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు

### జూన్ 8 నుంచి
## చేప ప్రసాదం పంపిణీ

**: మంత్రి వాకిటి శ్రీహరి**




**హైదరాబాద్:** చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి తెలిపారు. ఏబీఎన్‌తో మాట్లాడుతూ.. చేప ప్రసాదం అనేది ప్రజల విశ్వాసంతో ముడిపడి ఉన్న అంశమని, ఎలాంటి ప్రచారాలు చేయకపోయినా దేశం నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని వారు పేర్కొన్నారు.

**అపోహలకు తావు ఇవ్వకుండా..**

చేప ప్రసాదం వల్ల ప్రయోజనం పొందిన వారే ఈ కార్యక్రమానికి ప్రచారం చేస్తున్నారని, శాస్త్రానికి అంతుచిక్కని అనేక విషయాలు ఉన్నాయని వారు వ్యాఖ్యానించారు. అందువల్ల అపోహలకు తావు ఇవ్వకుండా ప్రజలు నమ్మకంతో పాల్గొనాలని సూచించారు.

**చేపపిల్లలు సిద్ధం**

ఈసారి లక్ష మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని, అందుకు అనుగుణంగా మూడు లక్షలకు పైగా చేపపిల్లలను - మిగతా3లో

### చంద్రబాబుతో రేవంత్ రెడ్డి
## కుమ్మక్కయ్యారు

**: హరీశ్ రావు**



**హైదరాబాద్, జూన్ 6:**పాలమూరు ప్రాజెక్టు సందర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి "మతిలేని మాటలు" అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. బీఆర్ఎస్ చేపట్టబోయే పాదయాత్ర భయంతోనే సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కరువైందని, సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టం చేశారు. "అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదు. సీఎం - మిగతా3లో



### వయనాడ్‌లో 150 మంది
## విద్యార్థులకు అస్వస్థత..

**ఆసుపత్రిలో చేరిన 38 మంది**

**తిరువనంతపురం:** కేరళంలోని వయనాడ్ జిల్లాలో ఒక పాఠశాలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కొద్ది రోజులుగా జ్వరం, వాంతులు బారిన పడటంతో 38 మందిని సుల్తాన్ బత్తేరి తాలూక్ ఆసుపత్రిలో చేర్చారు. దీంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మార్ బాసిలియోస్ ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూలులో - మిగతా3లో

### ఫాంహౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా
# కొట్లాడేందుకు సిద్ధం

**సీఎం రేవంత్‌రెడ్డి**



**రంగారెడ్డి, జూన్6 :** బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళ్లు, అజీర్ణం చేసుకునేవాళ్లు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. ఈరోజు(శనివారం) కోహెడలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఫ్రూట్ మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లకు శంకుస్థాపన చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కాళేశ్వరంలో చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం నీళు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరానికి రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు.

**మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వం..**

కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. తాము వికాసం వైపు నడిపిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కేవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు. ఈనెల 15వ తేదీ తర్వాత వడ్లు కొనకపోతే మోదీ సర్కార్ సంగతి చూస్తామని హెచ్చరించారు. తమకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు.

**వ్యవసాయం కుంటుపడింది..**

భూముల ధరలు బాగా పెరిగాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ మార్కెట్ నిర్మిస్తామని తాము హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం తాము చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మాసిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతున్నామని వివరించారు.

**ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. మా నినాదం..**

కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతానికి వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, === వద్దంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని బీఆర్ఎస్ నేతలు అడ్డుకుంటున్నారని ఆగ్రహించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు కావాలని గతంలో తాము పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడుతున్నారని.. ధర్నాలు చేస్తున్నారని ఆగ్రహించారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంతమంది అడ్డంపడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.




### ఆపరేషన్ లోటస్
## ప్రారంభం..

**హైదరాబాద్, జూన్ 6:**తెలంగాణలో బీజేపీ పుంజుకునే ప్రయత్నంలో పడింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ లను తట్టుకుని తెలంగాణలో ముందుకు రావడం అంత సులువు కాదు. అందుకే రానున్న కాలంలో బీజేపీలో కీలక నేతలను ఆ పార్టీల నుంచి చేర్చుకునే అవకాశముంది. ఇప్పటి నుంచే నియోజకవర్గాల వారీగా తెలంగాణలో బీజేపీ సర్వేలు చేయిస్తుంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ గెలుపు గుర్రాలకు మాత్రమే టిక్కెట్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం అవసరమైతే ఇతర పార్టీల నేతలను కూడా ఆహ్వానించి వారికి కండువా కప్పేయాలని డిసైడ్ అయింది. దక్షిణాదిన బలపడాలనుకుంటున్న బీజేపీ తెలంగాణను లక్ష్యంగా చేసుకుంది.వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఎలాగైనా అధికారంలోకి రావాలని భావించి పార్టీ కేంద్ర నాయకత్వం తరచూ రాష్ట్ర నాయకులతో సమావేశమవుతున్నారు. నేతలంతా సమైక్యంగా నిలిచి ఇతర పార్టీల నేతలను ఆహ్వానించేందుకు అవసరమైన స్కెచ్ లను రూపొందించాలని ఇప్పటికే రాష్ట్ర పార్టీ నేతలకు ఆదేశించినట్లు తెలిసింది. తెలంగాణలో గత శాసనసభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను, పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను గెలుచుకున్న సంగతి తెలిసిందే. మరికొంత గట్టిగా ప్రయత్నిస్తే ఈసారి అధికారంలోకి రావడం ఖాయమని అంటున్నారు.బీఆర్ఎస్ లో కీలక నేతలను రప్పించడానికి కూడా కేంద్రం స్థాయిలో నేతలు పావులు కదుపుతున్నారన్న ప్రచారం ఇటీవల కాలంలో ఊపందుకుంది. ఇప్పటికే పార్టీ నాయకత్వంపైన, మరోసారి అధికారంలోకి వస్తామన్న నమ్మకం లేని కొందరు నేతలు బీజేపీ వైపు చూస్తున్నట్లు గుర్తించిన అధినాయకత్వం త్వరలోనే ఆపరేషన్ ను ప్రారంభించే అవకాశాలున్నాయని పార్టీ సీనియర్ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కొందరు నేతలు బీజేపీ టాప్ లీడర్లతో టచ్ లోకి వెళ్లారని, అయితే సర్వే నివేదికలు వచ్చిన తర్వాత మాత్రమే వీరి చేరికలు ఉంటాయని చెబుతున్నారు. మొత్తం మీద తెలంగాణలో బీజేపీ భారీ స్కెచ్ తో ముందుకు వెళుతుంది. మరి చివరకు ఏం - మిగతా3లో

వార్తాతరంగాలు

ఆదివారం 07 జూన్ 2026

# సంపాదకీయం

## ప్రాంతీయ పార్టీలకు ఏమౌతోంది

రాజకీయ పార్టీలు సిద్ధాతాలు ప్రాతిపదికను కాకుండా కేవలం కొన్ని నిర్దిష్ట సమీకరణాల వల్లే ముక్కలవుతున్నాయని స్పష్టమవుతోంది. ప్రాంతీయ పార్టీలలో అత్యధికం కుటుంబ పార్టీలుగా మారడం వాటి పతనానికి ప్రధాన కారణం. అధినేత తర్వాత ఆ స్థానం వారసులకే దక్కాలనే పట్టుదల, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లలో తీవ్ర అసంతృప్తిని రగిలిస్తోంది. మహారాష్ట్రో మహారాష్ట్రలో పవార్, బెంగాల్‌లో, యూపీలో యాదవ్ కుటుంబంలో జరిగిన గొడవలు దీనికి లైవ్ ఎగ్జాంపుల్స్‌ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు ప్రస్తుత రాజకీయంలో కీలక పాత్ర పోషిస్తున్నాయనే మరో ఆరోపణ బలంగా ఉంది. అవినీతి కేసుల విచారణలు ఎదుర్కొంటున్న చాలా మంది నాయుకులు, తమ రాజకీయ ఉనికిని , ఆస్తులను కాపాడుకోవడానికి అధికార పక్షంతో, కేంద్రంలో ఉన్న పార్టీతో కలవడానికో, లేదా సొంత పార్టీని చీల్చడానికో సిద్ధపడుతున్నారు. ఆధునిక రాజకీయంలో భావజాలం అనేదానికి విలువ లేకుండా పోయింది. ఒకప్పుడు బద్ధశత్రువులుగా ఉన్న పార్టీలు కేవలంం అధికారం కోసం జత కట్టడం ఆ తర్వాత ప్రయోజనాలు నెరవేరకపోతే చీలిపోవడం సర్వసాధారణమైపోయింది. విపక్షాలకు కాలం చెల్లిపోలేదు. కానీ వారి పాత పద్ధతులకు మాత్రం కాలం చెల్లింది. వారసత్వ రాజకీయాలు, ద్వితీయ శ్రేణి నాయకత్వం లేకపోవడం, కేవలం అధికార పక్షాన్ని తిట్టడమే ఎజెండాగా పెట్టుకవడం వల్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గుతోంది. విపక్షాలు కేవలం ఎన్నికల పొత్తులపై కాకుండా, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడలి. అప్పుడే మళ్లీ ప్రజల ఆదరణను పొందగలవు. లేదంటే ప్రాంతీయ పార్టీల మనుగడ హిస్టరీగా మారిపోనుంది. ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షం ప్రాణం లాంటిది. పాలకుల తప్పిదాలను ఎత్తి చూపుతూ, ప్రజల పక్షాన నిలబడాల్సిన విపక్షాలు నేడు భారత్ రాజకీయాల్లో ఉనికి కోసం పోరాడుతున్నాయి. ఒకప్పుడు ఢిల్లీ పీఠాన్ని శాసించిన శక్తులు, రాష్ట్రాల్లో దశాబ్దాల పాటు ఏక ఛత్రాధిపత్యం వహించిన ప్రాంతీయ పార్టీలు నేడు అంతర్గత కలహాలు, ఫిరాయింపులు, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్నాయి. ఢిల్లీ నుంచి దేశం అన్ని రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. అయితే విపక్షాల ఈ పరిస్థితికి కారణం ఏంటీ? ఇప్పుడు చోటు చేసుకుంటున్న పరిణామాలు పంపిస్తున్న సంకేతాలు ఏంటో చూద్దాం. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో తిరుగుబాటు చోటుచేసుకుంది. బుధవారం నాడు తిరుగుబాటు ఎమ్మెల్యేలు తామే అసలైన తృణమూల్ అని స్పీకర్‌కు లేఖ రాశారు. ఎక్కువ మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలు ఉన్నందున పార్టీ అధికారం ఇప్పటికే మమత చేతుల నుంచి జారిపోయింది. తృణమూల్ గుర్తుపై గెలిచిన 80 మందిలో, 60 మంది ఇప్పుడు రెబెల్స్‌గా మారారు. ప్రతిపక్ష నాయకురాలు రీటబ్రత బెనర్జీ విలేకరుల సమావేశంలో, "మేము తృణమూల్ కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాము" అని అన్నారు. 2022లో మహారాష్ట్రలో ఇలాంటి పరిణామాలు ఎదురయ్యాయి. అప్పటి వరకు శివసేనలో నమ్మిన బంటుగా ఉంటూ వచ్చిన ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు చేశారు. ఉద్ధవ్ థాకరే శివసేన నుంచి మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు విడిపోయారు. వారి పిటిషన్ ఆధారంగా, ఎన్నికల సంఘం అప్పటి తిరుగుబాటు శిబిరాన్ని నిజమైన శివసేనగా ప్రకటించింది. షిండే నిజమైన శివసేన గుర్తించి 'బాణం, విల్లు' చిహ్నం లభించింది. బాలాసాహెబ్ థాకరే సృష్టించిన పార్టీ, ఆ పార్టీ చిహ్నం రెండూ థాకరే కుటుంబం నుంచి జారి పోయాయి. తర్వాత ఎన్సీపీలో చీలక వచ్చింది. శరద్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్ మెజారిటీ ఎమ్మెల్యేలతో పార్టీని వీడి వేరు కుంపటి పెట్టారు. తమదై నిజమైన ఎన్సీపీ అంటూ ప్రకటించారు. దీంతో శరద్ పవర్ కూడా తన ఒరిజినల్ పార్టీని కోల్పోయారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో కూడా అదే సీన్స్ రిపీట్ అవుతున్నాయి. ఢిల్లీలో ఆప్ పరిస్థితి అలానే ఉంది. ఇప్పటికే మెజారిటీ ఎంపీలు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. తమకను ఆప్ ఎల్పీని విలీనం చేస్తున్నట్టు ప్రకటించారు. తర్వాత పంజాబ్ వంతు వస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఎన్నికలకు మరెంతో కాలం లేనందున అలాంటి పరిస్థితి లేకుండా నేరుగా ఎన్నికల ముందే పార్టీ చీలిపోనుందని అంటున్నారు. సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతా దళ్ వంటి పార్టీలు తమ ఉనికి కోసం నిరంతరం పోరాడాల్సి వస్తోంది. లోక్‌జనశక్తి లాంటి పార్టీలు ఇప్పటికే కుటుంబ కలహాలతో చీలిపోయాయి. తమిళనాడులో ద్రవిడ రాజకకీయ చరిత్రలో అన్నాడీఎంకేకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే జయలలిత మరణం తర్వాత ఆ పార్టీ రెండుగా చీలిపోయింది. ఎడప్పాడి పళనిస్వామి, ఓ పన్నీర్ సెల్వం, శశికళ, టీటీవీ దినకర్ వర్గాలుగా విడిపోయారు. ఇలా విడిపోవడంతో తర్వాత ఎన్నికల్లో డీఎంకే భారీ మెజారిటీతో విజయం సాధించింది. ఇప్పుడు విజయ్ టీవీకే అధికారం చేపట్టిన తర్వాత ఒరిజినల్ అన్నాడీఎంకే విడిపోతోంది. చాలా మంది ఎమ్మెల్యే తిరుగుబాటుకు రెడీగా ఉన్నారు. ఇప్పటికే కొందరు రాజీనామా చేశారు. మరికొందరు చర్చలు జరుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇరప్పుడు ప్రతిపక్ష హోదా చుట్టూ తిరుగుతున్నాయి. గత ఎన్నికల్లో 175 స్థానాలకు కానూ కేవలం 11 స్థానాలకే పరిమితం అయిన వైఎస్ఆర్ కాంగ్రెస్ ఇప్పుడు అసెంబ్లీలో తన గొంతు వినిపించడానికి న్యాయపోరాటం చేస్తోంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి హోదా దక్కాలంటే పది శాతం సభ్యులు ఉండాలి. అంటే రాష్ట్రంలో 18 సీట్లు సాధిస్తేనే ప్రతిపక్ష హోదా వస్తుందని కూటమి ప్రభుత్వ వాదన. కేవలం 11 సీట్లు ఉన్న జగన్ మోహన్ రెడ్డికి ఆ హోదా కల్పించలేమని స్పీకర్ కార్యాలయం స్పష్టం చేసింది. అయితే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో వేరే విపక్షం లేదని ఏకైక విపక్షం తమదే కాబట్టి కచ్చితంగా ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందేనంటూ వైసీపీ పట్టుబడుతోంది. దీనిపై హైకోర్టులో కేసు విచారణ సాగుతోంది. తెలంగాణలో పదేళ్లపాటు తిరుగులేని శక్తిగా వెలిగిన బీఆర్ఎస్ నేడు అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కారు దిగి హస్తం గూటికి చేరేందుకు యత్నించారు.నియోజకవర్గాల అభివృద్ధి కోసమే అని వారు చెబుతున్నా, అది బహిరంగంగా జరుగుతున్న ఫిరాయింపులుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఫిరాయింపులపై బీఆర్ఎస్ సుప్రీంకోర్టుకు వెళ్లినప్పటికీ, అసెంబ్లీ స్పీకర్ ఇటీవల తీసుకున్న నిర్ణయం ఆపార్టీకి షాక్ ఇచ్చింది. సాక్ష్యాధారాలు లేవనే కారణంతో అనర్హత పిటిషన్లు కొట్టివేశారు. ఒకప్పుడు ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో ఇతర పార్టీలను బలహీన పరిచిన బీఆర్ఎస్ ఇప్పుడు అదే వ్యూహానికి బలైపోతోంది.ఫిరాయింపుల సమయంలోనే కవిత కూడా పార్టీకి షాక్ ఇచ్చింది. తన మాట చెల్లుబాటు కావడం లేదని తనను పట్టించుకోవడం లేదని తిరుగుబాటు జెండా ఎగరేశారు. దీంతో ఆమెపై అనర్హత వేటు పడటంతో టీఆర్ఎస్ పేరుతో సొంత పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ వేదిక ద్వారా తన తండ్రి పార్టీ ఓటర్లనే టార్గెట్ చేశారు.

# పాపం..దీదీ...
# నిట్టనిలువునా చీలనున్న పార్టీ

**కోల్ కత్తా, జూన్ 5:** రాజకీయాల్లో సొంతవాళ్ల తిరుగుబాటును ఎదుర్కోవడం ప్రత్యర్థులను ఎదుర్కోవడంకన్నా కష్టం. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి పదవిని కోల్పోయిన మమతా బెనర్జీ ప్రస్తుతం అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. మూడు దశాబ్దాలుగా బెంగాల్ రాజకీయాల్లో అప్రతిహత శక్తిగా నిలిచిన ఆమెకు ఈసారి సవాలు సొంత పార్టీ నుంచే వస్తోంది. ఏకంగా పార్టీని నిట్టనిలువునా చీల్చేంతగా పెరుగుతోంది.ఇప్పటివరకు మమతా బెనర్జీ ఎదుర్కొన్న ప్రతి రాజకీయ సంక్షోభంలో ప్రత్యర్థి స్పష్టం. ఒకప్పుడు కమ్యూనిస్టులు, తర్వాత బీజేపీ. కానీ ఇప్పుడు ఆమె ఎదుట నిలబడిన వారు ఆమె స్వయంగా పెంచి పోషించిన నాయకులే. అందుకే 2026 సంక్షోభం మమత రాజకీయ జీవితంలో ఎదుర్కోబోయే అతిపెద్ద సవాలు కానుంది. మమతా బెనర్జీ రాజకీయ జీవితం భారత రాజకీయాల్లో అరుదైన కథ. కోల్‌కతాలోని సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆమెకు రాజకీయ వారసత్వం లేదు. ఆర్థిక బలం లేదు. ఉన్నదల్లా అసాధారణమైన పోరాట పటిమ మాత్రమే.కాంగ్రెస్ విద్యార్థి విభాగంలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన మమత, ఓ దశలో ఆపార్టీ సీనియర్లతోనే విభేదించి పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఆ గొడవలో మమతపై భౌతిక దాడికూడా జరిగింది. కానీ దేనికీ వెరవకుండా కాంగ్రెస్ కి ప్రత్యామ్నాయంగా ఎదిగారు. ప్రత్యక్ష ఉద్యమాలకు ప్రతీకగా మారారు. కమ్యూనిస్టు పాలనకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.1998లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని స్థాపించినప్పుడు చాలామంది ఆమెను తేలిగ్గా తీసిపారేశారు. ప్రతిపక్షమంటే కాంగ్రెస్ కాదు తృణమూల్ కాంగ్రెస్ అనేలా ఎదిగారు . చివరికి 2011లో 34 ఏళ్ల కమ్యూనిస్టు పాలనకు ముగింపు పలికి చరిత్ర సృష్టించారు. అది కేవలం అధికార మార్పు కాదు. బెంగాల్ రాజకీయాల్లో ఓ సంచలన పరిణామం.మమత విజయానికి ప్రధాన కారణం ఆమె వ్యక్తిత్వం. కన్యాశ్రీ, విద్యార్థి స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్య పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో ఆమెపై ప్రత్యేకమైన




అనుబంధాన్ని సృష్టించాయి. ప్రజలు తృణమూల్ కాంగ్రెస్‌ను కాకుండా "దీదీ"ని విశ్వసించారు. అదే సమయంలో పార్టీ నిర్మాణం కూడా మమత చుట్టూనే తిరిగింది. నిర్ణయాలు, వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, రాజకీయ దిశ---అన్నీ దీదీ నే కేంద్రంగా పనిచేసాయి.ఈ విధానం అధికారంలో ఉన్నప్పుడు పార్టీకి బలంగా పనిచేసింది. ఇప్పుడు ఆమె నాయకత్వానకీ, నిర్ణయాధికారానకీ అదే సవాలుగా మారింది. వారసుడు అభిషేక్ బెనర్జీకి శాపంగా మారింది. మమత రాజకీయ జీవితంలో సంక్షోభాలు కొత్తవి కావు. విధ్యార్థినాయకురాలిగా రాజకీయ ప్రవేశం చేసినప్పటినుంచీ ప్రతీ స్థాయిలోనూ ఇదే ఆమెకు చివరి ఘట్టం అన్నంత పెద్ద సవాళ్లు ఎదురయ్యాయి. ప్రతీ సారీ ధైర్యగా ఎదుర్కొన్నారు. ప్రతీ సారీ మరో మెట్టు ఎదిగారు. సింగూర్ -- నందిగ్రామ్ ఉద్యమాల సమయంలో మమత మరీ పెట్టుబడులకు వ్యతిరేకంగాపోతున్నారు. కమ్యూనిస్టులే పరిశ్రమలను ప్రోత్సహిస్తుంటే భూములు, నిర్వాసితులు అనే నినాదం పనిచేయదు .. వ్యతిరేకత వస్తుందన్నారు. కానీ ఆపోరాటంతోనే కమ్యూనిస్టులను మట్టికరిపించారు.నందిగ్రామ్ పరాజయం -- 2021 : తన రాజకీయ ప్రతిష్టకు ప్రతీకగా మారిన నందిగ్రామ్‌లో సువేందు అధికారికి ఓడిపోయినప్పుడు మమత రాజకీయంగా బలహీనపడతారని విశ్లేషణలు వచ్చాయి. కానీ అదే ఎన్నికల్లో తృణమూల్ 200కు పైగా స్థానాలు గెలుచుకుని అధికారాన్ని నిలబెట్టుకుంది. ఓటమిని విజయంగా మార్చుకోవడంలో మమత మరోసారి సత్తా చాటారు.

**ఆర్జీ ఖర్ ఆస్పత్రి ఘటన :** 2024లో జరిగిన వైద్య విద్యార్థిని హత్య కేసు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసింది. భారీ నిరసనలు జరిగాయి. అయినప్పటికీ మమత రాజకీయంగా నిలబడగలిగారు. అందుకే ఆమె రాజకీయ ప్రస్థానాని దగ్గరగాచూసిన వాళ్లు చెబుతారు.. సవాళ్లంటే మమతకు మరో మెట్టు అని.ఈసారి మమత ఎదుర్కొంటున్న సమస్య బయట శత్రువు కాదు.. పార్టీలో అంతర్గతంగా ఉన్న వ్యక్తులే.. గతంలో సువేందు అధికారి తనను ఎదిరించిప్పుడు, బీజేపీ 2021లోనే తన రాజకీయ పతనానికి అన్ని యత్నాలూ చేసినప్పుడు ఎదురొడ్డి నిలిచారు. కానీ ఈసారి సమస్య అత్యంత పెద్దది. పార్టీ ఎమ్మెల్యేలలో దాదాపు 60 మంది తిరుగుబాటు చేయడం బెంగాల్ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఏకంగా పార్టీ మొత్తాన్నే చీల్చేంతగా.. అసలు పార్టీనే మాది అనేంత పెద్దది. ఇది కేవలం నాయకత్వంపై అసంతృప్తి మాత్రమే కాదు. ఇది పార్టీ భవిష్యత్తుపై అనిశ్చితి. ఏడు పదులు దాటిన ఓ రాజకీయ యోధురాలి పోరాట పటిమకు మరో పరీక్ష.

**మరి ఈసారి తట్టుకుని నిలబడగలదా ?**

బెంగాల్ రాజకీయాల్లో భావోద్వేగాలు, ప్రాంతీయ భావం, వ్యక్తిత్వ రాజకీయాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ మూడు అంశాల్లోనూ మమత ఇప్పటికీ తిరుగులేని నాయకురాలే. బీజేపీ ప్రభుత్వం ప్రజల్లో అసంతృప్తిని కలిగించే నిర్ణయాలు తీసుకుంటే, ప్రతిపక్ష నాయకురాలిగా మమతకు మళ్లీ అవకాశాలు రావచ్చు. మైనారిటీల మద్దతు ఎప్పటికీ మమతకే అదే సమయంలో వయసు, పార్టీ విభేదాలు, అవినీతి ఆరోపణలు, నాయకత్వంపై ప్రశ్నలు ఆమెకు ప్రతికూలంగా మారే అవకాశం కూడా ఉందిఅందుకే బెంగాల్ రాజకీయాలను గమనిస్తున్న ప్రతి ఒక్కరి మదిలో ఒకే ప్రశ్న వినిపిస్తోంది--- ఇది దీదీ రాజకీయ ప్రస్థానానికి అస్తమయమా? లేక మరోసారి ఆమె పునరాగమనానికి ముందు నిశ్శబ్దమా?

# ఆశలు రేపుతున్న చంద్రయాన్ రిపోర్ట్

**బెంగళూరు, విజయవాడ, జూన్ 5:** చంద్రయాన్-2 ల్యాండర్ ఫెయిల్ అయిందని ఒకప్పుడు నిరాశపడిన వారికి, అలాగే అంతరిక్ష రేసులో పోటీపడుతున్న ప్రపంచ దేశాలకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ( మైండ్ బ్లాంక్ అయ్యే న్యూస్ చెప్పింది. ల్యాండర్ క్రాష్ అయినా, గత ఏడేళ్లుగా చంద్రుడి చుట్టూ సైలెంట్‌గా తిరుగుతున్న 'చంద్రయాన్-2 ఆర్బిటార్' ఇప్పుడు ఒక సంచలన విషయాన్ని కనిపెట్టింది. సౌర కుటుంబంలోనే అత్యంత రహస్యమైన, సూర్యరశ్మి అస్సలు పడక మైనస్ 248 డిగ్రీల గడ్డకట్టే చలి ఉండే చంద్రుని దక్షిణ ధ్రువంలో భారీగా మంచు నిల్వలు ఉన్నట్లు పక్కా ఆధారాలతో కనిపెట్టింది.అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ శాస్త్రవేత్తలు ఆర్బిటార్ పంపిన డేటాను లోతుగా విశ్లేషించి ఈ నిజాన్ని ప్రపంచం ముందుంచారు. చంద్రయాన్-2 ఆర్బిటార్‌లోని 'డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపెర్చర్ రాడార్' ఈ అద్భుతాన్ని సుసాధ్యం చేసింది. ఎల్-బ్యాండ్, ఎస్-బ్యాండ్ ఫ్రీక్వెన్సీలలో పనిచేసే ఈ అత్యాధునిక పరికరం చంద్రుడి ఉపరితలం కింది భాగంలోకి మైక్రోవేవ్ సంకేతాలను పంపి చీకటి గుట్టును రట్టు చేసింది. సాధారణ రాళ్లు, దుమ్ము కంటే మంచు ఈ రాడార్ సంకేతాలను



భిన్నంగా వెనక్కి (పరావర్తనం) పంపుతుంది. దీని ఆధారంగా దక్షిణ ధ్రువంలోని డబ్లీ షాడోడ్ క్రేటర్ల కింద బిలియన్ల సంవత్సరాల నాటి మంచు ఉన్నట్లు స్పష్టమైంది.శాస్త్రవేత్తలు పరిశోధించిన తొమ్మిది భారీ గుంతలలో.. 'ఫాస్టిని క్రేటర్' లోపల ఉన్న 1.1 కిలోమీటర్ల వ్యాసం గల ఒక చిన్న గుంతలో ఈ మంచుకు సంబంధించిన అత్యంత బలమైన ఆధారాలు లభించాయి. అయితే ఈ మంచు నేరుగా చంద్రుడి ఉపరితలంపై లేదు. భవిష్యత్తులో వ్యోమగాములు సులభంగా సేకరించడానికి వీల్లేకుండా, లోపల భూగర్భంలో భద్రంగా దాగి ఉంది. కోట్ల ఏళ్ల క్రితం ఒక ఉల్క చంద్రుడిని బలంగా ఢీకొట్టినప్పుడు, లోపల ఉన్న మంచు నిల్వలు ద్రవరూపంలోకి మారి పక్కకు ప్రవహించి, మళ్లీ అక్కడే గడ్డకట్టుకుపోయినట్లుగా ఉన్న ప్రత్యేక ఆకారాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు.భూమి మీద నుంచి అంతరిక్షంలోకి నీటిని, ఇంధనాన్ని మోసుకెళ్లడం అత్యంత ఖర్చుతో కూడుకున్న పని. కానీ ఇప్పుడు చంద్రుడిపై **(Moon)** దొరికిన ఈ మంచును రసాయన ప్రక్రియల ద్వారా స్వచ్ఛమైన తాగునీరుగా, వ్యోమగాములు పీల్చుకునే ఆక్సిజన్‌గా, చివరికి రాకెట్ ఇంధనంగా కూడా మార్చుకోవచ్చు! ఈ అద్భుతమైన అవకాశం వల్లే ఇప్పుడు అమెరికా నాసా **(NASA)** ఆర్టెమిస్ ప్రోగ్రామ్, చైనా లూనార్ మిషన్లు అన్నీ కూడా చంద్రుని దక్షిణ ధ్రువంపైనే కన్నేశాయి.కానీ ఆ అగ్రరాజ్యాల కంటే ముందే అక్కడి అణువణువు రహస్యాలను ఇస్రో పసిగట్టి ప్రపంచ అంతరిక్ష రేసులో తన సత్తా చాటింది. 2023లో చంద్రయాన్-3 సృష్టించిన చారిత్రక **(Moon)** ల్యాండింగ్ విజయానికి, ఇప్పుడు చంద్రయాన్-2 ఆర్బిటార్ అందిస్తున్న ఈ డేటా తోడవడంతో గ్లోబల్ స్పేస్ సెక్టార్‌లో భారతదేశం తిరుగులేని శక్తిగా అవతరించిందని విశ్లేషకులు అంటున్నారు.

## 60 తులాల బంగారం దోపిడీ కేసు
# ఛేదించిన మల్కాజిగిరి పోలీసులు

**సికింద్రాబబాద్:** మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని జవహర్నగర్ పోలీస్ స్టేషన్లో నమోదైన భారీ గృహ దోపిడీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. మే 12, 2026న కౌకూర్లోని మొహన్స్ గోల్ఫ్ ఎన్క్లేవ్లో నివాసం ఉంటున్న అంతర్జాతీయ ఆర్బిట్రేటర్ మురళీ మోహన్ నర్సిపురం ఇంట్లో దోపిడీ జరిగింది. ఇంట్లో పనిచేసే నేపాలీ కార్మికులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పథకం రచించి ఈ నేరానికి పాల్పడ్డారు. ఇంటి పనిమనిషిగా సబీనా అలియాస్ సునీతను నియమించి, ఆమె భర్తగా రాజేష్ను పరిచయం చేశారు. తరువాత మే 11 రాత్రి పుట్టినరోజు వేడుక పేరుతో ఇంట్లోకి ప్రవేశించిన ఐదుగురు నిందితులు దంపతులను బంధించి, మత్తు పదార్థం ఇచ్చి అపస్మారక స్థితికి చేర్చారు. ఆ తర్వాత అల్మారాలు పగులగొట్టి సుమారు 60 తులాల బంగారం, 15 కిలోల వెండి వస్తువులు, 3 వేల అమెరికన్ డాలర్లు, రెండు మొబైల్ ఫోన్లు సహా విలువైన వస్తువులను అపహరించారు. కేసు దర్యాప్తు కోసం లా అండ్ ఆర్డర్, ఎస్ఓటీ, సీసీఎస్ విభాగాలకు చెందిన ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు 255 సీసీ కెమెరాల ఫుటేజీలను విశ్లేషించారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, లక్నోతో పాటు నేపాల్ సరిహద్దుల్లోనూ గాలింపు చేపట్టారు. నేరం జరిగిన ఐదు రోజుల్లోనే నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, గత 20 రోజులుగా కొనసాగించిన సాంకేతిక నిఘా, ఫీల్డ్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పరారీలో ఉన్న మరో నలుగురు ప్రధాన నిందితులను కూడా అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి దోచుకున్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులలో కొందరికి గతంలో కూడా చోరీ కేసుల్లో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన పోలీసు అధికారులకు తగిన బహుమతులు సిఫారసు చేయనున్నట్లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి తెలిపారు.అలాగే "మీ సురక్ష" కార్యక్రమం ద్వారా ఇంటి పనివారు, డ్రైవర్లు, వాచ్మెన్లు, కేర్టేకర్ల వివరాలను సేకరించి ధృవీకరించే ప్రత్యేక కార్యక్రమాన్ని మల్కాజిగిరి కమిషనరేట్ అమలు చేస్తోంది.ఇప్పటివరకు 39,270 మంది గృహ సిబ్బంది వివరాలను నమోదు చేయగా, వారిలో 1,276 మంది నేపాలీ జాతీయులు ఉన్నారు. కేసును ఛేదించిన మల్కాజ్గిరి కమిషనర్ పోలీస్ సిబ్బందికి క్యాష్ రివార్డులను ఆమె చేతుల మీదుగా అందజేశారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు"

## మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆధ్వర్యంలో వైసీపీ నిరసన

**దేవీపట్నం మండలం:** టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో వైసీపీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. దేవీపట్నం మండల కేంద్రంలో వందలాది మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ "ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీల పేరుతో ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేశారు. తల్లికి వందనం ఏది? రైతు భరోసా ఏమైంది? ఉచిత బస్సు హామీ మరిచారా? ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి పథకాలను నీరుగార్చి పేదలను రోడ్డున పడేశారు. ఇది ముమ్మాటికీ ప్రజలకు చేసిన వెన్నుపోటే" అని ధ్వజమెత్తారు.ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపిస్తూ కార్యకర్తలు ప్రభుత్వ మేనిఫెస్టో ప్రతులను దహనం చేశారు. "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" అని రాసి ఉన్న బ్యానర్‌లతో, ప్లకార్డులతో నిరసనకారులు ర్యాలీ నిర్వహించారు.ధనలక్ష్మి డిమాండ్ చేస్తూ "పెరిగిన విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు వెంటనే అమలు చేయాలి. లేకపోతే వైసీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, మహిళలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వార్తాతరంగాలు

ఆదివారం 07 జూన్ 2026

# ఎయిర్ పోర్టుకు ట్రాఫిక్ ఫ్రీ జర్నీ..

**హైదరాబాద్, జూన్ 6:**తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో భారీ ఫ్లై ఓవర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వైపు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెడుతూ.. కాటేదాన్ టు శంషాబాద్ రోడ్ వయా మైలార్‌దేవ్‌పల్లి ఫ్లై ఓవర్‌ను ప్లాన్ చేసింది. మొత్తం రూ.189.68 కోట్లతో ఏజెన్సీ ఎంపికకు ఆమోదం తెలిపారు. త్వరలోనే ఈ కొత్త ఫ్లై ఓవర్ పనులు ప్రారంభించే అవకాశం ఉంది అంటున్నారు.హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.. అందుకు తగిన విధంగా మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించింది. ముఖ్యంగా నగరంలో రోజు, రోజుకు ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. భాగ్యనగరంలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్కైవేలను నిర్మిస్తున్నారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో కొత్త ఫ్లైఓవర్ (బై డైరెక్షనల్ (గ్రేడ్ సెపరేటర్) నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాటేదాన్ టు శంషాబాద్ రోడ్ వయా మైలార్‌దేవ్‌పల్లి మీదుగా ఆరు లేన్ల ఈ ఫ్లైఓవర్ప్లాన్ చేసింది. మొత్తం రూ. 189.68 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ ప్రక్రియ పూర్తికాగా.. తాజాగా ఏజెన్సీ ఎంపికకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు తెలంగాణ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణ ప్రభుత్వం హెచ్-సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటీవ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)లో భాగంగా



ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల రాకపోకలు సాగించేలా ఈ నిర్ణయం తీసుకుంది. కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతంలో వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌వైపు రాకపోకలు సాగించేవారితో పాటుగా, స్థానికంగా ఉండే ట్రాఫిక్‌తో పాటుగా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఈ కారణంగానే తరచూ ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు.. ట్రాఫిక్ ఫ్రీ జర్నీ కోసం ఈ వంతెన ప్లాన్ చేశారు.ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి మొత్తం రూ.189.68 కోట్లతో మూడు జంక్షన్‌ల దగ్గర సిగ్నల్ ఫ్రీ జర్నీ కోసం బ్రిడ్జిని ప్రతిపాదించారు. ఈ వంతెనకు సంబంధించిన టెండర్ విషయానికి వస్తే.. కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్‌ను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మరో రెండు కాంట్రాక్ట్ సంస్థలు కూడా బిడ్‌లు దాఖలు చేయగా.. అంచనా కంటే ఎక్కువ కోట్ చేశాయి. కేఎన్ఆర్ కాంట్రాక్ట్ సంస్థ మాత్రం 189.68 కోట్లు (4.71 శాతం) కోడ్ చేసింది. అధికారులు టెక్నాలజీతో పాటుగా ప్రైస్ బిడ్‌ను పరిశీలించారు.. ఆ వివరాలను జీహెచ్ఎంసీ మున్సిపల్ శాఖకు పంపించింది. అనంతరం ఎల్-1 బిడ్డర్‌గా ఉన్న కేఎన్ఆర్ సంస్థను ఎంపిక చేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు వెంతన నిర్మాణ పనులు ప్రారంభించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.హైదరాబాద్ సిటీలోని అన్ని ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు.. వారికి ఊరట దక్కనుంది. అలాగే ఫలక్‌నుమా, బహదూర్‌పురా, బండ్లగూడ, చాంద్రాయణగుట్టతో సహా పలు ప్రాంతాలవారికి విమానాశ్రయానికి రాకపోకలు సులువు కానున్నాయి. ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉండవని చెబుతున్నారు. ఇప్పటికే కేబీఆర్ పార్కు జంక్షన్, ఫాక్స్ సాగర్ బ్రిడ్జి, గచ్చిబౌలి ఐఐఐటీ జంక్షన్ ఏరియాల్లో బ్రిడ్జిల నిర్మాణం ప్రారంభించారు. వీటితో పాటుగా పంజాగుట్టలోని ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్, అల్వీన్ కాలనీ, రసూల్‌పుర జంక్షన్ల దగ్గర కూడా ఫ్లై ఓవర్ల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది.

# తెలంగాణలో రెండు కొత్త నేషనల్ హైవేలు

**అదిలాబాద్, జూన్ 6:**తెలంగాణలో కొత్తగా మరో రెండు జాతీయ రహదారులకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన సీసీఈఏ (ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ) సమావేశంలో ఆమోదించారు. ఈ రెండు నేషనల్ హైవేలలో ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63), జగిత్యాల-కరీంనగర్ (ఎన్‌హెచ్-563) సెక్షన్ల అభివృద్ధి చేయనున్నారు. ఎన్‌హెచ్ఏఐ గత ఆర్థిక సంవత్సరంలో ఈ రెండు హైవేలకు సంబంధించిన పనులు ప్రారంభించేందుకు ప్రక్రియను పూర్తి చేసింది. సీసీఈఏ ఆమోదంతో ఈ ఏడాది పనులు ప్రారంభంకానున్నాయి. తెలంగాణలో రెండు కొత్త నేషనల్ హైవేల కోసం రూ.7,597.16 కోట్ల అంచనా వ్యయంగా నిర్ణయించారు. మూడు ప్యాకేజీలుగా విభజించి మొత్తం 190 కిలోమీటర్లు పొడవున నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయనున్నారు.జగిత్యాల-కరీంనగర్ హైవేను బీవోటీ పద్ధతిలో నిర్మిస్తారు. ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63) పనులను హ్యామ్ పద్ధతిలో పూర్తి చేస్తారు. ఈ కొత్త హైవే అందుబాటులోకి వస్తే ఆర్మూర్-మంచిర్యాల మధ్య ప్రయాణ సమయం దాదాపుగా గంటన్నర వరకు తగ్గుతుందని చెబుతున్నారు. అలాగే జగిత్యాల-కరీంనగర్ మధ్య హైవేతో 45 నిమిషాలు తగ్గనుందంటున్నారు. ఈ రెండు జాతీయ రహదారుల్ని పీఎం గతిశక్తి పథకానికి అనుగుణంగా రూపొందిస్తున్నారు. ఈ రెండు నేషనల్ హైవేలను పలు ప్రాజెక్టులకు అనుసంధానం చేయనున్నారు. వీటిలో ఆర్థిక కేంద్రాలు, సామాజిక కేంద్రాలు, లాజిస్టిక్ కేంద్రాలు కూడా ఉన్నాయిఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల నేషనల్ హైవే 63 నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల మీదుగా వెళుతుంది. జగిత్యాల-కరీంనగర్ నేషనల్ హైవే విషయానికి వస్తే.. పోతారం, గంగాధర, కరీంనగర్ వరకు వెళుతుంది. ఈ హైవేలలో బైపాస్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. గంటలకు 100 కిలోమీటర్లు స్పీడ్ వెళ్లేలా రోడ్లను డిజైన్ చేశారు. ఈ రెండు హైవేలు ఫిషింగ్ సీఫుడ్ క్లస్టర్, పలు రైల్వే స్టేషన్‌లను కనెక్ట్ చేయనున్నాయి. మొత్తం మీద త్వరలోనే కొత్త జాతీయ రహదారులు నిర్మాణం కాబోతున్నాయి.



వాస్తవానికి సీసీఈఏ సమావేశంలో ఈ రెండు జాతీయ రహదారులతో పాటుగా ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులకు సంబంధించి ఆమోదం లభిస్తుంది అనుకున్నారు.. ఆ పనులపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.. ఆమోదం లభించలేదు.

# కోటిచెరువు భూమిని వెంటనే వెనక్కివ్వు

### పవన్ కల్యాణ్‌పై కవిత ఫైర్

**హైదరాబాద్, జూన్ 6:**తెలంగాణ రాజకీయాల్లో భూకబ్జాల వ్యవహారం ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్సెస్ కవితగా మారి సరికొత్త వివాదానికి తెరలేపింది. హైదరాబాద్‌లోని 'కోటిచెరువు' శిఖం భూమిని పవన్ కల్యాణ్ కబ్జా చేశారంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని పార్టీ ఆఫీస్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. పవన్ గనుక ఆ భూమిని ఆక్రమించలేదని చెప్తే, వెంటనే ఆ స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించి, అక్కడి నిర్మాణాలను, మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు.నీటిపారుదల శాఖ రికార్డుల ప్రకారం ఆ 10 ఎకరాల భూమి పూర్తిగా 'శిఖం' (ప్రభుత్వ) భూమి అని కవిత స్పష్టం చేశారు. కానీ రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం 3 ఎకరాలను మాత్రమే శిఖం భూమిగా చూపి, మిగిలిన 7 ఎకరాలను 'మాగాణి' (ప్రైవేట్) భూమిగా మార్చేశారని.. ఇది స్పష్టమైన నిబంధనల ఉల్లంఘనే అని ఆమె ఎండగట్టారు.ఇటీవల పవన్ చేసిన "తెలంగాణ మీ అబ్బ సొత్తా.. మీ జాగీరా?" అనే వ్యాఖ్యలపై కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. "అవును, ఇది కచ్చితంగా మా జాగీరే! 1,200 మంది అమరవీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ ఇది. ఇది తెలంగాణ ప్రజల సొత్తు, ఎవరి ముత్తాతలదో కాదు" అని కవిత ప్రతిస్పందించారు.ఆంధ్రప్రదేశ్‌లో రాజధానిని కూడా నిర్మించలేకపోయిన పవన్.. ఇప్పుడు తెలంగాణలో కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీకి సరైన స్థానిక నాయకులు లేకపోవడం వల్లే పవన్‌ను వాడుకుంటున్నారని విమర్శించారు.ప్రజా గాయకుడు గద్దర్‌కు



తాను కారు కొనిచ్చి సాయం చేశానన్న పవన్ వ్యాఖ్యలను కూడా కవిత తప్పుబట్టారు. నైజాం ఏరియా నుండి తన సినిమాల ద్వారా కోట్లాది రూపాయల రెవెన్యూ సంపాదిస్తున్న పవన్.. ఇక్కడి జానపద కళాకారులను గానీ, చిన్న నిర్మాణాత్మక శక్తులను గానీ ఎప్పుడైనా ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. పైగా జానపద కళాకారుల ట్యూన్లను వాడుకుంటూ వారికి కనీస గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపించారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆమె ఒక ఆసక్తికరమైన పోలికను తెరపైకి తెచ్చారు. "అప్పట్లో ఖు= (కేసీఆర్, టి. హరీశ్ రావు, రామారావు) పాలన అనుకుంటే.. ఇప్పుడు కూడా నడుస్తోంది ఖు= (కొండారెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి) పాలనే" అంటూ వ్యగ్యంగా కామెంట్ చేశారు. గతంలో దోపిడీకి కిటికీలు తెరిస్తే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులే బార్లా తెరిచిందని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఇలాగే అమ్మేసుకుంటూ పోతే రాబోయే తరాలకు ఏమీ మిగలదని, ఈ ల్యాండ్ స్కామ్‌లన్నింటినీ తాము త్వరలోనే బయటపెడతామని కవిత తెలంగాణ ఎవరిదో ఒకరి తాతల, ముత్తాతల జాగీరు కాదు. ఇది బరాబర్ తెలంగాణ ప్రజల జాగీరు. 1,200 మంది అమరవీరుల త్యాగాలు, కోట్ల మంది కడుపు కట్టుకుని చేసిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సిద్ధించిన గడ్డ ఇది అని కవిత స్పష్టం చేశారు. స్థానిక వనరులను, అస్థిత్వాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తూ, ప్రజల దృష్టిని మళ్లించేందుకు కొన్ని శక్తులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు. రాజ్యాంగం ప్రకారం ఎవరైనా ఎక్కడైనా రాజకీయం చేయవచ్చు కానీ, దానికి కనీస నైతికత ఉండాలని, గతంలో తెలంగాణ వనరులను దోచుకున్న వారే ఇప్పుడు మళ్లీ ఇక్కడి సెంటిమెంట్‌ను వాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.రాష్ట్రంలో గత మరియు ప్రస్తుత పాలనను పోలుస్తూ 'కేటీఆర్' అనే మూడక్షరాలపై కవిత ఆసక్తికరమైన పొలిటికల్ పంచ్ వేశారు. "నాడు, నేడు.. ఎప్పుడైనా కేటీఆర్ పాలనే నడుస్తోంది" అని వ్యాఖ్యానించారు. అయితే దీనికి ఆమె ఇచ్చిన వివరణ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. నాడు 'కేటీఆర్' అంటే.. కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు అని, నేడు 'కేటీఆర్' అంటే.. కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని ఆమె చెప్పుకొచ్చారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ ముగ్గురు నేతలు రాత్రింబగళ్లు కష్టపడి రాష్ట్ర అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేశారని కవిత గుర్తుచేశారు. కానీ నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, పాలనను పూర్తిగా కుటుంబ సభ్యుల చేతుల్లో పెట్టి నడిపిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.

# ఆపరేషన్ లోటస్ ప్రారంభం..

- మొదటి పేజీ తరువాయి

జరుగుతుందో చూడాలి.

**నార్త్ తెలంగాణ...**

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీజేపీ ఒక నిశ్శబ్ద విప్లవానికి తెరలేపింది. గతంలో తాము జెండా పాతిన దుబ్బాక, హుజూరాబాద్‌లతో పాటు ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల గ్రామీణ ప్రాంతాల్లో కాషాయ దళం ప్రయోగించిన హైపర్ లోకల్ గ్రౌండ్ స్ట్రాటజీ ఇప్పుడు రాష్ట్ర రాజకీయ నిపుణులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ప్రత్యర్థుల వ్యూహాలకు చిక్కకుండా, క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంక్ పునాదులను కదిలించేలా బీజేపీ మాస్టర్ ప్లాన్ వేసింది.ప్రస్తుతం తెలంగాణ పల్లెల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు, స్థానిక కమిటీల నియామకాలు, పాత సివిల్ వివాదాల చుట్టూ కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ రెండు పార్టీల గ్రూపు తగాదాలతో విసిగిపోయిన తటస్థ ఓటర్లను, ఏ వర్గంలోనూ చేరలేక ఇబ్బంది పడుతున్న సగటు గ్రామీణ యువతను బీజేపీ చాకచక్యంగా తన వైపు తిప్పుకుంటోంది.స్థానికంగా ఎవరు గెలిచినా పాత కక్షలు తప్పవని.. అదే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో నడిస్తే పొలిటికల్ ప్రొటెక్షన్ ఉంటుందని వివరిస్తోంది. బలమైన భరోసాను ఇస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కేడర్ నైరాశ్యాన్ని క్యాష్ చేసుకుంటోంది. పెద్దగా ప్రెస్ మీట్లు పెట్టకుండానే, ఊళ్లల్లో ప్రత్యామ్నాయ శక్తులుగా బీజేపీ స్థానిక నాయకత్వం ఎదుగుతోంది.ఉత్తర తెలంగాణ రాజకీయాలను ఎప్పుడూ కుల సమీకరణాలే శాసిస్తాయి. దీనిని పక్కాగా అర్థం చేసుకున్న కాషాయ దళం.. ఈ సారి సరికొత్త సోషల్ ఇంజనీరింగ్‌కు తెరలేపింది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో కింది సామాజిక వర్గాలను టార్గెట్ చేసింది. బలమైన బీసీ సామాజిక వర్గాలైన మున్నూరు కాపు, పద్మశాలి, యాదవ, గౌడ, ముదిరాజ్ సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమవుతోంది. దళిత, గిరిజన ఉపకులాల స్థానిక పెద్దలతో చర్చలు జరుపుతోంది.గ్రామంలో ఐదారు కుటుంబాలను లేదా కనీసం 10 ఓట్లను ప్రభావితం చేయగల సామర్థ్యం ఉన్న ఈ కీలక వ్యక్తులను బీజేపీ నేతలు నేరుగా కలిసి మాట్లాడుతున్నారు. వారి సామాజిక సమస్యల పరిష్కారానికి తాము ఉన్నామంటూ ఒక సామాజిక అనుబంధాన్ని ముమ్మరంగా పెంచుకుంటున్నారు. ఈ మైక్రో లెవెల్ ప్లానింగ్ వల్ల పైకి ఓటర్లు సైలెంట్‌గా ఉన్నా, లోపల మాత్రం కాషాయం వైపు మొగ్గు చూపుతున్నారు.గ్రామాల్లో ఉండే యువజన సంఘాలు, డిజిటల్ నెట్‌వర్క్‌లను బీజేపీ లీడర్లు అత్యంత చాకచక్యంగా వాడుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ పతాక స్థాయి పథకాలు, ఉపాధి అవకాశాలను వివరిస్తూ వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. వ్యవసాయ రంగంలో స్థానిక రైతు గ్రూపులతో మమేకమవుతూ.. పంటల కొనుగోళ్లు, స్థానిక మౌలిక వసతుల లోపాలను కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలుగా ప్రాజెక్ట్ చేయడంలో సక్సెస్ అవుతున్నారు. ఫలితంగా, యూత్ క్లబ్‌లు, రచ్చబండల దగ్గర పొలిటికల్ డిస్కషన్స్ నెమ్మదిగా బీజేపీకి అనుకూలంగా మారుతున్నాయి.ఈ నిశ్శబ్ద ఆపరేషన్ అంతా తక్షణ హడావుడి కోసం కాదు, రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి ఉత్తర తెలంగాణను బీజేపీకి బలమైన కోటగా మార్చడమే దీని ప్రధాన లక్ష్యం. కాంగ్రెస్ అధికార బలంతో, బీఆర్ఎస్ పాత క్యాడర్ బలంతో కొట్టుకుంటుంటే.. బీజేపీ ఏకంగా ఓటు బ్యాంక్ పునాదులనే మార్చేస్తోంది. క్షేత్రస్థాయిలో కుల సంఘాల మద్దతు, తటస్థుల భరోసా తోడైతే, రాబోయే రోజుల్లో ఉత్తర తెలంగాణలో బీజేపీని ఢీకొట్టడం ప్రత్యర్థులకు అంత సులువు కాదనేది రాజకీయ విశ్లేషకుల అంచనా.

# మీ ఏరియా వాల్యూ ఎంతో తెలుసా..?

- మొదటి పేజీ తరువాయి

విభాగంలో మార్కెట్ వాల్యూ సెర్చ్ అని ఉంటుంది. దానిపై క్లిక్ చేయండి
భూముల విలువ చెక్ చేయాలంటే ాఖఅఁ ఖశ్రీబవ మీద క్లిక్ చేయండి
మీరు చెక్ చేయాలనుకున్న జిల్లాను ఎంచుకోండి
ఆ తర్వాత మీరు చెక్ చేయాలనుకున్న మండలం పేరును సెలక్ట్ చేయండి
ఏ గ్రామం/ పట్టణంలో మీరు లాండ్ రేట్ చూడాలనుకుంటున్నారో ఆ పేరు సెలక్ట్ చేసి ాఖదీవీ×ు క్లిక్ చేయండి
మీకు కావాల్సిన డిటెయిల్స్ అన్నీ అక్కడ కనిపిస్తాయి. ఏ ఏరియాలో చదరపు గజం ఎంత ఉందో కనిపిస్తుంది.

**అపార్ట్ మెంట్ మార్కెట్ వాల్యూ తెలుసుకోవాలంటే..**

అపార్ట్ మెంట్ మార్కెట్ విలువ చెక్ చేయాలంటే **Apartment Value** అని ఉంటుంది. దాన్ని సెలక్ట్ చేయాలి.
ఆ తర్వాత ఏ జిల్లానో సెలక్ట్ చేయాలి.
ఆ తర్వాత మండలం పేరు ఎంచుకోవాలి.
ఏ గ్రామం/ పట్టణంలో ఉందో అది సెలక్ట్ చేయాలి.
మీకు కావాల్సిన డిటెయిల్స్ అన్నీ అక్కడ కనిపిస్తాయి. ఏ ఏరియాలో చదరపు అడుగు ఎంత ఉందో కనిపిస్తుంది.
ప్రభుత్వ మార్కెట్ విలువ, బహిరంగ మార్కెట్ విలువ వేర్వేరుగా ఉంటాయి. రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు ప్రభుత్వ మార్కెట్ విలువకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

# జూన్ 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ

- మొదటి పేజీ తరువాయి

సిద్ధం చేసినట్లు తెలిపారు. చివరి వ్యక్తి వరకు చేప ప్రసాదం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు.

**జూన్ 8వ తేదీ రాత్రి 9 గంటలకు**

జూన్ 8వ తేదీ రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ ప్రారంభమై, జూన్ 9వ తేదీ సాయంత్రం వరకు కొనసాగుతుందని వెల్లడించారు. గత సంవత్సరాల కంటే ఎక్కువ సంఖ్యలో కౌంటర్లను ఏర్పాటు చేశామని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**అధైర్యపడకండి**

అలాగే 200 మందికి పైగా మత్స్యశాఖ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని సేవలు అందించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

# చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు

- మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. అందుకే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితమైంది" అని హరీశ్ రావు ఆరోపించారు.ఈ వైఫల్యానికి గానూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, రాబోయే రోజుల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడించి, పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

**ఏపీతో చర్చలు ల్లేవు**

పాలమూరు ప్రాజెక్టు సందర్శన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా, గోదావరి జలాల పంపకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే తెలంగాణ ప్రజలకు శుభవార్త చెబుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఏపీతో చర్చలు జరిపినా రాష్ట్ర చట్టబద్ధమైన వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాము 'పంచాయతీ' కంటే 'పరిష్కారానికే' ప్రాధాన్యత ఇస్తామని... పాలమూరు, డిండి పెండింగ్ ప్రాజెక్టులకు క్లియరెన్స్ వస్తేనే మిగతా చర్చలు ముందుకు సాగుతాయని తేల్చి చెప్పారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరు జిల్లా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని సీఎం మండిపడ్డారు. గత ప్రభుత్వం కనీసం భూసేకరణ పనులను కూడా పూర్తి చేయకపోవడం వల్లే ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేకపోయారని విమర్శించారు. కష్టకాలంలో కేసీఆర్‌ను ఆదుకున్న పాలమూరును అధికారంలోకి వచ్చాక ఆయన పట్టించుకోవడం మానేశారని ఆరోపించారు. వలసల జిల్లా అయిన పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎం.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు

# వయనాడ్‌లో 150 మంది విద్యార్థులకు అస్వస్థత..

- మొదటి పేజీ తరువాయి

చదువుతున్న విద్ష?ర్థుల్లో గత మూడు రోజులుగా జ్వరం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని, వ్యాధికి కచ్చితమైన కారణం ఇంకా తెలియలేదని అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి వ్యాధి మరింత విస్తరించకుండా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. కాగా, పెద్ద సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో అధికారులు ముందస్తు చర్యగా పాఠశాలకు వారం రోజులు సెలవు ప్రకటించారు. దీనిపై జిల్లా వైద్య అధికారి మాట్లాడుతూ, విద్యార్థుల తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు ఆందోళన చెందవద్దని, పరిస్థితి అదుపులోనే ఉందని చెప్పారు. విద్యార్థుల్లో ఎక్కువ మంది చికిత్సకు స్పందిస్తున్నారని, పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. విద్యార్థుల శాంపిల్స్ సేకరించి లాబొరేటరీకి పంపినట్టు చెప్పారు. ఆహారం, తాగునీటి కారణంగా వైరల్ ఇన్‌ఫెక్షన్ సోకిందా, ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనేది పరీక్షల్లో నిర్ధారణవుతుందని తెలిపారు. పంచాయతీ ప్రతినిధులు కూడా ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థుల పరిస్థితి సంతృప్తికరంగానే ఉందని, ఆరోగ్యం బాగా క్షీణిస్తున్న లక్షణాలేవీ లేవని చెప్పారు.

# తెలంగాణలో భారీ వర్షాల హెచ్చరిక.. సీఎస్ కీలక ఆదేశాలు

- మొదటి పేజీ తరువాయి

చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

**సమన్వయంతో పనిచేయాలి..**

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సీఎం జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై చర్చ..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

వార్తాతరంగాలు

ఆదివారం 07 జూన్ 2026

# ఆగని జాగీర్ లొల్లి...

**హైదరాబాద్, జూన్ 6:**చిలికి చిలికి గాలివానలా మారిందన్న మాటకు తగ్గట్లే ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలు మొదలయ్యాయి.తాజాగా తెలంగాణ సెంటిమెంట్ ను పెద్ద ఎత్తున రాజేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే పలు రాజకీయ పార్టీలు ఎవరికి వారు గళాన్ని విప్పుతున్నారు. ఈ సందర్భంలోనే జనసేన గచ్చిబౌలిలో రెండు వేల మందితో సభను నిర్వహించాలని భావించిన జనసేనాని అందుకు తగ్గట్లే పోలీసు పర్మిషన్ కోసం ప్రయత్నించటం.. అందుకు పోలీసులు నో చెప్పటం తెలిసిందే. కోర్టు సైతం సానుకూలంగా స్పందించని నేపథ్యంలో.. తన ఇంటి వద్దే మీడియా భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎవరబ్బ జాగీర్ కాదంటూ గళం విప్పారు. దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మిస్టర్ పవన్ కల్యాణ్.. తెలంగాణ తమ జాగీర్ అని.. ఇంకెవరిది కాదని తేల్చేశారు. పవన్ నోటి నుంచి వచ్చిన జాగీర్ మాటపై అభ్యంతరం వ్యక్తం చేయటం తెలిసిందే. తాజాగా బీఆర్ఎస్ ముఖ్యనేత కేటీఆర్ సైతం పవన్ వ్యాఖ్యల్ని వ్యతిరేకించారు. ఇదంతా ఓకే అనుకునే వేళలో.. కొన్ని సందేహాలు తెర మీదకు వచ్చాయి. బరాబర్.. తెలంగాణ ఎవరి జాగీర్ అనే దానికి తెలంగాణ నేపథ్యం ఉన్న నాలుగున్నర కోట్ల మందిది తెలంగాణ జాగీర్ గా పేర్కొన్నారు. అంటే.. తెలంగాణ అన్నది తెలంగాణ నేటివ్ వాళ్లదే అనే వాదనను ప్రశ్నించాల్సిన అవసరం లేదు. కాకుంటే.. ఒకే ఒక్క సమస్య తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణను వ్యతిరేకించిన గళాలు ఉండనే ఉన్నాయి. మరి.. వారిది కూడా తెలంగాణ జాగీరేనా? అన్నది ప్రశ్న. ఎందుకంటే..తెలంగాణ ఉద్యమ సమయంలో కొత్త రాష్ట్ర ఏర్పాటును సుతారం ఒప్పుకోకపోవటమే కాదు.. వ్యతిరేకిస్తూ ఓపెన్ గా మాట్లాడేసిన సీపీఎంతో పాటు మజ్లిస్ పార్టీల సంగతేంటి? ఆ పార్టీల అధినేతలు.. కీలకనేతలు.. కార్యకర్తలు.. ఇతరులు అందరూ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారే కదా? సీపీఎం గురించి మళ్లీ ప్రస్తావించాల్సిన అవసరం లేదు.

## ఈనెల 8 న మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రులు

**పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరి**



**హైదరాబాద్:**ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడుఅనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, షాట్ చైర్మన్ శివసేనారెడ్డి,ఇతర అధికారులు.ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ కి సంబంధించి ఏర్పాటు చేసిన భారీకేడ్ లను పరిశీలించారు.చేప ప్రసాదం పంపిణీ ఈసారి 8 న రాత్రి 9 గంటలకు ప్రారంభం అవుతుండడంతో వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించిన మంత్రులు.క్యూలైన్ లలో తొక్కిసలాట జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని శాంతి భద్రతలకి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తెలిపారు.విద్యుత్ సరఫరా లో ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు వేసవి కాలం ఉక్కపోత గా ఉండడంతో క్యూ లైన్ లు ఉన్న ప్రాంతాల్లో ఫ్యాన్ లు కూలర్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.చేప ప్రసాదం పంపిణీ పూర్తయ్యే వరకు అన్ని విభాగాల అధికారులు వాట్సప్ గ్రూప్ ద్వారా పర్యవేక్షణ చేయాలని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో కంట్రోల్ రూమ్ ద్వారా మానిటరింగ్ చేయాలని ఆదేశించారు.శాంతి భద్రతలు,మౌలిక సదుపాయాలు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం చేప ప్రసాదంపై వందల సంవత్సరాలుగా ప్రజల విశ్వాసం ఉంది.

## ఫోన్ ట్యాపింగ్ నిందితులకు శిక్ష పడాల్సిందే...

**ఎంపీ చామల కిరణ్ కుమార్**



**హైదరాబాద్, జూన్ 6:** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కిరణ్ స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డ్ చేశారు. గతంలో చామల ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహరచనలో కిరణ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఎన్నికల వ్యూహాలను పసిగట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సిట్ విచారణ అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. సిట్ ఈరోజు తనను బాధితుడిగా విచారణకు పిలిచిందని అన్నారు. తాను మీడియా కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఫోన్ ట్యాప్ అయ్యిందని సిట్ అధికారులు చెప్పారని ఎంపీ తెలిపారు. ఆనాడు బీఆర్ఎస్ సొంత పార్టీ మంత్రుల ఫోన్‌లు కూడా ట్యాప్ చేసినట్లు తెలిపారు. 'జులై 30న నా ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించింది. జులై 30 నుంచి అసెంబ్లీ ఎన్నికల వరకు నా ఫోన్ ట్యాప్ అయింది' అని ఎంపీ వెల్లడించారు. నిజాం పాలనలో నిజాం రాజు.. రజాకార్లపై కూడా ఇంతలా నిఘా పెట్టి వేధించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తన ఐఫోన్‌కి అలర్ట్ వచ్చిందని.. అయితే అది నార్మల్‌గా వచ్చే అలర్ట్ అని భావించినట్లు చెప్పారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ ముఖ్య నేతలతో మాట్లాడే విషయాలన్నీ తెలుసుకునేవారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వేరే పార్టీకి వెళ్లే వాళ్లని ముందుగానే గుర్తించి బెదిరింపులకి పాల్పడినట్లు ఆరోపించారు.

## లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం: మహేశ్ గౌడ్



**హైదరాబాద్, జూన్ 6:** నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని చేతగాని తనం వల్ల లక్షలాది విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. నీట్ పరీక్ష వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు నెలల తరబడి కష్టపడి సిద్ధమైతే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి శ్రమ వృధా అయ్యిందని మహేశ్ అన్నారు. నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారాన్ని వేస్తూ ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.


## ఎస్ ఐ ఆర్ ప్రక్రియ...

# యాక్టివ్ అవుతున్న బూత్ లెవల్ కమిటీలు




**హైదరాబాద్, విజయవాడ, జూన్ 5:**భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతోనే అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ తీవ్ర అప్రమత్తమయ్యాయి. తమ సానుభూతిపరుల ఓట్లు ఎక్కడైనా గంపగుత్తగా తొలగిపోతాయేమోననే భయంతో అన్ని రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో తమ బూత్ లెవెల్ ఏజెంట్ల ను రంగంలోకి దించాయి. ఎన్నికల సంఘం సాధారణంగా ప్రతి ఏటా ఓటర్ల జాబితా సవరణ చేపడుతుంది. కానీ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది చాలా ప్రత్యేకమైనది. ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులు నేరుగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉండటం, చనిపోయిన వారి ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు, ఒకే ఓటరుకు రెండు మూడు చోట్ల ఉన్న డబుల్ ఓట్లను గుర్తించి జాబితా నుండి పూర్తిగా తొలగిస్తారు. అలాగే అర్హులైన కొత్త ఓటర్లను చేర్చుతారు.రాజకీయ పార్టీలకు ఈ ప్రక్రియ ఒక పెద్ద పరీక్ష లాంటిది. ఒక నియోజకవర్గంలో గెలుపోటములను కొన్ని వందల లేదా వేల ఓట్లు నిర్ణయిస్తుంటాయి. ఈ తీవ్రమైన ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో.. స్థానిక అధికారులు పొరపాటునో లేదా ఏకపక్షంగానో తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను వలస వెళ్లారు లేదా చిరునామా లేదు అనే నెపంతో తొలగిస్తే.. ఆ నష్టం పూడ్చలేనిది అవుతుంది. అందుకే ఓట్లు తగ్గిపోకూడదని, తమ క్యాడర్ ఓట్లు గల్లంతు కాకూడదని పార్టీలు విపరీతమైన టెన్షన్ పడుతుంటాయి.ఈ పరిస్థితిని తట్టుకోవడానికి ప్రతి పార్టీ తమ బూత్ లెవెల్ ఏజెంట్ల ను అప్రమత్తం చేస్తున్నాయి. ప్రభుత్వ బూత్ లెవెల్ అధికారి ఇంటింటికీ తిరిగేటప్పుడు.. ఈ పార్టీ బీఎల్‌ఏలు కూడా వారితో పాటు తిరిగి, ఏ ఒక్క సానుభూతిపరుడి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాపలా కాస్తారు. ఒకవేళ ప్రతిపక్ష ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులుంటే చనిపోయిన వారివి, డబుల్ ఓట్లు వాటిని తొలగించాలంటూ ఫామ్-7 ద్వారా అధికారులపై ఒత్తిడి తెస్తుంటారు. డిజిటల్ డేటా ద్వారా ఈ ప్రక్రియను పార్టీల ఐటీ విభాగాలు కూడా నిశితంగా గమనిస్తున్నాయి.సాంకేతికంగా ఓటు పోతే మళ్లీ చేర్పించుకోవడానికి ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. కానీ, ప్రాక్టికల్‌గా అది చాలా కష్టతరమైన ప్రక్రియ. ఒకసారి ఇంటెన్సివ్ రివిజన్ పూర్తయి, ఫైనల్ రోల్ విడుదలయ్యాక.. మళ్లీ ఓటు చేర్పించాలంటే సదరు ఓటరు వ్యక్తిగతంగా ఆసక్తి చూపించాలి. సాధారణంగా సాధారణ ఓటర్లు అంత శ్రద్ధ తీసుకోరు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి వేలాది మంది ఓట్లు పోయాయని గ్రహించినా.. అప్పటికప్పుడు లక్షలాది ఓట్లను తిరిగి చేర్పించడం ఏ రాజకీయ పార్టీకైనా అసాధ్యమైన టాస్క్. అందుకే నివారణే మేలు అన్నట్లు ముందే అలర్ట్ అవుతారు.ఇక్కడ అసలు ట్విస్ట్ ఉంది. సిద్ధాంతపరంగా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కావాలని అన్ని పార్టీలు పైకి చెప్తాయి. కానీ, క్షేత్రస్థాయి ప్రాక్టికల్ రాజకీయాల్లో ఏ పార్టీకి కూడా వంద శాతం క్లీన్ లిస్ట్ ఇష్టం ఉండదు. ఎందుకంటే, ప్రతి నియోజకవర్గంలోనూ దొంగ ఓట్లు , డబుల్ ఓట్లు లేదా చనిపోయిన వారి ఓట్లు తమకు అనుకూలంగా పోల్ అవుతాయని స్థానిక లీడర్లు నమ్ముతారు. తమకు అనుకూలమైన దొంగ ఓట్లను కాపాడుకుంటూ.. ప్రత్యర్థి పార్టీకి చెందిన నకిలీ ఓట్లను తొలగించాలనే ద్వంద్వ నీతి ని అన్ని పార్టీలు అవలంబిస్తుంటాయి. ఓటర్ల జాబితా అనేది ప్రజాస్వామ్యానికి పునాది. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఎన్నికల సంఘం నకిలీ ఓట్లకు గండి కొట్టాలని చూస్తుంటే.. రాజకీయ పార్టీలు మాత్రం తమ ఓటు బ్యాంకు చెదరకుండా చూసుకునే వ్యూహాల్లో మునిగిపోయాయి. ఈ ప్రక్రియ ముగిసేసరికి ఏ పార్టీ తన బూత్ స్థాయి యంత్రాంగాన్ని సమర్థవంతంగా వాడుకుంటుందో.. ఆ పార్టీ రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా ముందంజలో ఉంటుంది.

# మార్కెట్లో నకిలీ విత్తనాలు...



**అదిలాబాద్, జూన్ 6:**ఆరుగాలం కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చుకుని పంటలు పండించే రైతులకు చీడ, పీడలతోనే కాదు.. రైతు సమాజానికి చీడపురుగుల్లా దాపురించిన నకిలీ విత్తన విక్రేతలతోనూ ప్రమాదం ఏర్పడింది. వీరితో జాగ్రత్తగా లేకుంటే రైతుల వ్యవసాయానికి మొదటికే మోసం వచ్చేలా పరిస్థితులున్నాయని అధికారులంటున్నారు. తమ కంపెనీ విత్తనాలు వాడితే పంట సాగులో చీడ పీడల బెడద ఉండదని, వాటి నివారణ కోసం ప్రత్యేకంగా ఎలాంటి ఎరువులు వాడాల్సిన అవసరమే రాకుండా పంటలు సాగు చేయొచ్చనే ఆశలు చూపించి అమాయక రైతులను మోసం చేసేందుకు నకిలీ విత్తన విక్రేతలు మార్కెట్ లో చొరబడ్డారు. వారిని నియంత్రించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది.కొత్త కొత్త బ్రాండ్లతో రైతులకు విత్తనాలను అంట గట్టేందుకు మహారాష్ట్ర లోని కొన్ని నాసిరకం విత్తన తయారీ సంస్థల్లో తయారైన విత్తనాలను జిల్లాలో మార్కెటింగ్ కోసం తీసుకొచ్చి జిల్లాలో కొందరు సీడ్స్ షాపులకు సప్లై చేస్తునట్లు తెలుస్తోంది. ఆయా కంపెనీల ప్రతినిధులు నేరుగా అయాయక రైతులకే అమ్ముతున్నట్లు రైతులు చెబుతున్నారు. నకిలీ విత్తన విక్రేతలు మార్కెట్ లోకి వచ్చేశారు. నేరుగా రైతులకే కాకుండా విత్తనాల డీలర్లకు కూడా ఎక్కువ మొత్తంలో కమిషన్ ఆశ చూపి తమ కంపెనీలకు చెందిన విత్తనాలను ఎక్కువ మొత్తంలో మార్కెట్లో విక్రయించేలా ప్లాన్ చేస్తున్నారు. అయాయక చిన్న సన్నకారు రైతులను ఈ నకిలీ విత్తన విక్రేతలు బురిడీ కొట్టించి నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రమాదం పొంచి ఉంది.ఇప్పటికే కొన్ని కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీకి చెందిన బ్రాండ్ల విత్తనాల గురించి గ్రామాల్లో ప్రచారం చేస్తూ సీడ్స్ మార్కెట్ చేస్తున్నట్లు రైతులు అంటున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై నకిలీ విత్తనాల విషయంలో ఓ పక్క రైతులను చైతన్యపరుస్తూనే, మరో పక్క నకిలీ విత్తనాల నియంత్రణ కోసం వ్యవసాయ శాఖ, పోలీస్, రెవెన్యూ తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందాలతో జిల్లా వ్యాప్తంగా సీడ్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఈ టాస్క్ ఫోర్స్ టీంలు విస్తృతంగా తిరుగుతూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండటంతో సీడ్స్ షాప్ నిర్వాహకులు ఆందోళనకు గురవుతున్నారు.జిల్లాలో 455 విత్తనాలు విక్రయించే రిజిష్టర్డ్ షాప్స్ ఉన్నాయి. రైతులు ప్రతి సీజన్ లో తమకు అందుబాటులో ఉన్న షాపుల్లో రెగ్యులర్ గా వెళ్లి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. రిజిస్ట్రార్డ్ సీడ్స్ షాపుల్లో ప్రభుత్వ నిబంధనలకు లోబడి సీడ్స్ అమ్మకాలు జరపాల్సి ఉంది. కొన్ని షాపుల్లో ఎక్కువ మొత్తంలో కమిషన్లు చెల్లించే కంపెనీలకు చెందిన బ్రాండ్లు కూడా అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. నిబంధలను విరుద్ధంగా అమ్మాల్సిన కొత్త కంపెనీలకు చెందిన విత్తనాలను షాపుల్లో కాకుండా ఇతర రహస్య ప్రాంతాల్లో ఉంచి వాటిని కావాలనుకున్న రైతులకు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో వ్యవసాయ పనుల కోసం రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వర్షాలు కురవడం ప్రారంభం కాగానే వ్యవసాయ పనులు కూడా ఊపందుకోనున్న తరుణంలో రైతులు ముందుగా విత్తనాలు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకుంటున్నారు.జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల ఏరివేతకు, వాటి నియంత్రణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన టాస్క్ ఫోర్స్ టీంలు అన్ని సీడ్స్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. ఎక్కడా ఏ షాపును వదలకుండా అన్ని షాపులను ఈ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. షాపుల్లో ఎలాంటి అనుమానాస్పద ప్రొడక్ట్ కనిపించిన.. అవి నకిలీ విత్తనాలని తేలినా చట్టపరమైన చర్యలు తప్పవని, షాపు లైసెన్సు కూడా రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. నకిలీ విత్తనాలు లేని జిల్లాగా రైతులు ఆరోగ్యకరమైన వ్యవసాయం చేసుకునే వాతావరణాన్ని కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వీరాస్వామి అన్నారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని, ప్రతి మంగళవారం రైతు వేదికల్లో ఏర్పాటు చేస్తున్న సమావేశాల్లో కూడా రైతులకు నకిలీ విత్తనాలపై ఏడీఏలు, ఏఈఓ లు అవగాహన కల్పిస్తున్నట్లు జేడీఏ తెలిపారు. అన్ని ప్రముఖ కంపెనీలకు చెందిన విత్తనాలు విక్రయించే షాపులన్నింట్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నటు తెలిపారు.

## అడుగంటుతున్న

# భూగర్భజలాలు...



**హైదరాబాద్, జూన్ 6:**నగరంలో భూగర్భ జలాలు ముందు ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయికి పడిపోతున్నాయి. భూగర్భంలో దాగున్న నీటిని పైకి తీసుకురావాలనే తాపత్రయంతో నగరవాసులు వందలాది మీటర్ల లోతుకు బోర్ల తవ్వకాలు జరుపుతున్నారు. ఎటు చూసినా బోరుబావుల యంత్రాలు తిరుగుతూ విచ్చలవిడిగా కొత్త బోర్లు తవ్వేస్తున్నాయి. నివాస సముదాయాల్లో పాత బోరుబావులు ఎండిపోవడంతో, ప్రత్యామ్నాయంగా భూగర్భాన్ని జల్లెడగా మారుస్తూ కొత్తవాటిని వేయిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా బోరింగ్ మిషన్ల శబ్దాలు మార్మోగుతున్నాయి. గత 15 రోజుల వ్యవధిలోనే నగర వ్యాప్తంగా సుమారు 2,500కి పైగా కొత్త బోర్లు వేసినట్లు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే ముమ్ముందుకూ కొనసాగితే నగరంలో తీవ్రమైన జల సంక్షోభం తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ సంవత్సరం మే నెలలో గరిష్ట స్థాయిలో నమోదైన తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా భూగర్భ జలాలు గతంలో కంటే సగటున 5 నుంచి 10 మీటర్ల మేర కిందికి దిగజారాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్ పరిధిలోని గచ్చిబౌలి, మాదాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాలతో పాటు అమీర్‌పేట్, కూకట్‌పల్లి, ఉప్పల్ పరిసరాల్లో భూగర్భ జలాలు అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. గత సంవత్సరం మే నెలతో పోల్చి చూస్తే.. ఈసారి దాదాపు 8 మీటర్ల లోతుకు నీటి మట్టాలు పడిపోయినట్లు భూగర్భ జల వనరుల శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో వందల మీటర్లలో పడిన నీరు ఇప్పుడు కనీసం 1000 నుంచి 1500 మీటర్ల లోతుకు దాటిపోయింది. అయినా సరే కొన్ని చోట్ల చుక్క నీరు కూడా రావడం లేదు. నగరంలో ప్రస్తుతం పాత బోర్లు పూర్తిగా ఎండిపోవడంతో, నివాసితులు కొత్త బోర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లలో నీటి అవసరాలు తీరక రికార్డు స్థాయిలో లోతైన బోర్లు వేస్తున్నారు.నగరం తన పచ్చదనాన్ని కోల్పోయి కాంక్రీట్ వనంగా మారడమే ఈ ప్రస్తుత దుస్థితికి ప్రధాన కారణంగా మారుతోంది. ప్రతి ఇల్లూ, అపార్ట్‌మెంట్ చుట్టూ సిమెంటింగ్ చేయడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు అసలు అవకాశం లేకుండా పోయింది. గతంలో చెరువులు, కుంటలు, ఖాళీ స్థలాలు వరద నీటిని పట్టి ఉంచి భూగర్భ జలాలను పెంచేవి. కానీ నేడు ఆ స్థలాలన్నీ బహుళ అంతస్తుల భవనాలుగా మారిపోవడంతో, పడే వర్షపు నీరంతా వృధాగా డ్రైనేజీల ద్వారా నాలాల్లోకి కొట్టుకుపోతోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండానే రంగారెడ్డినగర్ వంటి ప్రాంతాల్లో గురువారం యథేచ్ఛగా బోర్ల తవ్వకాలు జరపడం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

## సొంత పార్టీ ఎమ్మెల్యే అరెస్టు చేయించాడు..

**రంగారెడ్డి:**రైతులకు న్యాయం చేయమని అడిగినందుకు సొంత పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అరెస్టు చేయించారని స్థానిక నేతలు ఆరోపించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కోహెడలో ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం రైతుల నుండి ప్రభుత్వం భూసేకరణ చేస్తుంది. భూమి కోల్పోతున్న రైతులకు న్యాయపరమైన పరిహారం ఇవ్వాలని ఆందోళనకు దిగిన కోహెడ కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసారు. గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం, మల్రెడ్డి రంగారెడ్డి కోసం పనిచేశామని, ఇప్పుడు రైతులకు న్యాయం చేయమని అడిగినందుకు మమ్మల్నే అరెస్ట్ చేస్తున్నారని న బాధిత కాంగ్రెస్ కార్యకర్తలు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అందోళనకు కాక్రోచ్ పార్టీ సిద్ధం

**న్యూఢిల్లీ:**కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అమెరికా నుండి ఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ, సియూఈటీ, ఎస్ఎస్సి జీడీ పరీక్షల అవకతవకలపై నిరసన తెలుపుతున్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ పార్టీ ్రా డిమాండ్ చేస్తోంది.

## లవ్ బ్రేకప్ చెప్పిందని ఆఫీస్లోనే ప్రియురాలి హత్య

**ఛండీఘర్:**కత్తితో యువతిని యువకుడు దారుణంగా పొడిచి చంపాడు. పంజాబ్ రాష్ట్రం మొహాలీలో ఘటన జరిగింది. ఒకే కంపెనీలో పనిచేస్తున్న డింపుల్(30), హర్జిందర్ సింగ్ (39) మూడేళ్లుగా ప్రేమలో ఉన్నారు. యువతి లవ్ బ్రేకప్ చెప్పడంతో ఆఫీసులోనే ప్రియుడు వెంటపడి కత్తితో దాడి చేసి చంపేసాడు. ఆ తర్వాత తనను తాను పొడుచుకొని సూసైడ్ అటెంప్ట్ చేసాడు.

# మోడీ ప్రభుత్వశీ అనుసరిస్తున్న వ్యవసాయ , రైతు వ్యతిరేక విధానాలను విడనాడి- రైతు ఉత్పత్తి ఖర్చుల ప్రతిపాదికన సమగ్రమైన మద్దతు ధరలు కేటాయించాలి

## దిఅఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్

**నారాయణపేట జూన్ 6 (స్కై న్యూస్ )** శనివారం అఖిల భారత ఐక్య రైతు సంఘం( ఏఐకేయూఎస్ ) జాతీయ మహాసభల పిలుపులో భాగంగా నారాయణపేట మండల తహసిల్దార్ కార్యాలయం ముందు మండల అధ్యక్షులు బి నారాయణ అధ్యక్షతన ధర్నా నిర్వహించి దేశ రైతాంగ సమస్యల పరిష్కారానికై డిమాండ్లతో కూడిన వినతి పత్రం మండల గిర్దవర్ గోపాల్ రావు కి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బి యాదగిరి మాట్లాడుతూ రోజురోజుకు వ్యవసాయా ఉత్పాదకాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ముఖ్యంగా, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, డి ఏ పి,కాంప్లెక్స్ ఎరువుల ధరలు విపరీతంగా తిరిగాయి. మరో వైపున మార్కెట్లో యూరియా అందుబాటులో ఉండటం లేదు రైతాంగానికి ఈ ఖరీఫ్ సీజన్ ఒక గుదిబండగా మారనుంది పెట్టుబడును తడిసి మూతడౌతున్నాయి. కానీ రైతులు పండిస్తున్న పంటలకు మాత్రం ప్రభుత్వం కనీస మద్దతు ధరలను పెరుగుతున్న పెట్టుబడులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయం చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం 2026 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలు వరికి రూ 72/- లు,మొక్కజొన్న 10/- రూ. లు ,పెసర 12/- రూ. లు టన్ను చెరుకు కు 100 రూపాయలు ఇలా నామమాత్రంగా ప్రకటిస్తూ నిర్ణయం చేసింది. ఎరువులు విత్తనాలు క్రిమి సంహారక మందుల ధరలు వందలలో




పెరిగితే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మాత్రం రూపాయలల్లో పెంచి మేము కూడా ధరలు పెంచినామని చేతులు దులుపుకుంటున్నారు. వ్యవసాయ రంగ సంక్షోభానికి ప్రత్యక్షంగా కేంద్ర ప్రభుత్వం కారణమవుతున్నదన్నారు. అమెరికా-భారత్ వాణిజ్య అసమాన ఒప్పందం వలన దిగుమతిసుంకాన్ని పూర్తిగా ఎత్తివేసి దేశంలోకి తక్కువ పెట్టుబడి తో ఉత్పత్తి అయిన విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు ఇబ్బడి ముబ్బడిగా దిగుమతి చేసుకోవడం వలన దేశంలో వ్యవసాయ ఉత్పత్తి దెబ్బతింటుంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక ,కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తున్నది. వీటికి వ్యతిరేకంగా దేశ రైతాంగం ఐక్యంగా పోరాడాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) , జాతీయ మహాసభలు దేశవ్యాప్తంగా జూన్ మొదటి వారంలో మండల, డివిజన్, జిల్లా కేంద్రాలలో ఆందోళనలకు పిలుపునిచ్చిందన్నారు.ఇప్పటికైనా అధికారం లోకి రాక ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన నెట్వర్క్ డి ఎ పి, కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించాలి. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు (మీస్రా) సమగ్ర ఉత్పత్తి ఖర్చుల ప్రాతిపదికన స్వామినాథన్ సిఫారసుల మేరకు జ2ం 50% ప్రకారం ధర నిర్ణయం చేయాలి.అసమానతలతో కూడుకున్న అమెరికా ,భారత్ వాణిజ్య ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలి. రైతుల వ్యవసాయ రుణాలు అన్నింటిని మాఫీ చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకై జూన్ 8న జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాలు రైతులు అధిక మొత్తంలో పాల్గొని జయప్రదం చేయాలని రైతాంగానికి పిలుపునిచ్చారు. ధర్నా కార్యక్రమంలో అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, సహాయ కార్యదర్శి ఏ రాములు, మండల కార్యదర్శి బాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యక్షులు వెంకట్ రాములు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ టౌన్ కార్యదర్శి కేంచే నారాయణ, మండల కార్యదర్శి బి నరసింహ, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు వెంకటేష్, వెంకటయ్య, బాలు, శ్రీకాంత్ తోపాటు రైతులు పాల్గొన్నారు.

# ఉట్కూర్ గ్రామసభ ముగింపు సమస్యల చర్చ లేకుండానే గ్రామసభ ముగింపు.. గ్రామస్థుల ఆగ్రహం

**ఉట్కూర్ జూన్ 6( స్కై న్యూస్ ):**మేజర్ గ్రామపంచాయతీలో శనివారం నిర్వహించిన గ్రామసభలో వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, వన మహోత్సవం, ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ, వరద నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఎంపీడీవో కిషోర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆయా అంశాలను సభలో చదివి వినిపిస్తూ వాటి ప్రాధాన్యతను వివరించారు. గ్రామంలో పరిశుభ్రత పాటించడం, నీటి వృథాను అరికట్టడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వర్షాకాలంలో వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రజలకు సూచనలు చేశారు. సర్పంచ్ రేణుక భరత్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను నిర్వర్తించాలని కోరారు. అయితే గ్రామసభలో ప్రధానంగా ప్రణాళికలో పొందుపరిచిన అంశాల పఠనానికే ఎక్కువ సమయం కేటాయించారని గ్రామస్థులు ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు గంటకు పైగా వివిధ



అంశాలను చదివి వినిపిస్తూ, వాటిలో ప్రజలు చేసే తప్పులను ప్రస్తావించారని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతి, గత గ్రామసభల్లో ఆమోదించిన తీర్మానాల అమలు పరిస్థితి, పెండింగ్ సమస్యల పరిష్కారంపై స్పష్టమైన చర్చ జరగలేదని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామసభ ముగింపు దశలో పలువురు గ్రామస్థులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్యలు, పారిశుధ్య లోపాలు, డ్రైనేజీ సమస్యలు, రహదారుల మరమ్మతులు, ఇతర ప్రజా సమస్యలపై చర్చించకుండా సభను ముగించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. గత గ్రామసభల్లో తీసుకున్న నిర్ణయాలు ఎంతవరకు అమలయ్యాయో ప్రజలకు వివరించాలని, గ్రామాభివృద్ధి పనులపై సమగ్ర సమాచారం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామసభలు కేవలం ప్రభుత్వ మార్గదర్శకాల పఠనానికే పరిమితం కాకుండా, ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా మారాలని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజల సూచనలు, అభ్యంతరాలు, అవసరాలను పరిగణనలోకి తీసుకొని గ్రామసభలను నిర్వహించినప్పుడే వాటి అసలు ఉద్దేశం నెరవేరుతుందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఎంపీడీవో కిషోర్. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు. గ్రామ సర్పంచ్ రేణుక భరత్. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పండ్ల మార్కెట్ ప్రారంభోత్సవానికి తరలిన రైతులు...



**నారాయణపేట జూన్ 6 (స్కైన్యూస్):** ముఖ్యమంత్రి చేతులమీదుగా అంతర్జాతీయ సమీకృత ,పండ్ల మార్కెట్ రంగారెడ్డి జిల్లా" కోయిడ" లో ప్రారంభోత్సవం చేస్తున్న సందర్భంగా నారాయణపేట నుండి రైతులు తరలి వెళ్లారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి ఆధ్వర్యంలో 60 మంది రైతులు కార్యక్రమానికి బయలుదేరారు. ఇందులో భాగంగా మార్కెట్ కార్యదర్శి భారతి, మార్కెట్ సూపర్డెంట్ లక్ష్మణ్, భారతీయ కిసాన్ సంగ్ నాయకులు వెంకోబ, కమిటీ సభ్యులు,రైతులు మార్కెట్ డైరెక్టర్లు ,సిబ్బంది దడవైలు పాల్గొనగా నారాయణపేట జిల్లా నుండి వెంకోబా,అనంత్ రెడ్డి, శరణయ్య స్వామి ,శాస మూల బాలప్ప, ఆకుల వెంకటప్ప ,ప్రభు మీ స్కిన్ గొడుగు లక్ష్మీనారాయణ, జాజాపురం లక్ష్మీకాంత్ తింగనోళ్ల బుగ్గప్ప, ఓబులాపురం మైపాల్ రెడ్డి, పగిడిమారి నరసింహారెడ్డి, శాసనపల్లి ఘన్ప శ్రీనివాస్, బాపనపల్లి రాము ,షేర్నపల్ల కూర రాములు ,వీరప్ప, వెంకటప్ప , దామరిగిద్ద సుభాష్ కురువ బాలప్ప మల్లేష్ గౌడ్ మరికల్ ఎల్లప్ప తదితర రైతులు ఉన్నారు.

## బౌండ నాగ్ నాథ్ ను దర్శించుకున్న నాగురావు నామాజీ

**నారాయణపేట జూన్ 6: (స్కైన్యూస్)** మహారాష్ట్రలోని ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన బౌండ నాగ్ నాథ్ జ్యోతిర్లింగాన్ని శనివారం బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ దర్శించుకున్నారు.తన జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి లోక కల్యాణాన్ని ఆకాంక్షించారు.తన జన్మదినాన్ని ఆలయంలో



పూజలు నిర్వహించి సాదాసీదాగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా నాగురావు నామాజీ కి పలువురు నాయకులు,ఆత్మీయులు,అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# పరిశుభ్రమైన గ్రామం ఆరోగ్యవంతమైన సమాజం

## ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యం:ఎంపీడీవో లక్ష్మి నరసింహ

**చిన్న చింతకుంట జూన్ 6 (స్కై న్యూస్);** చిన్నచింతకుంట మండలం, పర్దీపూర్ గ్రామ పంచాయతీలో శనివారం ఉదయం 10 గంటలకు ఎం పి డి ఓ లక్ష్మీ నర్సింలు సమక్షంలో సర్పంచ్ తెలుగు శివ కుమార్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్-- 2026 నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, ఇంటి వద్దనే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి ఇవ్వాలని సూచించారు.పరిశుభ్రమైన గ్రామ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.గ్రామాభివృద్ధి ప్రజారోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి ప్రజలకు అవగాహన కల్పించారు. మంచినీటి సరఫరా మెరుగుదల పైపులైన్ లీకేజీల నివారణ తాగునీటి క్లోరినేషన్ ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతల నిర్మాణం,మురుగు కాలువల చివర సోక్‌పిట్ల ఏర్పాటు, కన్నతల్లి పేరున ఒక మొక్క కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం విజయవంతం గా నాటాలి అన్నారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలికి పర్యావరణహిత బ్యాగుల వినియోగించుకోవాలి



అన్నారు.చికెన్, మటన్ కొనుగోలు సమయంలో ప్లాస్టిక్ కవర్లకు బదులుగా స్టీల్ డబ్బా వాడడం మంచిది అన్నారు.దోమల నివారణ కోసం ప్రతి 15 రోజులకు ఫాగింగ్ నిర్వహణ చేస్తామన్నారు.నిల్వ నీటి గుంతలలో ఆయిల్ బాల్స్ వేయడం ద్వారా దోమల నియంత్రణ చేస్తామన్నారు.ఉపాధి హామీ పనుల్లో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనిగ్రామ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యమే గ్రామాభివృద్ధికి పునాది వేసుకుందామని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోపంచాయతీ కార్యదర్శి, హార్టికల్చర్ అధికారి శృతి, ఏ ఎన్ ఎం సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో గిరిజన యువకుడిపై దాడి

## షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

**రంగారెడ్డి జిల్లా జూన్ 6: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని అయ్యప్ప కాలనీలో గిరిజన యువకుడిపై దాడి చేసి కులం పేరుతో దూషించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు పోలీసుల వివరాల ప్రకారం, ఫరూక్‌నగర్ మండలంలోని గుండ్యా నాయక్ తండాకు చెందిన పాత్లావత్ సందీప్ (22) ఈ నెల 5వ తేదీన సాయంత్రం అయ్యప్ప కాలనీలో లారీ మరమ్మతు పనులు చేస్తుండగా ఓ కారులో వచ్చిన వ్యక్తులు మరో ద్విచక్ర వాహనదారుడితో




వాగ్వాదానికి దిగారు ఈ క్రమంలో సందీప్ జోక్యం చేసుకుని ప్రశ్నించగా అతనితో పాటు కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు దాడి సమయంలో బాధితులు లంబాడీ భాషలో మాట్లాడుతుండగా, వారు లంబాడా గిరిజన వర్గానికి చెందినవారని తెలుసుకుని కులం పేరుతో అవమానకర పదజాలంతో దూషించారని ఆరోపించారు అనంతరం ఇంటి వద్దకూ వెళ్లి బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు ఈ ఘటనలో మల్లేష్, టిల్లు, మనోజ్, అరుణ్, సుమన్, అనూక్ మరికొందరు పాల్గొన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు ఫిర్యాదు మేరకు షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు భారతీయ న్యాయ సంహిత ( బి.ఎన్.ఎస్)లోని పలు సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేశారు.

# అనాథ బాలికలకు నేరుగా పాలిటెక్నిక్ లో ప్రవేశం

**నారాయణపేట జూన్ 6: (స్కై న్యూస్):**అనాథలు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన బాలికలకు ఎటు వంటి ప్రవేశ పరీక్ష లేకుండానే నేరుగా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తు న్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎల్. రాజేందర్ గౌడ్ తెలిపారు.హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహి ళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రా నిక్స్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరిం గ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజి నీరింగ్, డిప్లొమా ఇన్ సీపీ కండక్టర్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ల్యాండ్ సర్వేయింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.2026-27 విద్యా సంవత్స రంలో పదవ తరగతి పూర్తి చేసిన అర్హత కలిగిన బాలిక లు ఈ అవకాశాన్ని సద్వి ని యోగం చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థినులకు ఫీజు, వసతి, భోజన సౌకర్యాలు పూర్తిగా ఉచితంగా అందించబడతా యని తెలిపారు. దరఖా స్తుదారులు తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రం (అనాథలకు), హోమ్/హాస్టల్ బోనాఫైడ్ సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం, పదవ తరగతి మార్కుల మెమో, స్టడీ సర్టిఫికేట్ రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో ఈ నెల 8వ తేదీ లోపు జిల్లా మహి ళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం, నారాయణ పేటలో దరఖాస్తు చేసుకో వాలని తెలిపారు.

# ఇంద్రానగర్ కాలనీలో కొత్త బోర్‌మోటార్ ప్రారంభం

**రంగారెడ్డి జిల్లా జూన్ 6:( స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని 26వ వార్డు ఇంద్రానగర్ కాలనీలో తాగునీటి సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాయి రాజా టాకీస్ సమీపంలో ఏర్పాటు చేసిన కొత్త బోర్‌మోటార్‌ను



మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు అమలు చేస్తోందన్నారు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు ఇంద్రానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఈ బోర్‌మోటార్ ద్వారా స్థానికులకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని అధికారులు పేర్కొన్నారు ప్రజలకు నిరంతరాయంగా పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి పనిచేస్తోందని చైర్మన్ అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఎస్పీ శివ, నాగమణి, బొట్టు రాజు, దాసు, ప్రకాష్, జాను, నగేష్, రామచంద్రయ్య, జ్యోతి, మున్సిపల్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఫరూఖ్‌నగర్ మండలంలో ప్రీ-ప్రైమరీ తరగతులకు ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకం

**రంగారెడ్డి జిల్లా జూన్ 6: ( స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల ప్రాథమిక పాఠశాలతో పాటు షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్ కాలనీ, క్రిస్టియన్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, వెంకటేశ్వర కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయి ఈ మేరకు ఆయా పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి మనోహర్ తెలిపారు ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు



ఇంటర్మీడియట్ అర్హత, ఆయా పోస్టుకు ఏడవ తరగతి అర్హతగా నిర్ణయించారు టీచర్ ట్రైనింగ్ (డీఎల్‌ఎడ్/డీఈఈడ్) అర్హతలు కలిగిన వారికి, అలాగే స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ బుధవారం సాయంత్రంలోపు మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్సీ) ఫరూఖ్‌నగర్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు మరిన్ని వివరాలకు 9603554546 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# తాగునీటి సమస్యపై తక్షణమే స్పందించిన - గ్రామ సర్పంచ్ ఆంజనేయులు

**నారాయణపేట జూన్ 6: (స్కైన్యూస్)** నారాయణపేట మండలంలోని పేర పళ్ళ గ్రామంలో ఎనిమిదో వార్డులో లో వార్డు ప్రజలు తాగు నీటి సమస్య గురించి,వార్డ్ మెంబర్ బి లక్ష్మి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్ళడంతో, గ్రామ సర్పంచ్ ఆంజనేయులు



వెంటనే స్పందించి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి దృష్టికి తీసుకుపోయి వెంటనే ఎమ్మెల్యే చొరవతో ఆ కాలనీ వాసుల కోరిక మేరకు నూతనబోర్ వేయించారు. నూతన బోరును శనివారం గ్రామ సర్పంచ్- ఆంజనేయులు,ఉప సర్పంచ్ -రేణుక,మోహన్ చారి ప్రారంబించారు.గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకు లు,మాజీ ఎంపీటీ శంకర్ రాంగోపాల్, బాలరాజ్ వెంకటప్ప , గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.నీటి సమస్య తీర్చినందుకు ఎమ్మెల్యే కు, కుంభం శివకుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు కదిలిన రైతాంగం: మండల ఏవో రాజేష్ ఖన్నా

**చిన్నచింతకుంట జూన్ 6 (స్కై న్యూస్);** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్- కోహెడ శంకుస్థాపన అవగాహన సదస్సుకు శనివారం చిన్నచింతకుంట మండల కేంద్రం, పలు గ్రామాల రైతులు భారీగా తరలివెళ్లారు.హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరగబోయే ఈ ప్రతిష్టాత్మక సభకు, మండల వ్యవసాయ అధికారి (ఏ ఓ)



రాజేష్ ఖన్నా పర్యవేక్షణలో రైతులందరూ ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లడం జరిగింది.అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ మెళకువలు తెలుసుకొని, మన ప్రాంత రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుంది అన్నారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న వ్యవసాయ శాఖ అధికారులకు, సదస్సుకు తరలివెళ్లిన రైతు సోదరులకు అభినందనలు తెలిపారు.

వార్తాతరంగాలు ఆదివారం 07 జూన్ 2026

# ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలు



**జోగులాంబ గద్వాల, జూన్ 6 (స్కై న్యూస్):** ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ చెత్త నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన,ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు నినాద ఫలకాలు, బ్యానర్లు, పోస్టర్లతో నగరంలోని ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సరైన విధంగా నిర్వహించాలని, పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్‌ను ప్రజలు సందర్శించి ప్లాస్టిక్ కాలుష్య నివారణ చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ పర్యావరణ శాస్త్రవేత్త విద్యుల్లత, ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జయశంకర్ బడిబాట



**జోగులాంబ గద్వాల, జూన్ 6 (స్కై న్యూస్):** గద్వాల పట్టణం 21.వార్డ్ లో నల్లకుంట ప్రాథమిక పాఠశాల నందు ప్రొ., జయశంకర్ బడిబాట కార్యక్రమము ఏర్పాటు చెయ్యడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 21.వార్డ్. కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ హాజరుకావడం జరిగినది . ఇట్టిబాడి బాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేసి ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి వాడు కౌన్సిలర్ వెంకటేష్ మాట్లాడుతూ ఈ బడిబాట కార్యక్రమం లో బాగంగా వార్డులో తిరుగుతూ పిల్లల్లో ప్రభుత్వ పాఠశాలలో బడిలో చేర్పించడానికి అందరం కలిసి ఇంటింటికి తిరిగి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లను ఎక్కువ సంఖ్యలో చేర్చేటట్టుగా మన అందరం కలిసి కృషి చేద్దామని పులిపాటి వెంకటేష్ చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు ఎస్ పద్మ గారు మాట్లాడుతూ స్కూలు పిల్లలను ఎక్కువ శాతం వచ్చేటట్టుగా చూడడానికి ఈ బడి బాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఇంటింటికి ఇస్తూ తల్లిదండ్రులకు పిల్లల్ని బడిలోకి పంపించేటట్లుగా టీచర్లు అందరు కలిసి కృషి చేద్దామని చెప్పడం జరిగినది ఈ కార్యక్రమం అనంతరం పాఠశాలలో కాంపౌండ్ లో మొక్కలు వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ చేతులమీదుగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభోత్సవం చేయడం జరిగినది. మొక్కలు సంరక్షణ రోజు నీళ్లు పోస్తూ మొక్కలు పెరిగేటట్టుగా చూస్తామని ఉపాధ్యాయులు మహబూబ్ బాషా విజయ్ శ్రీ. తెలపడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వార్డు ఫోటోగ్రాఫర్ బషీర్ ,మేదరి శ్రీను, మేదరి శేషన్న అన్వర్ చిన్ని కృష్ణ, సాయి గణేష్ ,చాంద్. తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# టైగర్స్ కుంగ్-ఫు ఢ కరాటే అకాడమీ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ విజయవంతం





**రంగ రెడ్డి జూన్ 6 :** రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని బచ్‌పాన్ స్కూల్ గ్రౌండ్‌లో టైగర్స్ కుంగ్-ఫు ఢ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ఘనంగా నిర్వహించబడింది. అకాడమీ రంగారెడ్డి జిల్లా ఆర్గనైజర్ మునుకుంట్ల శివ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 70మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హయత్‌నగర్ ఎస్సై వెంకట్ రెడ్డి , స్కూల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి గారు మరియు గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్ , హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. బెల్ట్ గ్రేడింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారి చేతుల మీదుగా బెల్టులు మరియు ప్రశంసా పత్రాలు అందజేయగా, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లలకు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కూడా ఎంతో అవసరమని తెలిపారు. కుంగ్-ఫు సాధన ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం పెంపొందుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలు, బాలురకు ఆత్మరక్షణ నైపుణ్యాలు అవసరమని, మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఎలాంటి పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కొనే శక్తి లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న తల్లిదండ్రులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా మాస్టర్ మునుకుంట్ల శివ గౌడ్, బ్లాక్ బిల్డర్స్ క్రాంతి, కార్తికేయ జేతిను తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 8వ తేదీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు..

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్**



**జోగులాంబ గద్వాల,జూన్ 6(స్కై న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామ వార్డు సభల నిర్వహణ, ఎస్ ఐ ఆర్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాలలో అధికారులు అందరూ పాల్గొంటున్నందున ఈనెల 8వ తేదీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ ఇట్టి విషయాన్ని గుర్తించి సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అసౌకర్యానికి గురి కాకూడదు అని కోరారు. ఈవారం తదుపరి వచ్చే సోమవారం ప్రజావాణి కార్యక్రమాలు యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

# ఘనంగా కోటి పార్థివలింగార్చన మహోత్సవం

**నర్సాపూర్ జూన్ 6 :** శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో నర్సాపూర్ లోని ఆర్య వైశ్య సంఘం కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణము లో శ్రీ లక్ష్మీ సౌభాగ్యవతి కల్వకుంట్ల జ్యోతి మిత్ర బృందం పర్యవేక్షణలో కోటి పార్థివలింగార్చన మహోత్సవము అత్యంత వైభవముగా జరిగినది . ముందుగా దీపారాధన, కలశస్థాపన ,గణపతి ,గౌరీపూజ ,నవగ్రహ ఆరాధన ,మరియు భక్తులు పుట్టమన్ను చేత 108 పార్థివ లింగములు చేసి ఆ శివలింగాలకు పంచామృత అభిషేకము రుద్రాభిషేకము, భస్మార్చన ,పుష్పార్చన ,బిల్వార్చన, ధూప, దీప ,నైవేద్యములతో పూజ చేసిరి. శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి మరియు బాసర శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధా శ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీ నిర్మల అంబికానాథ శర్మ పూజాది కార్యక్రమములు చేయించి మాట్లాడుతూ బాసర క్షేత్రంలో 12 జ్యోతిర్లింగాల దేవాలయం ఈశాన్య భాగమున కోటి పార్థివలింగ స్తూపము నిర్మించినామని అందులో కోటి (పార్థివ)శివలింగములను ఈనెల 23వ తారీకు స్థాపన చేయ దలచినామని, మరియు ఆసక్తి గల ఆర్యవైశ్య సంఘం మహిళా బృందం వారు 9948332032 సంప్రదించి వారి వివరాలు తెలిపినచో



పుట్టమన్ను ఉచితముగా ఇచ్చి మీతో శివలింగాలు మరియు పూజ కార్యక్రమాలు చేయించి అట్టి లింగములను కోటి పార్థివలింగ స్తూపం యందు నిక్షిప్తం చేయబడును అని శర్మతెలిపినారు.. నర్సాపూర్ ఆర్యవైశ్య సంఘ సభ్యులు శ్రీ మల్లేశం మాట్లాడుతూ అధిక మాసంలో పంచమి తిథి రోజు ప్రదోషకాలంలో శివార్చన పార్థివలింగార్చన చేయడం , చేయించడం మిక్కిలి ఆనందం కలగజేసిందని, బాసర క్షేత్రంలో ఈనెల 23న జరిగే మాసోత్సవం సందర్భంగా



ప్రత్యేక పూజా కార్యక్రమాలు హోమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. బాసర సరస్వతీ స్తూప పార్థివ లింగస్తుప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిర వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాధశర్మ ను నిర్వాహకులు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. దేవాలయ పరిసర కాలిని వాసులు మరియు దేవాలయ ప్రధాన అర్చకులు మరియు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**జోగులాంబ గద్వాల, జూన్ 6 (స్కై న్యూస్):** ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. నీట్ (యూజీ)-2026 పునఃపరీక్ష నిర్వహణకు సంబంధించి ఢిల్లీ నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలంగాణ ఇన్చార్జి అభిషేక్ సింగ్, హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన పరీక్ష అని పేర్కొన్నారు. గతంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈసారి పరీక్ష నిర్వహణలో గోప్యత, భద్రత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రపరిచే ప్రక్రియ, పరీక్షా కేంద్రాల నిర్వహణ తదితర అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.95 లక్షల మంది అభ్యర్థులు 208 పరీక్షా కేంద్రాల్లో పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో అధిక సంఖ్యలో కేంద్రాలు ఉన్నందున ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రబీలో వరి ధాన్యం కొనుగోలు దాదాపుగా పూర్తయిందని మిగిలిన జిల్లాల్లో కూడా రెండు రోజుల్లో పూర్తి చేయాల్సిందిగా సిఎస్ ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈనెల 9న పెరేడ్ గ్రౌండ్ లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా బస్సులను పంపిణీ చేయడం జరుగుతుందని, అన్ని జిల్లాల నుంచి ఈ కార్యక్రమంలో సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. మహిళా సంఘాల సభ్యుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫార్మ్ కుట్టించాలని, ఇప్పటికే ఆలస్యమైనందున ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ నీట్ పరీక్షను జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈనెల 9న మహిళా సంఘాలకు హైదరాబాదులో జరిగే



బస్సుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా నుంచి బయలుదేరే సభ్యులకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా మహిళా సమాఖ్య తరపున ఎలక్ట్రికల్ స్కూటీలు, ఆటో, సైకిల్స్ కొనుగోలు చేసి గట్టు మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్, డీఎవో వీరప్ప, పౌర సరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, నీట్ పరీక్ష సిటీ కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ లతో

# ప్రజలను మోసం చేసింది..

**రెండున్నర ఏండ్ల అయినా 6 గ్యారంటీలను అమలు చేయలేని దుస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం..**

**కల్యాణ లక్ష్మి లక్ష రూపాయలు తులం బంగారు ఏమైంది..?**

**జోగులాంబ గద్వాల, జూన్ 6 ( స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గంటల హామీలు అమలు చేయాలని పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ఆధ్వర్యంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూగత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలు అబద్ధపు మోసపూరిత హామీలు ఇచ్చిందని, ముఖ్యంగా ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజలను నమ్మించి నిట్ట నిలువునా మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలు ఆటకెక్కిందని అన్నారు.. కల్యాణ లక్ష్మి లక్ష రూపాయల తులం బంగారం అని చెప్పి మోసం చేశారని ,ఆరు ఏళ్లయిన గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పింఛన్ ఇవ్వక ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. 4000 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీకి చేతులు రావడం లేదని విమర్శించారు. ఆరూ గ్యారెంటీలు సక్రమంగా అమలు చేయాలని,లేని పక్షంలో ఆరు గ్యారంటీలు అమలు అయ్యేంతవరకు ప్రజలకు బిజెపి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్కోటే, జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ రెడ్డి,కౌన్సిలర్ చంద్రశేఖర్ ,మాజీ కౌన్సిలర్ శ్రీమన్నారాయణ



,మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, బిజెపి సీనియర్ నాయకులు రజక నరసింహ, మోహన్ రెడ్డి, సద్దల కృష్ణ,తదితరులు ఉన్నారు..

# రుద్రంపూర్ గ్యాస్ గోడౌన్ గోడ పగలగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు...

**ఇప్పటికీ మూడుసార్లు పగలగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు పట్టించుకోని అధికారులు ...**

**చుంచుపల్లి జూన్ 6 (స్కై న్యూస్):** భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో క్లబ్ ఏరియా నందు సింగరేణి భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారి గోడౌన్ గత 50 సంవత్సరాల నుండి ఇక్కడే ఉంది దాన్ని చుట్టూ ప్రహరీ నిర్మాణం సింగరేణి వారు చేసినారు. గతంలో గోడౌన్ వెనుక నుండి గోడౌన్ ముందు దారి నుండి వెళ్లేవారు. ప్రమాదాలు జరగకుండా ఉండడం కొరకు ఆ పాత దారిని సిమెంటు బ్రిక్స్ తో మూసివేసినారు. ఇప్పటివరకు మూడుసార్లు గోడని పగలబెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు. రాత్రుల సమయంలో అసాంఘిక కార్యక్రమాలు గ్యాస్ గోడౌన్ ప్రాంగణంలో నిర్వహిస్తుంటారు. సిగరెట్లు తాగడం మందు తాగడం నిత్యం జరుగుతుంది ఏదైనా సిగరెట్టు పొరపాటున తాగిన మైకంలో గ్యాస్ ఉన్న ప్రదేశంలో విసిరేస్తే పెద్దగోర ప్రమాదం సంభవిస్తుందని గ్యాస్ నిర్వాహకులు గోడౌన్ వెనుక భాగాన పాత దారి మూసి వయడం జరిగింది.. ఇప్పటికి మూడుసార్లు ఆ గోడని పగలగొట్టిన పట్టించుకునే వారు కరువయ్యారు.




ప్రమాదం అంటూ జరుగుతే అతి భయంకరంగా చుట్టుపక్కల వారికి ప్రాణాల మీదికి తెచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఆ పాత దారిని మూసివేసినరూ. అది జీర్ణించుకోలేని ఆకతాయిలు ఆ గోడ కాస్త పగలగొట్టి వారి అసాంఘిక కార్యక్రమాలు రాత్రి సమయంలో గ్యాస్ గోడౌన్ ప్రాంగణంలో నిర్వహిస్తూ ఉంటారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి



మరల ఇటువంటి సంఘటన పునరావృత్తం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు కూడా తెలియజేసి పెట్రోలింగ్ పెంచే విధంగా పోలీసు వారికి తెలియజేయాలని గోడను పునర్మించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సింగరేణి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు. గోడ కూల్చివేసిన వారిని గుర్తించి చట్టరీత్ చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు.

# లింగారెడ్డిగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం...

**ఇద్దరు మైనర్ బాలురు మృతి**

**రంగారెడ్డి జిల్లా జూన్ 6: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని లింగారెడ్డిగూడ గ్రామం సమీపంలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్ బాలురు మృతి చెందారు బైక్‌పై ప్రయాణిస్తున్న బాలురు ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం, వేగంగా వెళు _న్న బైక్ ముందుగా రోడ్డుపై ఉన్న జేసీబీని ఢీకొని అనంతరం ఎదురుగా వస్తున్న ఎంఎస్ఎన్ బస్సును ఢీకొట్టింది ప్రమాద తీవ్రతకు బైక్ పూర్తిగా ధ్వంసమైంది మృతుల వయస్సు సుమారు 16 సంవత్సరాల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు అయితే వారి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉండగా, కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# బ్యూటీషియన్ రంగానికి మంచి డిమాండ్

**షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి**

**ఫరూక్‌నగర్‌లో అడ్వాన్స్ బ్యూటీషియన్ కోర్స్‌కు మున్సిపల్ కమిషనర్ ప్రశంసలు**

**రంగారెడ్డి జిల్లా జూన్ 6:( స్కై న్యూస్ )** తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ ఆధ్వర్యంలో, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఆమోదించబడిన సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ అడ్వాన్స్ బ్యూటీషియన్ కోర్స్ షాద్ నగర్ మున్సిపల్ లో ఉన్న ఫరూక్‌నగర్‌లో గత మూడు నెలలుగా విజయవంతంగా కొనసాగుతోంది. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం సెమినా మహిళా సేవా మండలి అధ్యక్షురాలు ఆలియా సుల్తానా ఆధ్వర్యంలో ఫరూక్‌నగర్ మైనార్టీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నారు ఈ కోర్స్‌లో 30 మంది యువతీయులు శిక్షణ పొందుతున్నారు ఈ సందర్భంగా షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వి సునీత రెడ్డి శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థినులు నేర్చుకున్న నైపుణ్యాలు, వారు నిర్వహించిన ప్రాక్టికల్ పనులు, హెయిర్ స్టైలింగ్ నమూనాలను పరిశీలించి అభినందించారు విద్యార్థినులతో మాట్లాడిన కమిషనర్ సునీత మాట్లాడుతూ, ప్రస్తుతం బ్యూటీషియన్ రంగానికి మంచి డిమాండ్ ఉందని, ఈ రంగంలో స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా



ఉన్నాయని తెలిపారు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు నైపుణ్యాభివృద్ధితో పాటు ఉన్నత విద్యకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. ఉర్దూ మీడియం ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు పై చదువులు కొనసాగించి తమ కాళ్లపై తాము నిలబడాలని ప్రోత్సహించారు అలాగే సెమినా మహిళా సేవా మండలి అధ్యక్షురాలు ఆలియా సుల్తానాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు గత 15 సంవత్సరాలుగా ఆలియా సుల్తానా సమాజం కోసం, ముఖ్యంగా మహిళల అభివృద్ధి కోసం ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేవలు అందిస్తున్నారు మీరు కూడా ఆమెను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి మీ వంతు సహాయం అందించే దిశగా ముందుకు సాగాలి అని కమిషనర్ సునీత అన్నారు తన జీవితాన్ని ఉదాహరణగా చూపిస్తూ నేను కూడా మీలో ఒకదాన్నే నేడు షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను మీరు కూడా నైపుణ్య కోర్సులతో పాటు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలి సమాజ అభివృద్ధికి మన వంతు సేవ అందించాలి అని విద్యార్థినులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, శిక్షణ పొందుతున్న యువతీయులు తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# బిజెపి నేత తల్లోజు ఆచారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన విశ్వకర్మ మహాసభ

**హైదరాబాద్ జూన్ 6 ;**అఖిల్ భారతీయ విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం, ఉపాధ్యక్షులు కాసోజు శ్రీనివాస చారి మరియు మాజీ అమీర్పేట కార్పొరేటర్ పసునూరి బిక్షపతి ఈరోజు మాజీ నేషనల్ బిసి కమిషన్ మెంబర్ మరియు కల్వకుర్తి కంటెస్టెంట్ ఎమ్మెల్యే తల్లోజు ఆచారిని వారి నివాసములో కలిసి శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా తల్లోజు ఆచారి అన్నగారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ గుండోజు గంగాధర్, ప్రధాన కార్యదర్శి సంకోజు లింగా చారి, కోశాధికారి ఆవంచ మురళీధరాచారి , అధికార ప్రతినిధి పడాల సతీష్ చారి, గౌరవ సలహాదారు కనపర్తి లక్ష్మణ్ చారి మహిళా గౌరవ అధ్యక్షురాలు సావిత్రి పట్నాల, కస్తోజు శ్రావణి మహిళా అధికార ప్రతినిధి, ఇంద్రాల అశ్విని మహిళా ఉపాధ్యక్షురాలు, బోనాల ఇందిర మహిళాకార్య దర్శి , దాసోజు లక్ష్మణా చారి ఉపాధ్యక్షులు,కొల్లోజు సురేష్ చారిప్రచార కార్యదర్శి, నరహరి చారి ముఖ్య సలహా దారు వీరాచారి జాయింట్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి కర్ణకంటి నరసింహాచారి. ఉపాధ్యక్షుడు కట్ట వెంకటేష్. అధ్యక్షుడు దాసోజు లక్ష్మణ్ చారి, ఉపాధ్యక్షుడు శ్రీరామ్ మహిపాల్ చారి, వెంకట్ చారి సలహా దారు, ఎడవల్లి రాఘవాచారి యూత్ సెక్రటరీ, కొండోజు సురేష్ చారి అధ్యక్షుడు అంబర్ పేట, కె లోకనాథం జుజ మెంబర్, తదితరులు అభినందించారు .



# డ్రైవర్ వైద్యానికి వెస్సో సహాయం...

**హైద్రా బాద్ జూన్6 :**వృత్తి రీత్యా నాగర్‌కర్నూలు లో ఉంటున్న గన్నోజు రమేష్ చారి(40) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ నెలకు కేవలం పన్నెండు వేల ఆదాయంతో 4500 అద్దె చెల్లిస్తూ అద్దె ఇంటిలో జీవనం సాగిస్తున్నారు. వీరికి 7 మరియు 8 సం.ల వయసు గల ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.రమేష్ చారి గత నాలుగు నెలలుగా తీవ్రమైన గ్యాస్ నొప్పితో బాధపడుతూ పలుచోట్ల ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ వ్యాధి నిర్ధారణ కాలేదు. అనంతరం కాళ్లు పనిచేయక పోవడంతో మహబూబ్ నగర్ లోని మారుతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో చేరగా వెన్నెముకలో ఇన్ఫెక్షన్ గుర్తించి అత్యవసర శస్త్రచికిత్స చేశారు. శస్త్రచికిత్స అనంతరం బయాప్సీ నివేదికల ద్వారా క్యాన్సర్ వ్యాధి కూడా ఉన్నట్లు నిర్ధారణ అయింది. తదుపరి చికిత్స కోసం ఆయన ను హైదరాబాద్ లో బసవ తారకం క్యాన్సర్ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో ఆయనకు అడ్వాన్స్‌డ్ స్టేజ్ పేగు క్యాన్సర్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు.ప్రస్తుతం వైద్యుల సూచన మేరకు రక్త మార్పిడి




సహా ఇతర చికిత్సలు కొనసాగు తున్నాయి. ఇప్పటి వరకు వారి కుటుంబ సభ్యులు, బంధువులు మరియు స్నేహితుల వద్ద అప్పులు చేసి నాలుగు లక్షల వరకు ఖర్చు చేశారు. ఇంకా చికిత్స కొనసాగించ డానికి చాలా ఖర్చు అవసరమవుతున్నది. వారి బంధువులు, స్థానిక నాయకుల ద్వారా వెస్సో ట్రస్ట్ గురించి తెలుసుకొని ఆర్థిక సహాయం అందించమని రమేష్ చారి అభ్యర్థించగా, వెస్సో ట్రస్టీలు



గౌరవ దాతల సహకారంతో రమేష్ చారి భార్య యామిని కి 50500 రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షుడు బంగారు తాతారావు మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యం మరియు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రమేష్ చారి కి ఆర్థిక సహాయం చేసి వారిని ఆదుకొన్న గౌరవ దాతలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించండి అదనపు కలెక్టర్ ఖిన్యా నాయక్

**ఆత్మకూరు జూన్ 6(స్కై న్యూస్)** ఆత్మకూరు మండలం పిన్నెంచెర్ల లో జరిగిన గ్రామసభలో అదనపు కలెక్టర్ బాల్య వివాహాలను నిర్మూలించి ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని వారి యొక్క తల్లిదండ్రులకు సూచించారు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైనసకల సౌకర్యాలు ఉన్నాయని పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఆయన కోరారు పల్లెటూర్లలో ఎవరైనా బాల్యవివాహాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది అలాగే ఇంకుడు గుంతల ప్రాముఖ్యత మరియు ఓటర్లు నమోదు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అవగాహన కల్పించారు పల్లెటూరులో జనాలకు గవర్నమెంట్ పథకాలు అన్ని రకాలలబ్ధి పొందేటట్లు ప్రజలకు తెలియజేయడమైనది పథకాలు అన్నీ ఉన్నాయి మీకోసమే ప్రతి ఒక్కరూ అర్హులే అని ఆయన సభలో తెలియజేశారు



# గిరిజనుల భద్రతకు భంగం కల్పిస్తే ఊరుకోం

**లంబాడి హక్కుల పోరాట సమితి యూత్ విభాగం కార్యనిర్వహక అధ్యక్షులు అయోధ్య శ్రీనివాస్**

**అయ్యప్ప కాలనీలో గిరిజన యువకులపై దాడి ఘటన ఖండనీయం**





**రంగారెడ్డి జిల్లా జూన్ 6: ( స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని అయ్యప్ప కాలనీలో గిరిజన యువకులపై జరిగిన దాడి ఘటనను లంబాడి హక్కుల పోరాట సమితి ( ఎల్ హెచ్ పి ఎస్) యూత్ విభాగం కార్యనిర్వహక అధ్యక్షులు అయోధ్య శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. గిరిజన యువకులపై అకారణంగా దాడి చేయడం హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు. సంఘటన విషయం తెలుసుకున్న గిరిజన యువకులు పెద్ద సంఖ్యలో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు నిందితులపై కేసు నమోదు చేయడం స్వాగతించదగిన విషయమే అయినప్పటికీ, కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా దాడికి పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అయోధ్య శ్రీనివాస్ మాట్లాడుతూ, గిరిజనుల భద్రతకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. సమాజంలో శాంతియుతంగా జీవిస్తున్న గిరిజనులపై దాడులు చేస్తే లంబాడి హక్కుల పోరాట సమితి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గిరిజన యువకులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్ హెచ్ పి ఎస్ డిమాండ్ చేసింది.

# శిథిలా వ్యవస్థలో ఆత్మకూర్ జూనియర్ కళాశాల భవనం...



**ఆత్మకూరు జూన్ 6 (స్కై న్యూస్):**ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం స్థితుల వ్యవస్థకు చేరినట్లు విద్యార్థులు తల్లిదండ్రులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇటీవల భవనంలోనే రంధ్రాలు ఏర్పడి ప్రమాదకర స్థితిలో ఉందని తెలిపారు ఎప్పుడు కూల్ పోతుందో తెలియని పరిస్థితి నెలల కొద్ది ఆందోళన చేసిన ఈ భవనాన్ని మాత్రం ఎవరు పట్టించుకోవడం లేదు ఈ జూనియర్ కళాశాలలో ఎన్నో రకాల ప్రోగ్రామ్స్ పార్టీ రిటైర్మెంట్ ఫంక్షన్లుజరుగుతాయి అయినా టీచర్స్ లెక్చరర్లు ఎన్నో రకాల ప్రోగ్రామ్స్ జరిగిన ఈ రంధ్రాల గురించి ఎవరు పట్టించుకోవడం లేదు అందుకేపాత భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థులు మరియు విద్యార్థి యొక్క తల్లిదండ్రులు ప్రిన్సిపల్ సార్ వాళ్ళకి కోరడమైనది అలాగే అధికారులు ఈ విషయాన్ని తొందరగా దృష్టి మళ్లించి నూతన భవనానికి ఏర్పాట్లు చేయవలసినదిగా అధికారులను విద్యార్థులు వేడుకుంటున్నారు

# లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణకు తక్షణమే చర్యలు తీసుకోండి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతి**

**కాలువలు, టన్నెల్ నిర్మాణాలకు సంబంధించి మొత్తం 2,919 ఎకరాలు**

**ఈ భూసేకరణకు సుమారు రూ.350.84 కోట్ల పరిహారం అవసరమని వినతి**

**రంగారెడ్డి జిల్లా జూన్ 6: (స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం(పిఆర్ఎల్ఐఎస్) లో భాగమైన కొందుర్గు -- పరిగి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా వచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా కలుసుకొని స్వయంగా వినతి పత్రాన్ని అందజేశారు పాలమూరు -- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో పరిగి, షాద్‌నగర్ నియోజకవర్గాలు చివరి భాగంలో ఉన్నాయని, ఉదండాపూర్ నుంచి కొందుర్గు, పరిగి, లక్ష్మీదేవిపల్లి వరకు మిగిలిన పనులు పూర్తైతే సాగు, తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు రిజర్వాయర్ నిర్మాణం, పంప్ హౌస్ ఏర్పాటు, ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ వరకు కాలువలు, టన్నెల్ నిర్మాణాలకు సంబంధించి మొత్తం 2,919 ఎకరాల భూమి అవసరమవుతుందని తెలిపారు. ఈ భూసేకరణకు సుమారు రూ.350.84 కోట్ల పరిహారం అవసరమవుతుందని వినతిపత్రంలో వివరించారు భూసేకరణ ప్రతిపాదనలకు తక్షణ పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి వనరులు పెరిగి వ్యవసాయాభివృద్ధికి, ప్రాంతీయ సామాజిక--ఆర్థిక




పురోగతికి తోడ్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు

**సీఎం రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం**

**ఎమ్మెల్యే శంకర్**

పాలమూరు ఉమ్మడి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం అయ్యిందని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మీడియా పలకరించగా ముఖ్యమంత్రి పర్యటన విశేషాలను వివరించారు సోమశిలలో కలెక్టర్లు, సిఈలతో జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు పై సుదీర్ఘమైన చర్చ చేశారని తెలిపారు ఈ సందర్భంగా పరిస్థితులను హెలికాప్టర్ ద్వారా ముఖ్యమంత్రితో కలిసి పరిశీలించడం జరిగిందనీ ఆయన తెలిపారు నిన్న ఏరియల్ సర్వేలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉత్తమ్ కుమార్ రెడ్డి జూపల్లి కృష్ణారావు తాను పరిస్థితులను పరిశీలించామని పేర్కొన్నారు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం ముందు విడుదల స్థల సేకరణ కోసం 587 కోట్ల రూపాయలు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు అయితే దాదాపు భూసేకరణ కోసం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి జిల్లా అధికారులను సమీక్ష సమావేశంలో ఆదేశించారని శుభవార్త చెప్పారు ఇక భూసేకరణ కార్యక్రమం త్వరలో మొదలు కాబోతుందని, తన సహచర ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తో కలిసి లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం పూర్తిస్థాయిలో తాము కదలికలు ప్రారంభించామని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు గత ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి కమిషన్లను కొల్లగొట్టారే తప్ప ఈ ప్రాంతానికి ఒరగబెట్టింది ఏమీ లేదని ఎమ్మెల్యే అన్నారు ఏ కేజీలు మాత్రం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేసీఆర్ ప్రభుత్వం 27 వేల కోట్ల ఖర్చు చేసిందని పంపులు లిఫ్ట్ ల కోసమే వేల కోట్లు ఖర్చు చేసి కమిషన్లు కొల్లగొట్టారని ఆరోపించారు ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వకుండా ఎక్కడికక్కడే వదిలేసి వెళ్లారని ఎమ్మెల్యే శంకర్ విమర్శించారు కెసిఆర్ ప్రభుత్వ హయాంలో 1 లక్షా 81 వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేసి అందులో లక్ష కోట్లు కేవలం కాళేశ్వరం కోసమే ఖర్చు పెట్టారని తెలిపారు అత్యంత కీలకమైన రంగారెడ్డి పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే శంకర్ చెప్పుకొచ్చారు.



# సంగారెడ్డి లో మరో 210 మంది చిన్నారులకు సైకిళ్ళు అందజేసిన జగ్గారెడ్డి

**సంగారెడ్డి జూన్ 6:**టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యం లో చిన్నారులకు విడతలవారీగా సైకిళ్ళ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటి వరకు 400 మంది చిన్నారులకు సైకిళ్ళు పంపిణీ చేసిన జగ్గారెడ్డి శనివారం మరో 210 మంది చిన్నారులకు సైకిళ్ళు పంపిణీ చేశారు. చిన్నారుల్లో ఉత్సాహం, ఆరోగ్యం, చదువు పట్ల ఆసక్తి పెంచడమే లక్ష్యంగా జగ్గారెడ్డి ఈ కార్యక్రమం చేపడుతున్నారు. స్థానిక పిఎస్సార్ గార్డెన్ లో ఈ సైకిళ్ళ పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రతీ ఒక్క చిన్నారికి జగ్గారెడ్డి స్వయంగా సైకిల్ అందజేశారు. ఐదు సంవత్సరాలు మొదలుకుని 15 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకు సైకిళ్ళు అందజేశారు. చిన్నారులకు,బాలురకు, బాలికలకు



ప్రత్యేకంగా సైకిళ్ళు అందజేశారు.గత వారం టోకెన్ లు ఇచ్చిన వారికి శనివారం సైకిళ్ళు పంపిణీ చేశారు. టోకెన్ లు లేని చిన్నారుల కు మరోసారి సైకిల్ లు పంపిణీ చేసేందుకు వీలుగా అందరి చిన్నారుల ఆధార్ కార్డు, పేరెంట్స్ ఫోన్ నెంబర్స్ తో కూడిన వివరాలు తీసుకోవాలని జగ్గారెడ్డి నిర్వాహకులకు సూచించారు. సైకిళ్ళు రాని చిన్నారులు ఎవరు ఆందోళన పడవద్దని, పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ సైకిళ్ళు పంపిణీ చేస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, మహేష్ , సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు
ఆదివారం 07 జూన్ 2026

# ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తీసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు

**అందజేసిన జీఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్**



**సింగరేణి జూన్ 6( స్కై న్యూస్):** సేవా సమితి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరం లో సింగరేణి సేవా సమితి ద్వారా 6 నెలల పాటు ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ శిక్షణ పొందిన 52 మంది అభ్యర్థులకు శనివారం సాయంత్రం సింగరేణి ఉన్నత పాటశాలలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సంధర్భం గా జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ సామాజిక భాధ్యతగా సింగరేణి గృహిణులతో పాటు పరిసర ప్రాంత నిరుద్యోగ మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశం తో కంపెనీ వ్యాప్తంగా సింగరేణి సేవా సమితి ద్వారా ఎన్నోవృత్తి విద్యాకోర్స్ లను నిర్వహిస్తున్నది అని అందులో భాగముగా 2025-26 సంవత్సరం లో 6 నెలల పాటు సింగరేణి ఉన్నత పాటశాలలో ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ శిక్షణ పొంది పరీక్షలలో ఉత్తీర్ణులైన 52 మంది అభ్యర్థులకు ఈ రోజు సర్టిఫికెట్ల ను కూడా అందిస్తున్నామని, సింగరేణి సంస్థ ఇప్పటి వరకు 13 బ్యాచ్ లకు ఉచితముగా ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ శిక్షణ అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ తో పాటు డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవ రావు, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు, సేవ సెక్రటరీ బి.మాధవీ స్వర్ణలత, శిక్షణాధ్యాపకులు ఏ.ఇందిర, జి.కళ్యాణి శిక్షణ పొందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# చేవెళ్లలో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై నిషేధం




**రంగారెడ్డి జిల్లా జూన్ 6: ( స్కై న్యూస్ )** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు చేవెళ్ల మున్సిపాలిటీ కఠిన చర్యలు చేపట్టింది 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లపై పూర్తి నిషేధం అమలులో ఉంటుందని కమిషనర్ యాదగిరి తెలిపారు పట్టణంలోని కిరాణా దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, హోటళ్లు, ఫంక్షన్ హోళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు నిబంధనలు ఉల్లంఘించి నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించే లేదా వినియోగించే వారిపై భారీ జరిమానాలు విధించడంతో పాటు, పదేపదే తప్పిదాలకు పాల్పడితే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు ప్రజలు, వ్యాపారులు ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను వినియోగించి స్వచ్ఛమైన పట్టణ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ లతో ప్రజలను మోసం చేసింది..

**రెండున్నర ఏండ్ల అయినా 6 గ్యారంటీలను అమలు చేయలేని దుస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం..**
**కల్యాణ లక్ష్మి లక్ష రూపాయలు తులం బంగారు ఏమైంది..?**



ఈరోజు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గంటల హామీలు అమలు చేయాలని పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ఆధ్వర్యంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది..

**ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ..**

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలు అబద్ధపు మోసపూరిత హామీలు ఇచ్చిందని, ముఖ్యంగా ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజలను నమ్మించి నిట్ట నిలువునా మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలు ఆటకెక్కిందని అన్నారు.. కల్యాణ లక్ష్మి లక్ష రూపాయల తులం బంగారం అని చెప్పి మోసం చేశారని ,ఆరు ఏళ్లయిన గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పించన్ ఇవ్వక ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు.. 4000 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీకి చేతులు రావడం లేదని విమర్శించారు. ఆరూ గ్యారెంటీలు సక్రమంగా అమలు చేయాలని,లేని పక్షంలో ఆరు గ్యారంటీలు అమలు అయ్యేంతవరకు ప్రజలకు బిజెపి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ రెడ్డి,కౌన్సిలర్ చంద్రశేఖర్ ,మాజీ కౌన్సిలర్ శ్రీమన్నారాయణ ,మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, బిజెపి సీనియర్ నాయకులు రజక నరసింహ, మోహన్ రెడ్డి, సద్దల కృష్ణ,తదితరులు ఉన్నారు..

# శ్రీ కురుమూర్తి స్వామి దాతల సహకారతో డ్రైనేజీ కాల్వ పై కప్పు వెయ్యడానికి సిద్ధం ఉన్నది



**చిన్న చింతకుంట జూన్ 6 (స్కై న్యూస్);** కొలిచిన వారికి కొంగు బంగారమైన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం చిన్న చింతకుంట మండల పరిధిలోని అమ్మాపురం గ్రామ సమీపంలో ఏడుకొండల మధ్య కాంచన గుహలో స్వయంభుగా వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా స్వామి బ్రహ్మోత్సవాలలో దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ కాలువపై కప్పు దాతలు కుమార్ హైదరాబాద్ గోవర్ధన్ చిన్నరాజమూర్ శివరాజ్ రాయచూరు వాస్తవ్యులు సిమెంటు 50 బస్తాలు, స్టీలు. 3 క్వింటాలు వితరణ చేసినందుకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బత్తుల బాలరాజ్, ఈఓ మదనేశ్వర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు. స్వామి సన్నిధిలో ఇంకా కొన్ని పనులు ఉన్నాయి స్వామి ఆలయ అభివృద్ధి కోసం దాతలు సహకరించాలని వారు కోరారు.

# పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

**జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక**





**నారాయణపేట జూన్ 6 (స్కైన్యూస్)** ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలనీ, వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వాతావరణ సమతుల్యత ను కాపాడాలని కలెక్టర్ తెలిపారు. శనివారం మరికల్ మండలంలోని పెద్ద చింతకుంట గ్రామ సచివాలయం ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ లో భాగంగా ఇంతవరకు తడి,పొడి చెత్త నిర్వహణ మాత్రమే చేశారని, ఇప్పుడు సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం తడి, పొడి చెత్తతో పాటు శానిటరీ, మెడికల్ వేస్ట్ చెత్తతో నాలుగు రకాలుగా సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. చెత్త సేకరణ విషయంలో గ్రామ సర్పంచి, కార్యదర్శి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇండ్లల్లో పోగయ్యే చెత్తను నాలుగు రకాలుగా నిల్వ చేసేలా గ్రామస్థులకు తెలియజేయాలని చెప్పారు. అలాగే ఉపాధి హామీ పథకం లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రతీ రోజు మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు గ్రామస్థులకు ఎస్. ఐ ఆర్ పట్ల సంపూర్ణ అవగాహన అవసరమని అభిప్రాయ పడ్డారు. బీ ఎల్ వో లు కొత్త ఓటర్ల ను నమోదు చేస్తారని, గతంలో గ్రామాల్లో నివాసం ఉండి, ఇప్పుడు వేరే ఊర్లకు వెళ్లిన వారు, చనిపోయిన ఓటర్ల ను తొలగించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 25 నుంచి మొదవుతుందని చెప్పారు. ఇండ్ల వద్దకు బి ఎల్ వో లు వచ్చి రెండు ఫారాలు ఇస్తారని, వాటిలో మన పూర్తి వివరాలను రాసి, సరైన ధృవ పత్రాలను జత చేసి బీ ఎల్ వోలకు తిరిగి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆ తర్వాత ఈ ఆర్ వో స్థాయిలో కొత్త ఓటరు జాబితాలను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయ వద్ద ప్రచురిస్తారని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలియ చేయాలని కలెక్టర్ సూచించారు. 2002 లో ఉన్న మన ఓటరు సంఖ్య ను అనుసంధానం చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం పెద్ద చింతకుంట గ్రామంలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ 80 శాతం పూర్తి అయిందని, పెండింగ్ లో ఉన్న మిగతా 20 శాతం కూడా వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను కూడా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం రాబోతోందని, అప్రమత్తంగా ఉండాలని, రోజు మురుగు కాల్వల ను శుభ్రం చేయించాలని, డెంగీ, మలేరియా ప్రబల కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తిరుపతమ్మ, జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, డిఆర్డిఓ వెంకట్ రాములు, డిపివో సుధాకర్ రెడ్డి, తహసిల్దార్ రామ్ కోటి, ఎంపీడీవో పృథ్వీరాజ్, ఎంపీఓ పావని, గ్రామ కార్యదర్శి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకుందాం..

- ప్రాధాన్యతా క్రమంలోనే అభివృద్ధి పనులు కేటాయించాలి
- త్రాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి
- పథకంతో త్వరలో నీటిసమస్యకు శాశ్వత పరిస్కారం
- మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం నిరంతరం కృషిచేయాలి
- సిబ్బంది కొరతను తీర్చేవిధంగా నియమాకాలు చేపట్టండి
- సమిష్టి నిర్ణయాలతో సమస్యలు లేని కార్పొరేషన్‌గా నగరాన్ని తీర్చిదిద్దుదాం
- పట్టణ సమగ్ర శ్రేయస్సు కోసం కట్టుబడి ఉంటా
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు





**కొత్తగూడెం జూన్ 6( స్కై న్యూస్):** : ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకోవాలని, ప్రతి డివిజన్‌లోనూ ప్రజల అవసరాలను గుర్తించి ముందుకు సాగాలని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ కౌన్సిల్ సమావేశం మేయర్ మూడ్ గణేష్ అధ్యక్షతన శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నగర పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ప్రధానంగా ఎండకాలం దృష్ట్యా త్రాగునీటి సమస్య పరిస్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య తీవ్రంగా వున్నచోట ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్యాన ఏర్పాట్లు చేయాలనీ, ప్రజల కనీస మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం నిరంతరం కృషి చేయాలనీ సూచించారు. పతాకంకు సంబంధించి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, పనులు పూర్తయితే కార్పొరేషన్లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిస్కారం లభిస్తుందన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్లో సిబ్బంది కొరత వేధిస్తోందని, త్వరలోనే ఉన్నతాధికారులతో మాట్లాడి అదనపు సిబ్బందిని పెంచేలా చూస్తామన్నారు. విద్యుత్, పారిశుద్ధ్యం, అంతర్గత రోడ్లు, మురుగు కాలువల డ్రైన్లు తదితర దీర్ఘకాలిక సమస్యల పరిస్కారంపై తాము ఇప్పటికే ప్రేత్యేక ద్రుష్టి సారించామని స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలు లేని ఆదర్శ కార్పొరేషన్ గా కొత్తగూడెం కార్పొరేషన్ ను తీర్చిదిద్దేందుకు అందరం కలిసికట్టుగా శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, కార్పొరేషన్ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి వున్నానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# కొహెడ రైతులకు పరిహారం ఇవ్వకుండా ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపనా?

**సీఎం పర్యటన నేపథ్యంలో బీజేపీ నాయకుడు కరాడి అనిల్ కుమార్ ముందస్తు అరెస్టు**



**రంగారెడ్డి జిల్లా జూన్ 6: (స్కై న్యూస్)** కొహెడ గ్రామంలోని సర్వే నెంబర్ 167లో భూములు కోల్పోయిన రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించకుండానే ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన చేపట్టడం అన్యాయమని బీజేపీ నాయకుడు కరాడి అనిల్ కుమార్ ఆరోపించారు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రైతుల సమస్యలను ప్రస్తావించకుండా ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడుతోందని విమర్శించారు కొహెడ రైతుల పక్షాన పోరాడుతున్న తనను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు శనివారం తెల్లవారుజామున ముందస్తుగా అరెస్టు చేశారని ఆయన పేర్కొన్నారు రైతుల సమస్యలను ప్రశ్నించకుండా అడ్డుకోవడానికే ఈ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు సర్వే నెంబర్ 167లో దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు న్యాయబద్ధమైన పూర్తి నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు రైతులకు న్యాయం జరిగే వరకు ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులు, శంకుస్థాపన కార్యక్రమాలను నిలిపివేయాలని కోరారు

హక్కుల కోసం పోరాడుతున్న నాయకులపై అక్రమ అరెస్టులు, పోలీసుల దౌర్జన్యాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు రైతుల హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా రైతుల పక్షాన పోరాటం కొనసాగుతుందని కరాడి అనిల్ కుమార్ స్పష్టం చేశారు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తనపై చేపట్టిన ముందస్తు అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు.

# కోహెడ రైతు మహోత్సవానికి తరలి వెళ్లిన ఫరూఖ్ నగర్ మండల రైతులు



**రంగారెడ్డి జిల్లా జూన్ 6: ( స్కై న్యూస్ రంగారెడ్డి జిల్లా )** రంగారెడ్డి జిల్లా అబ్దులాపుర్‌మెట్ మండలంలోని కోహెడ గ్రామంలో శనివారం నిర్వహించనున్న చారిత్రాత్మక రైతు మహోత్సవానికి ఘన ఏర్పాట్లు చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఫరూక్‌నగర్ మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వ్యవసాయ రంగానికి చెందిన ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధికి మైలురాయిగా నిలిచే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా సుమారు 239 ఎకరాల విస్తీర్ణంలో రూ.3,300 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న దేశంలోనే అతిపెద్ద అంతర్జాతీయ సమీకృత పండ్లు, కూరగాయల మార్కెట్ నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు రైతుల రవాణా సౌకర్యం కోసం ఫరూక్‌నగర్ మండలం నుంచి 15 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ, మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అన్నదాతల అభ్యున్నతే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అనే సందేశంతో రైతు మహోత్సవం నిర్వహించబడుతోంది.

# అక్రమ సెల్లార్ నిర్మాణం ఎంపీ ఓ,, డి ఎల్ పి ఓ, టి పి ఓ పట్టించుకోరా?

**పంచాయతీ అధికారుల మాటలు లెక్కచేయని అక్రమ నిర్మాణదారులు**

**నిద్ర అవస్థలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు**

**రోడ్లపైనే వాహనాలు నిలుపుతూ అక్రమ నిర్మాణాలు పట్టించుకోని ట్రాఫిక్**

**అక్రమ సెల్లార్ తెలిసినా పట్టించుకోని అధికారులు**







**చుంచుపల్లి జూన్ 6 (స్పై న్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. మాకేం తెలవదు మమ్మల్ని ఏమి అడగద్దు అన్నట్టుగా వ్యవహరిస్తున్న పంచాయతీ మండల జిల్లా అధికారులు. విద్యానగర్ మెయిన్ రోడ్డు పక్కనే బఫర్ జోన్ లో బహుళ అంతస్తుల నిర్మాణాలు అక్రమ సెల్లార్ నిర్మాణాలు1/70 గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ అధికారుల రాజకీయ నాయకుల అండదండలతో కొనసాగుతున్నాయి బఫర్ జోన్ లో సెల్లర్ నిర్మాణాలు చేపడుతూ పంచాయతీ అధికారుల మాటలు లెక్కచేయకుండా అంతా మా ఇష్టం మేము ఎవరు చెప్పినా వినం అన్నట్టుగా నిర్మాణాలు జరుగుతున్నాయి.ఈ అక్రమ నిర్మాణాలతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతూ ప్రజలకు అసౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆయన ట్రాఫిక్ వారు గాని పోలీస్ సిబ్బంది గాని ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అక్రమ నిర్మాణాల కట్టడాల జరుగుతున్నాయి ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే దానికి బాధ్యులు ఎవరు? రేపు వర్షాలు వస్తే మామూలుగానే రోడ్లన్నీ జలమైపోతాయి. ఒక గంట సేపు వర్షం పడితే చెరువులను తలపించే విధంగా రోడ్లు జలమైపోయి ఉంటాయి. ఈ సెల్లార్ నిర్మాణంతో వర్షపు నీరు చేరి పక్కన బిల్డింగులు నానిపోయి కూలితే పరిస్థితి ఏమిటి? ప్రమాదం జరిగాక పరుగులు పెడతారా ప్రమాదం జరగకముందే అరికట్టారా ఒక్కసారి ఉన్నతాధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. రేపు రాబోయే వర్షాలలో కచ్చితంగా ప్రమాదం జరిగే సూచనలు ఎక్కువగా ఉన్నాయి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ సెల్లర్ జి ప్లస్ త్రీ నిర్మాణాలను నిలుపుదల చేయాలని కోరుతున్న ప్రజలు.

# అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**సవ్యసాచి గురితప్పని లక్ష్మీదేవి పల్లి**

**అనుమానాలను పటాపంచలు చేస్తూ**

**సాధించిన రిజర్వాయర్**



లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కు రంగం సిద్ధం అత్యంత ప్రతిష్టాత్మకమైన లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ మీదే ఉంది పాలమూరు ప్రాజెక్టులో అంతర్భాగమైన ఈ రిజర్వాయర్ ను గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది కెసిఆర్ వల్లనే కాని పని వీర్లపల్లి వాళ్ళ అవుతుందా అన్న అనుమానాలను పటాపంచలు చేశాడు.. పట్టువదలని విక్రమార్కుడిలా అదును ముందుకు వేసి అనుకున్నది సాధించాడు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ విషయంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సాధించిన ఘనత ఇది. వ్యవసాయం చేసుకునే నియోజకవర్గ ప్రజలకు చిరకాలం పాటు గుర్తుండిపోయే రిజర్వాయర్ కలను సాకారం చేసిన ఘనత ఎమ్మెల్యే వీర్లపల్లి దక్కించుకోగలిగారు ఒక్కసారి ఈ రిజర్వాయర్ పూర్వపక్షంలోకి, వర్తమాన పరిస్థితుల్లోకి తొంగి చూస్తే పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కు సంబంధించి బీఆర్ఎస్ హయాంలోనే బీజం పడినప్పటికీ మొత్తం 21 ప్యాకేజీలకు గాను 18 ప్యాకేజీలు మాత్రమే పూర్తి చేయగలిగారు. ఉదండాపూర్ వరకు పనులు జరిగాయి. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ విషయంలో మాత్రం భూసేకరణ పేరిట జిల్లా కలెక్టర్ సమావేశాలు నిర్వహించినప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు ఈ క్రమంలో ప్రతిపక్ష నాయకుడిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కీలకపాత్ర పోషించారు. పలుమార్లు రిజర్వాయర్ పై ఉద్యమించడమే కాకుండా అప్పటి సీఎల్పీ నేత ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ప్రస్తుత మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, ప్రజా నాయకుడు గద్దర్ తదితర నేతలను తీసుకువచ్చి సమావేశాలు ఏర్పాటు చేసి విషయం వేడెక్కేలా చేశారు. కానీ బీఆర్ఎస్ హయాంలో ఇది సాకారం కాని కలగానే మిగిలిపోయింది. ఇక వర్తమానం లోకి వస్తే..

**అలుపు లేని పోరాటం..**

ఎమ్మెల్యేగా అధికారంలో ఉన్నప్పటికీ ఒక విధంగా లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అలుపెరుగని పోరాటం చేశారనే చెప్పాలి పలుమార్లు సీఎం వెంట తిరిగి ఆయననే ఈ రిజర్వాయర్ కోసం వేధించారు అలాగే మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి తో పాటు ప్రతి మంత్రిని కలిసి రిజర్వాయర్ గురించి ప్రస్తావించారు ఇక్కడ నియోజకవర్గంలోని రైతాంగం ఈ ప్రాజెక్టు మీద ఎన్ని ఆశలు పెట్టుకుందో సవివరంగా చెప్పి తన వంతు ప్రయత్నం చేశారు మొత్తానికి ఆయన ప్రయత్నం ఫలించింది పాలమూరు ప్రాజెక్టుకు కొత్త రూపాన్ని ఇవ్వడమే కాకుండా లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ కోసం తొలి విడతగా 587 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది అంటే దీని వెనుక వీర్లపల్లి శంకర్ కృషి అసమాన్యం.. అనిర్వచనీయం పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో ప్రత్యేకంగా సీఎం రేవంత్ రెడ్డి కదిలి వచ్చి మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి జలంధర్ వాళ్ళతో కలిసి సోమశిల లో సమీక్ష సమావేశం నిర్వహించారంటే దీని వెనక లక్ష్మీదేవి పల్లి కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన ప్రయత్నమే ప్రధాన కారణం. 18 ప్యాకేజీలు పూర్తి చేసి 19, 20 21 ప్యాకేజీలను మాత్రం గత ప్రభుత్వం వదిలేసింది ఇందులో భాగమే లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ దీనిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి వినతిపత్రం అందించారు. కొందరు మండలం లక్ష్మీదేవి పల్లి లో భూసేకరణ తక్షణమే చేపట్టాలని కోరారు దీనివల్ల షాద్ నగర్ తో పాటు, పరిగి నియోజకవర్గానికి కూడా ప్రయోజనం ఉండడంతో ఇందులో అక్కడికి ఎమ్మెల్యే రామ్మోహన్ ను కూడా రామ్మోహన్ రెడ్డిని కూడా భాగస్వామిని చేశారు ఇరువైపుల నుంచి ఒత్తిడి ఉండడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా స్పందించి ఈ రిజర్వాయర్ కు మోక్షం కల్పించారు. ప్రస్తుతం ఇక్కడ భూసేకరణకు వేగంగా రంగం సిద్ధం అవుతుంది. రైతాంగం కల త్వరలోనే సాకారం కాబోతుంది గతంలో 10 ఏళ్ల పాటు పాలించిన సీనియర్ నాయకుల వల్లనే కాని పని కొత్తగా ఎమ్మెల్యేగా అడుగుపెట్టిన వీర్లపల్లి శంకర్ వల్ల అవుతుందా వీర్లపల్లి శంకర్ అమాయకుడు.. ఇది అతని వల్ల కాదు.. ఇలాంటి విమర్శలు అన్నింటిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పటాపంచలు చేశారు అర్జునుడు చేప మీద దృష్టి పెట్టినట్టు వచ్చినప్పటి నుంచి లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు మీద ప్రత్యేక దృష్టి పెట్టి రిజర్వాయర్ ను తెరమీదకి తెచ్చి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించాడు అమాయకుడు కాదు అసాధ్యుడు అని నిరూపించాడు దీనికి కారణం ప్రధానంగా ఎమ్మెల్యేకు డబ్బు మీద ఆశ లేకపోవడం. ఎమ్మెల్యేగా అధికారంలోకి వచ్చినందుకు ప్రజలకు గుర్తుండిపోయేలా ఏదో ఒకటి చేయాలనే సంకల్పాన్ని మనసులో ఉంచుకోవడం. భాగంగానే సొంత ఖర్చులతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, సీఎంతో పట్టుబట్టి మరి సాధించిన ఏకే కృత పాఠశాల, ప్రస్తుత లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్. అందుకే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సర్వత్ర అభినందనలు అందుకుంటున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేధించి సాధించి మరి తన నియోజకవర్గానికి లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ ను సాధించుకున్నట్లు ప్రభుత్వ పెద్దలే చెబుతున్నారు కృత నిశ్చయంతో తాను పట్టుబడితే ఏదైనా సాధించగలనని నిరూపించారు శంకరన్న నువ్వు సూపర్

# టీజీపీఎస్సీ నుంచి మరో ఉద్యోగ ప్రకటన..

**హైదరాబాద్, జూన్ 6:**తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వరుసగా శుభవార్తలు అందిస్తోంది. కమిషన్ పునర్వ్యవస్థీకరణ తర్వాత నియామక ప్రక్రియలో స్పష్టమైన వేగం కనబరుస్తూ, కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే రెండో కీలక ఉద్యోగ ప్రకటనను జారీ చేసింది. రాష్ట్ర విద్యాశాఖలో పరిపాలన, పర్యవేక్షణ బలోపేతం చేసే లక్ష్యంతో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీఈఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ (గ్రేడ్-1 పోస్టుల భర్తీకి అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24 గెజిటెడ్ స్థాయి పోస్టులను భర్తీ చేయనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది. చాలాకాలంగా ఖాళీగా ఉన్న ఈ ఉన్నత స్థాయి పోస్టులను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థల పనితీరును మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నియామకాలు విద్యా వ్యవస్థలో క్షేత్రస్థాయి పర్యవేక్షణను పటిష్టం చేయడానికి దోహదపడతాయని నిపుణులు భావిస్తున్నారు.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల అర్హతలకు సంబంధించి కమిషన్ స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయస్సు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ణయించారు. అయితే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయని కమిషన్ స్పష్టం చేసింది. ఈ సడలింపుల వల్ల సీనియర్ అభ్యర్థులకు సైతం దరఖాస్తు చేసుకునేందుకు మంచి అవకాశం లభించనుంది.అర్హులైన అభ్యర్థులు జూన్ 12వ తేదీ నుంచి ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా జులై 19ని నిర్ణయించారు. చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అభ్యర్థులు గడువు తేదీలోగా ముందే దరఖాస్తు చేసుకోవడం మంచిదని కమిషన్ సూచించింది.ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలు, విద్యా అర్హతలు, పరీక్షా విధానం, సిలబస్, జిల్లా వారీగా ఖాళీల కేటాయింపు, దరఖాస్తు రుసుము వంటి సమగ్ర సమాచారం కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ **tgpsc.gov.in** ను సంప్రదించాలని కమిషన్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి వెబ్‌సైట్‌లో పూర్తిస్థాయి నోటిఫికేషన్ పీడీఎఫ్‌ను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.




# ఏపీలో చిన్న న్యూక్లియర్ రియాక్టర్లు..

**రష్యా దిగ్గజం రోసాటమ్‌కు లోకేష్ ప్రతిపాదన**

**విజయవాడ, జూన్ 6:**ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనలో కీలక అడుగులు వేస్తున్నారు. తన పర్యటనలో నాలుగో రోజు, ఆయన సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రపంచ ప్రఖ్యాత అణుశక్తి దిగ్గజం రోసాటమ్ , అల్యూమినియం తయారీ సంస్థ రుసాల్ ఉన్నత స్థాయి ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఏపీలో భారీ పెట్టుబడులు పెట్టాలని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశ్రమలు స్థాపించాలని ఆయన ఆహ్వానించారు. మరోవైపు, గ్లోబల్ లాజిస్టిక్స్ సదస్సులో పాల్గొని, ఆర్కిటిక్ నూతన జలమార్గం ద్వారా ఏపీకి కలగనున్న ప్రయోజనాలను ప్రపంచానికి వివరించారు.రష్యాకు చెందిన గ్లోబల్ న్యూక్లియర్ టెక్నాలజీ లీడర్ రోసాటమ్ డైరెక్టర్ (ఐటీ & డిజిటలైజేషన్) అలెక్సీమోవ్ ఎవ్ జెనీ, ఇంటర్నేషనల్ డైరెక్టర్ జనరల్ క్యాట్రిన్సీన్ఫ్ ఎగోరోవ్‌తో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులకు గల అపార అవకాశాలను వివరిస్తూ పలు ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రంలో ఉన్న సువిశాల తీరప్రాంతాన్ని ఉపయోగించుకొని, పారిశ్రామిక వాడలకు 24/7 నిరంతరాయంగా స్వచ్ఛమైన విద్యుత్‌ను అందించేందుకు స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల (ఎస్ఎంఆర్) ఏర్పాటు చేయాలని లోకేష్ ఆహ్వానించారు.ఫార్మా, వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించేందుకు వీలుగా న్యూక్లియర్ మెడిసిన్, ఫుడ్ ఇర్రాడియేషన్ సెంటర్‌ను స్థాపించాలని కోరారు. పారిశ్రామిక పార్కుల్లో నీటి కొరతను అధిగమించేందుకు న్యూక్లియర్ డీశాలినేషన్ ప్లాంట్‌ను నిర్మించాలని, అలాగే ఏరోస్పేస్, రక్షణ రంగాలకు అవసరమైన న్యూక్లియర్-గ్రేడ్ మిశ్రమ లోహాలు, కార్బన్-ఫైబర్ కాంపోజిట్‌ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రోసాటమ్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ఇప్పటికే న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్)తో కలిసి పనిచేస్తున్నామని, ప్రతిష్టాత్మక కూడంకుళం అణు విద్యుత్ ప్లాంట్‌కు సాంకేతిక సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఏపీలో పెట్టుబడులకు సంబంధించిన లోకేష్ ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం, 'గ్లోబల్ లాజిస్టిక్స్' లో కొత్త అవకాశాలు -- ఆర్కిటిక్ లో లాజిస్టిక్స్ రూపురేఖలు' అనే అంశంపై జరిగిన సదస్సులో లోకేష్ ప్రసంగించారు. సంప్రదాయ సూయజ్ కాలువ మార్గంతో పోలిస్తే, ఆర్కిటిక్ ఉత్తర సముద్ర మార్గం ఆసియా-ఐరోపా మధ్య ప్రయాణ దూరాన్ని 40% తగ్గిస్తుందని, తద్వారా ఇంధనం, సమయం, ఖర్చులు ఆదా అవుతాయని వివరించారు. 1053 కి.మీ.ల సుదీర్ఘ తీరప్రాంతం, 6 కార్యాచరణ ఓడరేవులు, మరో 4 నిర్మాణంలో ఉన్న పోర్టులతో ఆంధ్రప్రదేశ్ ఈ కొత్త మార్గానికి సహజమైన దక్షిణ ప్రవేశ ద్వారంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.చెన్నై-వ్లాడివోస్టాక్ సముద్ర కారిడార్ ద్వారా విశాఖపట్నం వంటి ఓడరేవులు ఇప్పటికే ఈ వ్యవస్థలో భాగమయ్యాయని గుర్తుచేశారు. ముఖ్యంగా రష్యా నుంచి ఎరువుల రవాణాకు ఈ మార్గం అత్యంత ప్రయోజనకరమని, వ్యవసాయ ఆధారిత ఏపీకి ఇది ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ప్రస్తుతం ఈ మార్గం ఏడాదిలో కొన్ని నెలలే అందుబాటులో ఉన్నా, రష్యా తన ఐస్‌బ్రేకర్ నౌకాదళాన్ని విస్తరిస్తున్నందున త్వరలో ఏడాది పొడవునా రవాణా సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎర్ర సముద్రంలో ఇటీవలి పరిణామాలు ఒకే వాణిజ్య మార్గంపై ఆధారపడటంలోని ప్రమాదాలను గుర్తుచేశాయని, అందుకే ఏపీ ఆర్కిటిక్ మార్గాన్ని అందిపుచ్చుకునేందుకు మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెడుతోందని లోకేష్ సదస్సుకు వివరించారు.

**రుసాల్‌తో చర్చలు: అల్యూమినియం రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం**

మరో కీలక సమావేశంలో, ప్రపంచంలోని అతిపెద్ద అల్యూమినియం ఉత్పత్తిదారుల్లో ఒకటైన రుసాల్ (ఆర్‌యూఎస్ఏఎల్) సీనియర్ యాజమాన్యంతో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. పునరుత్పాదక ఇంధనాన్ని వాడుకొని గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్, విశాఖపట్నం-చెన్నై కారిడార్‌లో ఆటోమోటివ్ & ఏరోస్పేస్ అల్లాయ్ ప్లాంట్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అవసరమైన అల్యూమినియం ఫాయిల్ తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని లోకేష్ ప్రతిపాదించారు. ఈ సందర్భంగా రుసాల్ ప్రతినిధులు మాట్లాడుతూ, తమ సంస్థ ఇప్పటికే మార్చి 2025లో ఏపీకి చెందిన పయనీర్ అల్యూమినియంలో 243 మిలియన్ డాలర్ల పెట్టుబడితో 26 శాతం వాటాను కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. భారత్‌లో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఆసక్తిగా ఉన్నామని, మంత్రి లోకేష్ చేసిన నూతన ప్రతిపాదనలను తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. మొత్తంగా, లోకేష్ రష్యా పర్యటన ఏపీకి నూతన పారిశ్రామిక, వాణిజ్య అవకాశాలను తెచ్చిపెట్టే దిశగా సాగుతోంది.

# వినుకొండ పోలీసుల ఎదుట లొంగిపోయిన మాజీ సీఐ మల్లయ్య...

**గుంటూరు, జూన్ 6:**లైంగిక దాడి ఆరోపణలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న వినుకొండ మాజీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) చిన్న మల్లయ్య ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. పరారీలో ఉన్న ఆయన శుక్రవారం రాత్రి వినుకొండ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ కేసు నమోదైన నాటి నుంచి ఆయన పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న విషయం విదితమే.వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ, తనపై సీఐ చిన్న మల్లయ్య లైంగిక దాడికి పాల్పడ్డారంటూ 2024 ఏప్రిల్ 29న ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఆరోపణలతో అప్పటికే వీఆర్‌లో ఉన్న మల్లయ్యను, ఈ కేసు నేపథ్యంలో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఆయన హైకోర్టు, సుప్రీంకోర్టులలో ముందస్తు బెయిల్ కోసం ఆశ్రయించారు. అయితే, ఆయన పిటిషన్లను ఉభయ కోర్టులు తిరస్కరించాయి. బుధవారం సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ కొట్టివేతకు గురైన వెంటనే, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆయనను సర్వీసు నుంచి శాశ్వతంగా తొలగిస్తూ (డిస్మిస్) ఉత్తర్వులు జారీ చేశారు.కాగా, గురువారం మారువేషంలో వినుకొండ కోర్టు ప్రాంగణానికి వచ్చిన మల్లయ్య, న్యాయమూర్తి సెలవులో ఉన్నారని తెలుసుకొని వెనుదిరిగినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమైనప్పటికీ ఆయన వారి కళ్లుగప్పి తప్పించుకున్నారు. చివరకు న్యాయపరమైన అన్ని దారులు మూసుకుపోవడంతో ఆయన పోలీసులకు లొంగిపోయారు. మల్లయ్య లొంగుబాటుతో పోలీసులు తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. ఈ ఉదంతం పల్నాడు జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది.

# జనసేన తరపున తొలి రాజ్యసభ సభ్యుడి లింగమనేని

**హైదరాబాద్, జూన్ 6:**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజ్యసభ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా లింగమనేని రమేష్ అసెంబ్లీలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. జనసేన పార్టీ తరపున రాజ్యసభ రేసులోకి ఒక అభ్యర్థి అధికారికంగా ఎంట్రీ ఇవ్వనుండటం ఇదే తొలిసారి కావడం విశేషం.ఈ నామినేషన్ ప్రక్రియ అధికార ఎన్డీఏ కూటమిలోని మూడు భాగస్వామ్య పార్టీల మధ్య ఉన్న బలమైన ఐక్యతను స్పష్టం చేసింది. లింగమనేని రమేష్ నామినేషన్‌ను సమర్థిస్తూ ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే సంతకాలు చేశారు.నామినేషన్ దాఖలు చేసే సమయంలో కూటమికి చెందిన ఎమ్మెల్యేలు ఆయనకు మద్దతుగా పెద్ద సంఖ్యలో అసెంబ్లీకి తరలివచ్చారు. వీరిలో నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, బొలిశెట్టి శ్రీనివాస్ నాయక్, వంశీకృష్ణ శ్రీనివాస్, పులపర్తి రామాంజనేయులు, దేవా వరప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, నక్కా ఆనంద్ బాబు, బీజేపీ ప్రతినిధి ఎన్. ఈశ్వర్ రావు తదితరులు ఉన్నారు. మరోవైపు, మిగిలిన మూడు రాజ్యసభ స్థానాలకు టీడీపీ అభ్యర్థులు నామినేషన్ వేయనున్నారు. టీడీపీ అభ్యర్థుల పేర్లు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

## బిజినెస్

### స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు..!



బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. గత కొన్ని సెషన్లుగా కొనసాగుతున్న స్వల్ప దిద్దుబాటు ట్రెండ్ మంగళవారం కూడా కనిపించింది. అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధరలు పెద్దగా ఒడుదొడుకులకు లోనుకాకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. స్థానిక మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం.. హైదరాబాద్‌లో బుధవారం ఉదయం 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం రూ.1,56,210ల వద్ద, 22 క్యారెట్ల బంగారం రూ.1,43,190ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,17,160గా ఉంది. మంగళవారం నాటి ముగింపు ధరలతో పోలిస్తే.. సుమారు పది రూపాయల మేర తగ్గింది. అదేవిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర అమరావతిలో రూ.1,56,210లు, విజయవాడలో రూ.1,56,210లు, విశాఖపట్నంలో రూ.1,56,210, రాజమండ్రిలో రూ.1,56,210 వద్ద ట్రేడ్ అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో కదలికలు, అమెరికా డాలర్ విలువ, భౌగోళిక రాజకీయ పరిణామాలు, దేశీయ డిమాండ్ వంటి అంశాలు భారత మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయంగా కమొడిటీ మార్కెట్లపై ఒత్తిడి తగ్గడంతో ధరలు కాస్త మెత్తబడ్డాయని నిపుణులు చెబుతున్నారు. అయితే కొత్తగా భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగితే ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పండుగల సీజన్ ఏమీ లేకపోవడంతో కొనుగోలుదారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారని నగరంలోని జ్యుయెలరీ వ్యాపారులు తెలిపారు. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా స్థిరంగా ఉంటూ స్వల్పంగా తగ్గాయి.

### హీరో ఫ్లెక్స్ ఫ్యూయల్ బైక్స్ వచ్చేశాయ్




ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ ఫ్లెక్స్ ఫ్యూయల్ ఇంజిన్ కలిగిన మోటార్ సైకిళ్లను విడుదల చేసింది. ఫ్లెక్స్ ఫ్యూయల్‌కు సపోర్ట్ చేసే స్ప్లెండర్, హెచ్ఎఫ్ డీలక్స్‌ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, హర్దీప్ సింగ్ పురీ వీటిని ఆవిష్కరించారు. స్ప్లెండర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ మోడల్ ధర రూ.82,810 (ఎక్స్‌షోరూమ్), హెచ్ఎఫ్ డీలక్స్ ఫ్లెక్స్ ఫ్యూయల్ ధర రూ.72,792 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించారు. ఈ మోడళ్లు ఇ20 నుంచి ఇ85 ఫ్యూయల్‌కు సపోర్ట్ చేస్తాయి. ఇక్కడ ఇ అంటే ఇథనాల్. ఈ20 అంటే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలుపుతారు. ప్రస్తుతం కొన్ని పెట్రోల్ పంపుల వద్ద ఈ20 పెట్రోల్ లభిస్తోంది. బీఎస్6 మోడళ్లు చాలా వరకు ఈ20కి సపోర్ట్ చేస్తున్నాయి. ఇక ఈ85 అంటే 85 శాతం ఇథనాల్, 15 శాతం మాత్రమే పెట్రోల్ ఉంటుంది. వినియోగదారులు ఏ తరహా పెట్రోల్ వేసినా ఈ మోటార్ సైకిళ్లు నడుస్తాయి. తొలి దశలో దిల్లీ, మహారాష్ట్రలో హీరో మోటార్ సైకిళ్లు అందుబాటులోకి తేనున్నారు. జులై నుంచి మార్కెట్‌లో లభిస్తాయి. రాబోయే రెండేళ్లలో మిగిలిన మోడళ్లను కూడా ఫ్లెక్స్ ఫ్యూయల్ ఇంజిన్‌లుగా మారుస్తామని హీరో మోటోకార్ప్ తెలిపింది.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..


# సెన్సెక్స్ 323 పాయింట్లు పతనం




భారత స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 323 పాయింట్లు నష్టపోయి 74,326 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 86 పాయింట్లు నష్టపోయి 23,396 వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ నష్టాలతోనే ప్రారంభమైంది. సెన్సెక్స్ 74,300 పాయింట్లతో, 350కిపైగా పాయింట్ల నష్టంతో ప్రారంభమైంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 100 పాయింట్ల నష్టంతో 23,400 వద్ద ప్రారంభమైంది. రోజంతా ట్రేడింగ్ నష్టాల బాటలోనే సాగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్? ఇండియా పాలసీ మీటింగ్ ఈ రోజు ప్రారంభమైంది. వారాంతం వరకు కొనసాగనుంది. దీంతో వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం వంటి అంశాల్లో ఆర్బీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అనే అంశంపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అమెరికా--ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్‌పై నెగెటివ్ ప్రభావం చూపాయి. హార్ముజ్ జలసంధి పూర్తిగా ఓపెన్ కాకపోవడం, చమురు ధరల పెరుగుదల వంటివి కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. దీంతో అమ్మకాల ఒత్తిడి పెరిగి మార్కెట్ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్ర షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. వీటిలో టీసీఎస్ షేర్ దాదాపు 9 శాతం పతనమైంది. కోవిడ్ తర్వాత టీసీఎస్ షేర్లు ఈ స్థాయిలో పతనమవ్వడం ఇదే మొదటిసారి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ట్రెంట్, ఇండిగో, ఎస్బీఐ, ఐసీఐసీఐ షేర్లు లాభాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ విపణిలో 4,461 డాలర్ల వద్ద కొనసాగింది. డాలర్‌తో రూపాయి మారక విలువ 95.71గా ఉంది.

## ఇక డబ్ల్యూపీఐకి చెల్లు.. పరిచయం కానున్న ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్

**న్యూఢిల్లీ :** దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను ప్రతిబింబించే గణాంకాల పేర్లను, వాటి కొలతల ప్రక్రియను ఒక్కొక్కటిగా మార్చేస్తున్నది కేంద్ర ప్రభుత్వం. ఈ క్రమంలోనే ఇప్పుడు టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం లెక్క వంతు వచ్చింది. హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్‌ను రాబోయే ఐదేండ్లలో క్రమక్రమంగా పక్కనపెట్టి, దాని స్థానంలో ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్ (పీపీఐ)ను తెస్తామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమ మంత్రిత్వ శాఖల ప్రధాన ఆర్థిక సలహాదారు ప్రవీణ్ మహతో తాజాగా ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. అలాగే ఇండస్ట్రీ, ఇంటర్నల్ ట్రేడ్ ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ).. ఈ నెల 15న కొత్త బేస్ ఇయర్ 2022-23 ఆధారంగా డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణ గణాంకాలను విడుదల చేస్తుందని చెప్పారు. ఇప్పటిదాకా 2011-12 సంవత్సరం ధరల ఆధారంగా టోకు ద్రవ్యోల్బణం గణన జరిగింది. కాగా, ఇప్పటికే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) సహా మరికొన్నింటి గణన ప్రామాణికాలను మోదీ సర్కార్ మార్చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే మరింత సవివరంగా పీపీఐ గణాంకాలను విడుదల చేయబోతున్నట్లు మహతో చెప్తున్నారు. ఔట్‌పుట్, ఇన్‌పుట్, సేవల ధరల కవరేజీతో పీపీఐ గణాంకాలను రూపొందిస్తామని అంటున్నారు. అప్పుడే ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం తీరుతెన్నులను కచ్చితంగా అంచనా వేయగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.




**నూతన ప్రామాణికాలు..**

ఈ నెల 15న బ్యాంకింగ్, సెక్యూరిటీస్ లావాదేవీలు, బీమా, పెన్షన్ ఫండ్స్ నిర్వహణ, రైల్వేలు, విమాన ప్రయాణికులు, టెలికాం రంగాలకు సంబంధించి ఔట్‌పుట్ ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్ (ఓపీపీఐ), ట్రయల్ ఇన్‌పుట్ ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్ (ఐపీపీఐ), సర్వీస్ ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్ (సర్వీస్ పీపీఐ) గణాంకాలను కొత్త సిరీస్ 2022-23 సంవత్సరం ఆధారంగా విడుదల చేస్తామని మహతో ఈ సందర్భంగా తెలియజేశారు. 1942లో డబ్ల్యూపీఐ పరిచయమైంది. నాడు దాని బేస్ ఇయర్ 1939. అప్పట్నుంచి ఇప్పటిదాకా ఏడుసార్లు బేస్ ఇయర్‌ను మార్చారు. 2017లో ఇప్పుడున్న 2011-12 బేస్ ఇయర్ మొదలైంది.

**ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు : క్రిసిల్**

అధిక పెట్రోల్, డీజిల్ ధరలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తీవ్రతరం చేస్తాయని మంగళవారం తమ నివేదికలో దేశీయ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ హెచ్చరించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 42 నెలల గరిష్ఠాన్ని తాకుతూ టోకు ద్రవ్యోల్బణం 8.3 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం ప్రభావం కనిపించింది. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలతో పెరుగుతున్న ముడి చమురు ధరలు.. దేశీయ మార్కెట్‌లో ఇంధన ధరల్ని పరుగులు పెట్టిస్తున్నాయి. అమెరికాకు అండగా ఉంటున్నాయని పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఫలితంగా గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. మరోవైపు హొర్ముజ్ జలసంధిలో రవాణాను సైతం ఇరాన్ అడ్డుకుంటున్నది. దీంతో భారత్ తదితర దేశాలకు చమురు కష్టాలు వచ్చిపడ్డాయి.

## స్పోర్ట్స్

### భారత టీ20 కెప్టెన్‌గా అతడికే అగార్కర్ మద్దతు..

# గంభీర్ విముఖత?

టీమిండియా టీ20 కెప్టెన్ మార్పు అంశంపై భారత క్రికెట్ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. భారత్‌కు ఈ ఏడాది ప్రపంచకప్ టైటిల్ అందించినప్పటికీ సూర్యకుమార్ యాదవ్‌పై వేటు వేసేందుకు భారత ?క్రికెట్ నియంత్రణ మండలి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఒకప్పుడు ప్రపంచ నంబర్‌వన్ బ్యాటర్‌గా ఉన్న సూర్య.. సారథిగా పగ్గాలు చేపట్టిన తర్వాత ఆటగాడిగా తేలిపోవడమే ఇందుకు కారణం. అంతేగాక టీ20 ప్రపంచకప్-2028 టోర్నీకి జట్టును సన్నద్ధం చేసే క్రమంలో 35 ఏళ్ల సూర్య వయసు కూడా ఓ అడ్డంకిగా మారిందనే అభిప్రాయాలు ఉన్నాయి.

**పరిశీలనలో మూడు పేర్లు**

ఈ పరిణామాల నేపథ్యంలో బీసీసీఐ కొత్త కెప్టెన్ విషయంలో తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు బోర్డు సన్నిహిత వర్గాలు తెలిపాయి. వరల్డ్‌కప్ వీరుడు సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ఇటీవల వెల్లడించాయి. అయితే, తాజా సమాచారం ప్రకారం.. సంజూ, అక్షర్‌లను కాదని శ్రేయస్ అయ్యర్‌కే సెలక్షన్ కమిటీ ఓటేసినట్లు సమాచారం. ఇందులో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌దే ప్రధాన పాత్ర అని తెలుస్తోంది. ఈ విషయం గురించి బీసీసీఐ వర్గాలు 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో మాట్లాడుతూ..

**అతడికే ఓటేసిన అగార్కర్**

"అజిత్ దృఢచిత్తం గల చీఫ్ సెలక్టర్. స్ట్రాంగెస్ట్ చీఫ్ సెలక్టర్లలో అతడు ముందు వరుసలో ఉంటాడు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే అతడు ఎన్నో కఠిన నిర్ణయాలు తీసుకున్నాడు. తన ప్యానెల్‌తో కలిసి కొత్త టీ20 కెప్టెన్ కోసం అగార్కర్ తీవ్రంగా కసరత్తు చేస్తున్నాడు. ఇందులో భాగంగానే శ్రేయస్ అయ్యర్‌ను తొలుత వన్డేలకు వైస్ కెప్టెన్‌గా నియమించారు. టీ20 ప్రపంచకప్-2026 ఆరంభానికి ముందే శ్రేయస్ విషయంలో ఒక నిర్ణయమైతే జరిగిపోయింది" అని పేర్కొన్నాయి.



**గంభీర్ విముఖత!**

అయితే, హెడ్‌కోచ్ గౌతం గంభీర్ మాత్రం శ్రేయస్ అయ్యర్ విషయంలో అగార్కర్‌తో ఏకీభవించడం లేదని సమాచారం. "గంభీర్ మనసులో ఒకరు ఉండొచ్చు. సెలక్టర్లు వేరొకరి గురించి ఆలోచించవచ్చు. అయితే, అక్షర్ పటేల్ వరల్డ్‌కప్ టోర్నీలో వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన విషయాన్ని మర్చిపోవద్దు.

**రేసులో ఇషాన్ కూడా!**

ఇక ఇషాన్ కిషన్.. అతడి వయసు చిన్నదే. ఫామ్‌లో ఉన్నా డు. సారథిగానూ నిరూపించుకుంటున్నాడు. ఇదిలా ఉంటే.. సంజూ శాంసన్ విషయంలో మాత్రం సెలక్టర్లు సంతృప్తిగా లేరు. అతడి నిలకడలేని ఆట తీరే ఇందుకు కారణం. కాబట్టి శ్రేయస్ అయ్యర్‌తో పాటు ఇషాన్, అక్షర్ కూడా రేసులో ఉన్నారని చెప్పవచ్చు. కానీ సంజూకు మాత్రం అవకాశం ఉండకపోవచ్చు" అని బీసీసీఐ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఏదేమైనా ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటన తర్వాత కొత్త టీ20 కెప్టెన్ గురించి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

### న్యూజిలాండ్‌తో అతిపెద్ద ద్వైపాక్షిక సిరీస్.. 5 టీ20లు, 5 వన్డేలు, 2 టెస్టులు ఆడనున్న భారత్



ఆక్లాండ్: న్యూజిలాండ్‌లో ఇండియా పర్యటించనున్నది. ఆ రెండు దేశాల మధ్య అతిపెద్ద ద్వైపాక్షిక క్రికెట్(×అఒఙఖు ఎం చీవష్గ్గఖుశ్రీఖుఅఒ) సిరీస్ జరగనున్నది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు జరిగే ఈ సిరీస్‌లో 5 టీ20 మ్యాచ్‌లు, 5 వన్డేలు, రెండు టెస్టులు ఆడనున్నారు. సుమారు 40 రోజుల పాటు ఈ సిరీస్ కొనసాగనున్నది. ఇప్పటిక వరకు రెండు దేశాల మధ్య జరగబోయే అతిపెద్ద ద్వైపాక్షిక సిరీస్ ఇదే కానున్నది. న్యూజిలాండ్ పర్యటనలో మొత్తం 12 మ్యాచ్‌లు ఉండనున్నాయి. గతంలో ఎప్పుడూ ఇంత భారీ సంఖ్యలో అక్కడ సిరీస్ జరగలేదు. రెండు దేశాల మధ్య క్రీడాసంబంధాలకు వందేళ్లు నిండిన నేపథ్యంలో ఈ భారీ సిరీస్‌కు ప్లాన్ చేశారు. అక్టోబర్ 22వ తేదీన తొలి టీ0 మ్యాచ్ క్రైస్ట్‌చర్చ్‌లో జరగనున్నది. టీ20 సిరీస్ తర్వాత వన్డే సిరీస్ జరుగుతుంది. నవంబర్ 4వ తేదీన ఆక్లాండ్‌లో తొలి వన్డే జరుగుతుంది. ఇక నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లో ఫస్ట్ టెస్ట్ మ్యాచ్, నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు రెండో టెస్టు క్రైస్ట్‌చర్చ్‌లో జరగనున్నది. కేవలం క్రికెట్ సిరీస్ మాత్రమే కాదు అని, రెండు దేశాల మధ్య చరిత్ర, సంస్కృతి సంబంధాలకు చెందిన సంబరాలు జరగనున్నట్లు న్యూజిలాండ్ క్రికెట్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ గ్లెన్ క్రిట్‌చెల్లీ తెలిపారు. కోహ్లీ, బుమ్రా లాంటి ఆటగాళ్లు కూడా ఈ టూర్‌కు వస్తారని, దానికి తగినట్లు తాము ప్రిపేరవులున్నట్లు కివీస్ మార్కెటింగ్ చీఫ్ చెప్పారు. 2019-20 సీజన్ తర్వాత న్యూజిలాండ్‌కు భారత్ వెళ్లలేదు. కానీ ఆ తర్వాత రెండుసార్లు ఇండియాలో కివీస్ టూర్ చేసింది.


### కార్ల్‌సన్‌కు మళ్లీ షాక్.. ప్రజ్ఞానంద క్లాసికల్ విక్టరీ

ఓస్లో: యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద(గ్రాతీఖుస్త్రస్త్రఖుఖుఖుఅస్త్రుఖు) మళ్లీ షాకిచ్చాడు. హోమ్‌టౌన్ హీరో, వరల్డ్ నెంబర్ వన్ ప్లేయర్ మ్యాగ్నస్ కార్ల్‌సన్‌పై వరుసగా రెండోసారి విక్టరీ కొట్టాడు. నార్వే చెస్ టోర్నీలో క్లాసికల్ గేమ్‌లోనూ కార్ల్‌సన్‌పై స్టన్నింగ్ విక్టరీ సాధించాడు ప్రజ్ఞానంద. మరోవైపు వరల్డ్ చాంపియన్ డీ గుకేశ్.. నార్వే టోర్నీలో చేతులెత్తేశారు. 8వ రౌండ్ గేమ్‌లో ఫ్రెంచ్ గ్రాండ్‌మాస్టర్ అలిరేజా ఫిరౌజా చేతిలో ఓటమి పాలయ్యాడు.దీంతో పాయింట్ల పట్టికలో గుకేశ్ దిగువ స్థాయిలో ఉండిపోయాడు. డబుల్ రౌండ్ రాబిన్ ఎలైట్ ఈవెంట్‌లో ప్రజ్ఞానంద అసాధారణ ప్రతిభ కనబరిచారు. క్లాసికల్ గేమ్‌లో ఈ ఏడాది కార్ల్‌సన్‌పై రెండు సార్లు గెలిచిన ప్లేయర్‌గా ఇండియన్ స్టార్ నిలిచాడు. ఈ టోర్నీలో ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉన్నాయి. కానీ 20 ఏళ్ల ప్రజ్ఞానంద 12 పాయింట్లతో ప్రస్తుతం మూడవ స్థానంలో ఉన్నాడు. అలీరేజా 13 పాయింట్లతో రెండో స్థానంలో, అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ వెస్లే సో 14 పాయింట్లతో మొదటి స్థానంలో ఉన్నాడు. నార్వే టోర్నీలో కార్ల్‌సన్ పేలవ ఫామ్ కొనసాగుతోంది. అయిదు సార్లు ప్రపంచ చాంపియన్ కార్ల్‌సన్ కేవలం 9 పాయింట్లే సాధించాడు. తర్వాత జరిగే రెండు క్లాసికల్ గేమ్స్‌లో అతను గెలిచినా.. పాయింట్ల విషయంలో అతను నెట్టుకురావడం కష్టమే. ఇక ప్రజ్ఞానంద చేతిలో మొత్తానికి మూడు సార్లు కార్ల్‌సన్ ఓడారు.



# 'పెద్ది' రిలీజ్‌కు ముందే మెగా హంగామా..

## కూకట్‌పల్లిలో రామ్ చరణ్‌కి ఆలయం ఏర్పాటు



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు ముందే తెలుగు రాష్ట్రాల్లో అభిమానుల సందడి తారాస్థాయికి చేరుకుంది. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, సినిమా విడుదలకు ముందు నుంచే మెగా అభిమానులు థియేటర్ల వద్ద పండుగ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.ప్రత్యేకంగా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతం మరోసారి అభిమానుల సందడికి కేంద్రబిందువుగా మారింది. టాలీవుడ్‌లో పెద్ద హీరోల సినిమాల విడుదల సందర్భంగా భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సాధారణమే. అయితే ఈసారి అభిమానులు మరింత ప్రత్యేకంగా ఆలోచించి, 'పెద్ది' సినిమాలో కనిపించే రామ్ చరణ్ పాత్రను ప్రతిబింబించేలా భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అర్జున్ థియేటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహానికి అభిమానులు 'శ్రీ రామ్ చరణ్ ఆలయం' అనే పేరుతో ప్రత్యేక ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. గ్రామీణ నేపథ్యంలోని 'పెద్ది' పాత్రను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ విగ్రహం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. థియేటర్ వద్దకు భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ సందడి చేశారు.అంతేకాకుండా కొందరు అభిమానులు విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి, కర్పూర హారతులు ఇస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. డప్పులు, బ్యానర్లు, నినాదాలతో థియేటర్ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ వేడుకలకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతూ ట్రెండింగ్‌లో నిలిచాయి. 'ఆర్ఆర్ఆర్' వంటి గ్లోబల్ విజయానంతరం రామ్ చరణ్ నుంచి వస్తున్న పూర్తి స్థాయి రా అండ్ రస్టిక్ మాస్ ఎంటర్‌టైనర్ కావడంతో 'పెద్ది'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గ్రామీణ క్రీడల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో చరణ్ కొత్త అవతారంలో కనిపించనున్నాడనే ప్రచారం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోలపై భారీ స్పందన కనిపిస్తుండగా, థియేటర్ల వద్ద అభిమానులు చేస్తున్న హంగామా చూస్తుంటే 'పెద్ది' విడుదల రోజు మెగా వేడుకలు మరింత భారీ స్థాయిలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో అన్న ఆసక్తి ఇప్పుడు సినీ వర్గాల్లో నెలకొంది.



## కంగనా రనౌత్ 'భారత్ భాగ్య విధాత' ట్రైలర్ విడుదల!

ముంబై 26/11 ఉగ్రదాడుల నేపథ్యంలో, ప్రాణాలకు తెగించి పోరాడిన నిజమైన హీరోల కథతో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ నటించిన తాజా చిత్రం 'భారత్ భాగ్య విధాత' (దీష్ఠుతీఫ్ దీష్ఠష్ఠుస్త్రుఝ ఎఅఇనఇష్ఠుఘ్ఝు -- ఎష్ట్రవ ఖఅంవవఅ ఎవతీశీవం). ఈ సినిమా జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. 2008లో ఉగ్రవాదులు ముంబైలోని కామా హాస్పిటల్‌పై దాడి చేసినప్పుడు, అక్కడ దాదాపు 400 మంది రోగులను, గర్భిణీలను, చిన్న పిల్లలను కాపాడటానికి ప్రాణాలను పణంగా పెట్టిన నర్సులు, వార్డ్ బాయ్స్ మరియు హాస్పిటల్ సిబ్బంది వీరోచిత పోరాటమే ఈ సినిమా ముఖ్య కథాంశం. ఈ చిత్రంలో కంగనా రనౌత్ ఒక సాధారణ నర్సు పాత్రలో కనిపించబోతున్నారు. ఇంట్లోనూ, సమాజంలోనూ పెద్దగా గుర్తింపు లేని ఒక సాధారణ మహిళ, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎంతటి సాహసానికి ఒడిగట్టిందనేది ఈ ట్రైలర్‌లో ఎమోషనల్‌గా మరియు ఉత్కంఠభరితంగా చూపించారు. మనోజ్ తపారియా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్, కంగనా రనౌత్‌కు చెందిన మణికర్ణిక ఫిల్మ్స్ మరియు పరమహంస క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ చిత్రంలో కంగనాతో పాటు గిరిజా ఓక్, స్మితా తాంబే, అమృతా నామ్‌దేవ్, ఈషా డే ముఖ్య పాత్రలు పోషించారు.

## మళ్లీ పెళ్లి పీటలెక్కనున్న ఆమిర్ ఖాన్.. హాజరుకానున్న సల్మాన్, షారుఖ్!



బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ మరోసారి కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నారు. 61 ఏళ్ల ఆమిర్ తన భాగస్వామి, 47 ఏళ్ల గౌరీ స్ప్రాట్‌ను జులై 5న వివాహం చేసుకోబోతున్నట్లు సమాచారం. ముంబైలోని ఆమిర్ నివాసంలో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ వేడుక చాలా సైలెంట్‌గా, ప్రైవేట్ రిజిస్టర్ మ్యారేజ్ రూపంలో జరగబోతుంది. తమ బంధాన్ని అధికారికం చేసుకోవాలని ఈ జంట ఇటీవలనే నిర్ణయించుకుందని, ఇరు కుటుంబాల మద్దతుతో ఇప్పటికే వివాహ ఏర్పాట్లు కూడా ప్రారంభమయ్యాయని వారి సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా కేవలం కుటుంబ సభ్యులు, కొద్దిమంది స్నేహితుల మధ్యే ఈ వేడుకను ముగించాలని వారు భావిస్తున్నారు. ఈ ప్రైవేట్ వివాహ వేడుకకు ఆమిర్ ఖాన్ మిత్రులైన బాలీవుడ్ సూపర్ స్టార్స్ సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్ కూడా హాజరయ్యే అవకాశం ఉందని బాలీవుడ్ వర్గాల్లో గట్టిగా ప్రచారం నడుస్తుంది. గౌరీ స్ప్రాట్‌కు గత వివాహం ద్వారా క్విన్ అనే ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆమె తాతగారైన ఫిలిప్ స్ప్రాట్ బ్రిటన్ సంతతికి చెందిన కమ్యూనిస్ట్ కాగా, ఆయన 1920లలో భారతదేశానికి వచ్చి ఇక్కడి స్వాతంత్ర్య పోరాటంలో కూడా పాల్గొన్నారు. గత ఏడాది ముంబైలో జరిగిన తన ప్రీ-బర్త్‌డే వేడుకలో ఆమిర్ ఖాన్ మొదటిసారిగా గౌరీని మీడియాకు పరిచయం చేశారు. ఆమిర్ ఖాన్‌కు ఇది మూడో వివాహం కానుంది. ఆయనకు గతంలో రీనా దత్తాతో వివాహం జరగ్గా, వారికి జునైద్, ఇరా అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ తర్వాత ఆయన దర్శకురాలు కిరణ్ రావును వివాహం చేసుకోగా, వారికి ఆజాద్ అనే కుమారుడు జన్మించాడు. ఆమిర్, కిరణ్ రావు జంట 2021లో తమ విడాకులను ప్రకటించారు. ఇప్పుడు జులై 5న జరగబోయే రిజిస్టర్ మ్యారేజ్ మరియు చిన్న ఫ్యామిలీ గెట్-టుగెదర్ ద్వారా ఆమిర్, గౌరీ తమ వైవాహిక జీవితాన్ని ప్రారంభించనున్నారు.

## త్రిషకు మెగా కోడలి సర్‌ప్రైజ్ గిఫ్ట్.. అదేంటో తెలుసా?

హీరోయిన్ త్రిషకు మెగా ఫ్యామిలీ సర్‌ప్రైజ్ ఇచ్చింది. మెగా కోడలు, రామ్ చరణ్ సతీమణి ఉపాసన నుంచి ప్రత్యేక బహుమతిని అందుకుంది. అత్తమ్మాస్ కిచెన్ నుంచి స్పెషల్ సర్‌ప్రైజ్ గిఫ్ట్ పొందింది. అత్తమ్మాస్ కిచెన్ నుంచి త్రిషకు ప్రత్యేక గిఫ్ట్ హ్యాంపర్ చేరింది. ఈ విషయాన్ని త్రిష సోషల్ మీడియాలో పంచుకుంది. థ్యాంక్ యూ ఉపాసన.. ది సమ్మర్ స్పెషల్ గిఫ్ట్.. అంటూ ఆనందం వ్యక్తం చేసింది. కాగా.. అత్తమ్మాస్ కిచెన్ పేరుతో ఉపాసన, చిరంజీవి సతీమణి సురేఖ ఈ వంటకాలు తయారు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచారు. ఇందులో కేసరి, పొంగల్, ఉప్మా, రసం లాంటి వంటకాలు ఉండనున్నాయి. అత్తమ్మాస్ కిచెన్‌లో పులిహోర వంటకం ఎక్కువగా ఫేమస్ అయింది. త్రిషకు పంపిన గిఫ్ట్ హ్యాంపర్‌లో రుచికరమైన ఆవకాయ పచ్చళ్లతో పాటు వివిధ రకాల పొడులు కూడా ఉన్నాయి. దీంతో త్రిష ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇక త్రిష విషయానికొస్తే.. విజయ్ సీఎం అయ్యాక ఆమె పేరు మార్మోగిపోతోంది. ఎక్కడ చూసినా వీరిద్దరి గురించే చర్చ నడుస్తోంది. త్వరలోనే త్రిష పెళ్లి చేసుకోనుందని రూమర్స్ కూడా వస్తున్నాయి. వాటన్నింటికీ త్రిష సైతం తనదైన శైలిలో కౌంటర్స్ ఇస్తూనే ఉంది. ఇటీవల నా కుక్కకు మాత్రమే వ్యక్తగత విషయాల్లో అనుమతి ఇస్తానని రూమర్స్‌ను ఉద్దేశించి పోస్ట్ చేసింది.



## 'కరుప్పు' బ్లాక్ బస్టర్.. సీఎం విజయ్‌ను కలిసిన దర్శకుడు ఆర్‌జే బాలాజీ



'కరుప్పు' సినిమా బ్లాక్ బస్టర్ అందుకోవడంతో ఈ చిత్ర దర్శకుడు ఆర్‌జే బాలాజీ.. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నాడు. ఈ సందర్భంగా తన 'కరుప్పు' కథను మొదట విన్నందుకు సీఎం విజయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విజయ్‌ను ముఖ్యమంత్రి హోదాలో కలవడం తనకు ఒక కలలా అనిపిస్తోందని, ఆయనలో ఇప్పటికీ అదే ప్రేమ, ఆప్యాయత, ప్రశాంతత కనిపిస్తున్నాయని బాలాజీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఇప్పటికే రూ. 300 కోట్లకు పైగా వసూళ్లతో దూసుకుపోతుంది. సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో నటించారు. నిజానికి 'కరుప్పు' సినిమా కథను ఆర్‌జే బాలాజీ మొదట విజయ్ కోసమే సిద్ధం చేశారు. విజయ్ రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో రాకముందు, ఆయన చివరి చిత్రంగా దీనిని తెరకెక్కించాలని భావించి కథను కూడా వినిపించారు. అయితే, ఆ సమయంలో పలు సమీకరణాలు, రాజకీయ ప్రవేశం వంటి కారణాల వల్ల విజయ్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోవాల్సి వచ్చింది. ఆయన ఈ సినిమా చేయనప్పటికీ, స్క్రిప్ట్ చర్చల సమయంలో విజయ్ అడిగిన ప్రశ్నలు, ఇచ్చిన సలహాలు కథను మరింత మెరుగుపరచడానికి ఎంతో ఉపయోగపడ్డాయని బాలాజీ గతంలో వెల్లడించారు. అందుకే ఈ సినిమా ప్రారంభ క్రెడిట్స్‌లో విజయ్‌కు ధన్యవాదాలు కూడా తెలిపారు. విజయ్ నో చెప్పిన తర్వాతే ఈ స్క్రిప్ట్ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ద్వారా హీరో సూర్య వద్దకు వెళ్ళింది.

# కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఆత్మనిర్భర్ భారత్ ప్రచారాన్ని ఎద్దేవా చేసే నిరాశావాదులు గతంలో దేశాన్ని ఇతరులపై ఆధారపడేలా చేశారని మండిపడ్డారు. అలాగే, రాజకీయ లబ్ధి కోసం దేశాన్ని అస్థిరపరిచేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గత 12 ఏళ్లుగా కాంగ్రెస్? గందరగోళం, అనిశ్చితిని సృష్టిస్తూ అవకాశాల కోసం ప్రయత్నిస్తోందని, కానీ దేశ ప్రజలు దానికి పదేపదే తగిన జవాబు ఇచ్చారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్? ప్రభుత్వాల దుష్పరిపాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. శుక్రవారం గుజరాత్?లోని సూరత్?లో? పర్యటించిన మోదీ పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఈ మేరకు మాట్లాడారు. "ఇటీవల హిమాచల్‌లో కూడా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ, ఆ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. హిమాచల్?లో కాంగ్రెస్ దుష్పరిపాలనను ప్రజలు తిరస్కరించారు. అంతకుముందు, హరియాణాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. అలాగే పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశాన్ని పంపారు. అరాచకం మధ్య అవకాశాల కోసం వెతికే కాంగ్రెస్ రాజకీయాలు ఇక సాగవు." అలాగే కర్ణాటకలోని రాజకీయ పరిస్థితులపై ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్? ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, అందుకే ఆ పార్టీ అక్కడ తమ ముఖ్యమంత్రిని మార్చాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం దేశాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని మోదీ అన్నారు. అందుకే దేశ ప్రజలు బీజేపీపై, దాని అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసం ఉంచుతూ, పదేపదే బీజేపీని గెలిపిస్తున్నారని పేర్కొన్నారు. "నేను ఇటీవల ఐదు దేశాల్లో పర్యటించాను. అక్కడ కూడా చర్చంతా బంగాల్ గురించే. బంగాల్, అసోం, పుదుచ్చేరిల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, ఎన్?డీఏలు భారీ మెజారిటీని సాధించాయి. ప్రజల మా ప్రభుత్వంపై నమ్మకం ఉంచి మమ్మల్ని గెలిపించారు" అని మోదీ పేర్కొన్నారు.



### ప్రపంచం సవాళ్లను భారత్ దీటుగా ఎదుర్కొంది!

మరోవైపు, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల వల్ల ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సంక్షోభం గురించి ప్రధాని మోదీ ప్రస్తావించారు. అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ సరఫరా వ్యవస్థకు ఇంధన స్వయం సమృద్ధి ఎంత కీలకమో ప్రస్తుత ప్రపంచ సంక్షోభం చూపిస్తోందని మోదీ అన్నారు. అయితే, 2014 నుంచి దేశం తన సామర్థ్యాన్ని ఎలా పెంచుకుందో వివరించారు.

"ప్రపంచం సవాళ్ల దశ గుండా వెళుతోంది. ఈ దశాబ్దం ప్రపంచానికి విపత్తుల దశాబ్దంగా మారుతోందని నేను కొంతకాలం క్రితం చెప్పాను. మొదట, కోవిడ్ వల్ల భారీ సంక్షోభం ఏర్పడింది. ఆ తర్వాత పలుచోట్ల యుద్ధాలు చెలరేగాయి, తీవ్రమైన ఇంధన సంక్షోభం యావత్ ప్రపంచాన్ని అస్తవ్యస్తం చేసింది. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ ధరలు నిరంతరం హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. గ్యాస్ సరఫరా గొలుసులు కుప్పకూలుతున్నాయి. అయితే, ఈ ప్రపంచవ్యాప్త ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, భారత్? స్థిరంగా, బలంగా నిల్చుంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి చమురు, గ్యాస్ సరఫరాలను సమకూర్చుకున్నాం. మరోవైపు పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులను చారిత్రాత్మక స్థాయికి పెంచాం. ఈ నిలకడకు దేశ ప్రజల సమష్టి సంకల్పమే కారణం. ప్రతికూలతను ఎదుర్కోవడం దేశం ఎప్పుడో అధిగమించింది. ఇక్కడి పౌరులు కలలు, సంకల్పంతో నిండి ఉన్నారు. అయితే, వారి సంకల్పాన్ని వాస్తవంగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దేశం సమష్టి సంకల్పం దృఢంగా ఉన్నప్పుడే అది ఏ లక్ష్యాన్నైనా సాధించగలదు" అని మోదీ స్పష్టం చేశారు.

# గిల్గిత్-బాల్టిస్థాన్ ఎన్నికలపై భారత్ తీవ్ర ఆగ్రహం

గిల్గిత్-బాల్టిస్థాన్ అసెంబ్లీకి సాధారణ ఎన్నికలు నిర్వహించాలని పాక్ నిర్ణయించడంపై భారత్? తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అది భారతదేశ భూభాగమని, దానిని పాక్ చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమించిందని పేర్కొంది. పాక్ చేస్తున్న ఇటువంటి ప్రయత్నాలు తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘనలు, రాజకీయ అణచివేత, ఆర్థిక దోపిడీ, స్వేచ్ఛను హరించడం లాంటివి ఆ దేశ అంతర్లీన ప్రాథమిక సమస్యలను దాచలేవని భారత్ తేల్చిచెప్పింది.

"పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమించిన భారత భూభాగమైన గిల్గిత్-బాల్టిస్థాన్‌లో జూన్ 7న సాధారణ ఎన్నికలు నిర్వహించాలని తలపెట్టింది. దీనిపై భారత ప్రభుత్వం పాకిస్థాన్?కు తీవ్ర నిరసన వ్యక్తం చేసింది."

"1947లో జమ్మూకశ్మీర్ భారతదేశంలో పూర్తిగా, చట్టబద్ధంగా విలీనం అయ్యింది. దీనితో గిల్గిత్-బాల్టిస్థాన్‌తో సహా జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలన్నీ భారతదేశంలో అంతర్భాగం అయ్యాయి. ఇవి భారత్‌తో విడదీయలేని భాగాలు" అని ఎంఈఏ పునరుద్ఘాటించింది. పాకిస్థాన్ చట్టవిరుద్ధ ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లో భౌతిక మార్పులు తీసుకురావడానికి చేసే ప్రయత్నాలు అన్నింటినీ భారత్? వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. కనుక పాకిస్థాన్ ఆ ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయాలని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది.



### అది సరైన నిర్ణయమే!

సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని భారత్ మరోసారి సమర్థించుకుంది. పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఆపే వరకు ఈ ఒప్పందం సస్పెన్షన్?లోనే ఉంటుందని స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్? మీడియా బ్రీఫింగ్?లో తెలిపారు. 2025 ఏప్రిల్?లో జరిగిన పహల్గాం ఉగ్రదాడి తర్వాత 1960లో చేసుకున్న సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేశామని, ఇది ఇకపైనా కొనసాగుతుందని అన్నారు.

'26 మంది భారత పౌరుల ప్రాణాలు తీసినందుకు నిరసనగా, ఉగ్రవాద మౌలిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని 2025 మే నెలలో భారత్? ఆపరేషన్? సిందూర్? పేరిట సైనిక చర్య ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే సింధు జలాల ఒప్పందాన్ని హోల్డ్?లో పెట్టాలనే నిర్ణయాన్ని భారత్ తీసుకుంది. సరిహద్దులో ఉగ్రవాద కార్యకలాపాలకు పాక్? ఇస్తున్న మద్దతును పూర్తిగా నిలిపివేసేవరకు ఈ ఒప్పందం పునరుద్ధరణ చేయమని' ఆయన నొక్కి చెప్పారు. ఇక చీనాబ్?, బియాస్ నదులపై భారత్ నిర్మిస్తున్న జలవిద్యుత్ ప్రాజెక్టులపై పాక్ ఇటీవల చేసిన విమర్శలను రణధీర్ జైస్వాల్ తోసిపుచ్చారు. తుర్కియే విదేశాంగ మంత్రి చేసిన వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ, భారత్? అంతర్జాతీయ సంబంధాలు, చర్చలు దాని సొంత విదేశాంగ విధాన ప్రయోజనాల ఆధారంగా కొనసాగుతాయని జైస్వాల్? స్పష్టం చేశారు. ఇతర దేశాలు పాకిస్థాన్?తో సంబంధాలు కొనసాగించడంపై వస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ, భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి అత్యంత ప్రధానమైనది అని ఆయన అన్నారు. కాగా, సింధు జలాల ఒప్పందం నిలిపివేత ప్రత్యక్ష ప్రభావం జమ్మూకశ్మీర్?లోని రాంబన్ జిల్లాలో ఉన్న బగ్లిహార్ డ్యామ్? వద్ద స్పష్టంగా కనిపిస్తోంది. ఒప్పందాన్ని నిలిపివేసి ఏడాదికిపైగా గడుస్తున్నా, ఈ డ్యామ్ గేట్లు ఇంకా మూసే ఉన్నాయి. ఈ ప్రాంతంలో భారత్? నీటి నిర్వహణ, జలవిద్యుత్? వ్యూహంలో వచ్చిన మార్పులను ఇది ఎత్తి చూపుతోంది. కాగా ఈ ఒప్పందంపై జరుగుతున్న చట్టపరమైన వివాదాలను కూడా విదేశాంగ శాఖ ప్రస్తావించింది. మాగ్జిమమ్? పాండేజ్?, ఒప్పంద విరమణపై కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్? 2026 మే 15న ఇచ్చిన తీర్పును భారత్? తిరస్కరించింది. తాము ఆ కోర్టును ఎప్పుడూ గుర్తించలేదని, దాని విధానాలు, నిర్ణయాలు ఏవీ చెల్లవని తేల్చిచెప్పింది. ఈ విధంగా భారత్? తన కఠినమైన దౌత్య, వ్యూహాత్మక వైఖరిని స్పష్టం చేస్తోంది.

# భారత్‌లో రూ.3 లక్షల కోట్ల భారీ పెట్టుబడి

ప్రముఖ టెక్నాలజీ కంపెనీ 'ఎయిర్‌ట్రంక్' భారతదేశంలో భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమైందని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం తెలిపారు. ఎయిర్‌ట్రంక్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాబిన్? ఖుదాతో సమావేశమైన తర్వాత మోదీ ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్‌లో 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లను అభివృద్ధి చేసే వ్యూహాన్ని, పెట్టుబడి ప్రణాళికలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు.

"భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి అద్భుతమైన వేగంతో దూసుకుపోతోంది. ఎయిర్‌ట్రంక్ సంస్థ మన దేశంలో దాదాపు 30 బిలియన్ డాలర్లు (రూ.3 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. దీని ద్వారా 5 గిగా వాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్?ను అభివృద్ధి చేయనుంది. భారత్ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో పెట్టిన అతిపెద్ద పెట్టుబడుల్లో ఇది ఒకటి."

ఇలాంటి పెట్టుబడులు క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో ప్రపంచ కేంద్రంగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తాయని మోదీ అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ఇవి పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టిస్తాయని, సప్లై చైన్‌కు మద్దతునిస్తాయని, ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని వేగవంతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు, దీని ద్వారా ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు ఎక్కువగా భారత్‌లోనే రూపుదిద్దుకుంటోందనే విషయం అవుతోందని అన్నారు.

### హైస్కేల్ డేటా సెంటర్

ఎయిర్‌ట్రంక్ అనేది ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియా ప్రాంతంలో క్లౌడ్, కంటెంట్, పెద్ద ఎంటర్‌ప్రైజ్ కస్టమర్ల కోసం ప్లాట్‌ఫారమ్‌లు సృష్టించే ఒక హైపర్‌స్కేల్ డేటా సెంటర్. ఈ సంస్థ సీఈఓ రాబిన్ ఖుదా మాట్లాడుతూ, 'భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై ప్రధాని మోదీకి ఉన్న దూరదృష్టి, సాంకేతిక పెట్టుబడులకు ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానాల్లో ఒకటిగా ఇండియాను నిలబెట్టింది' అని అన్నారు. "గ్లోబల్ ఏఐ పవర్?హౌస్?గా ఎదగడానికి అవసరమైన ఆశయం, పరిధి, ప్రతిభ భారత్?కు ఉన్నాయి. ఈ విజన్?కు మద్దతుగా నిలవడానికి ఎయిర్?ట్రంక్? ఎంతో ఉత్సాహంగా ఉంది" అని ఆయన అన్నారు.



### భారత్‌లో అతిపెద్ద పెట్టుబడిదారు!

భారతదేశంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారుల్లో ఒకటైన బ్లాక్?స్టోన్?, కెనడా పెన్షన్ ప్లాన్? ఇన్వెస్ట్?మెంట్? బోర్డుల మద్దతు ఎయిర్?ట్రంక్?కు ఉంది. ఎయిర్?ట్రంక్ తాజాగా ప్రకటించిన పెట్టుబడి, ప్రస్తుతం మన దేశం పరిశీలనలో ఉన్న అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాల కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచింది. ఇది క్లౌడ్?, ఏఐ రంగాల్లో మరింత వృద్ధికి తోడ్పడుతుంది. "భారత్‌లో డిజిటల్ మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని మరింత వృద్ధి చేసేందుకు వీలుగా 2030 నాటికి రూ.3 లక్షల కోట్లు కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టాలని ఎయిర్?ట్రంక్ యోచిస్తోంది. ఎయిర్?ట్రంక్ ప్రపంచ వృద్ధి వ్యూహంలో దీన్ని ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తోంది. అంతేకాదు కంపెనీకి చెందిన అత్యంత ప్రధానమైన దీర్ఘకాలిక పెట్టుబడి మార్కెట్లలో ఒకటిగా భారత్?ను చూస్తోంది" అని ఎయిర్?ట్రంక్ తన ప్రకటనలో తెలిపింది. ఈ కంపెనీ అనేక రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రతిపాదిత అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తుంది. అలాగే దేశీయంగా ఉపాధిని, టెక్నాలజీ ఎకో సిస్టమ్‌ను వృద్ధిని పెంపొందిస్తుంది.

ఈ ఏడాది ఏప్రిల్‌లో లూమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రాను కొనుగోలు చేసి, ఎయిర్‌ట్రంక్ భారత్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. దీని ద్వారా ముంబయి, చెన్నై, హైదరాబాద్‌ల్లో 600 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్‌లు, క్యాంపస్?లు అభివృద్ధి చేస్తుంది, నిర్వహిస్తుంది కూడా. కాగా, 2015లో స్థాపించబడిన ఎయిర్‌ట్రంక్, 2017లో ఆస్ట్రేలియాలోనే మొదటి, అతిపెద్ద హైపర్‌స్కేల్ డేటా సెంటర్?ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత వేగంగా విస్తరించడంపై దృష్టి సారించింది. ప్రస్తుతం ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియా ప్రాంతంలో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ప్లాట్‌ఫారమ్‌లను విజయవంతంగా నిర్వహిస్తోంది.

## బంగాల్, బిహార్, త్రిపురల్లో జనాభా మార్పులను సహించబోం

బంగాల్, త్రిపుర, బిహార్‌లలో అక్రమ వలసల కారణంగా జరుగుతున్న జనాభా మార్పులను కేంద్ర ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో సహించబోదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశ సరిహద్దుల రక్షణలో ఉన్న లోపాలను అధిగమించడానికి, భద్రతను కట్టుదిట్టం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. శుక్రవారం త్రిపురలోని లంకామురా సరిహద్దు అవుట్‌పోస్ట్‌లో బీఎస్‌ఎఫ్ సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'స్మార్ట్ బోర్డర్' ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు.

### 'స్మార్ట్ బోర్డర్ ప్రాజెక్ట్ చివరి దశలో ఉంది'

సరిహద్దుల భద్రతను ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "స్మార్ట్ బోర్డర్" ప్రాజెక్ట్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుందని అమిత్ షా ప్రకటించారు. ఈ సరికొత్త విధానాన్ని దేశవ్యాప్తంగా మొదటగా ఏడు నుంచి ఎనిమిది ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కొత్త భద్రతా వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికత, స్థానిక పరిపాలన, సరిహద్దు కాపలాదారులు ఉంటారని పేర్కొన్నారు. అయితే, సరిహద్దు ప్రాంతాలను సందర్శించి, చర్చలు జరపాలని కేంద్ర హోం కార్యదర్శిని, బీఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్‌ను కోరారు. సరిహద్దు ప్రాంతాల్లో చొరబాట్లను అడ్డుకోవడమే కాకుండా, ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తించి దేశం నుంచి బయటకు పంపాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు షా గతంలోనే పేర్కొన్నారు.

### వికసిత్ భారత్ కోసం వాటిని నిర్మూలించాల్సిందే!

మరోవైపు, బీఎస్?ఎఫ్? సిబ్బందిని ఉద్దేశించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని ప్రాంతాలను రక్షించే బాధ్యత బీఎస్?ఎఫ్?పై ఉందని షా పేర్కొన్నారు. ప్రతి సరిహద్దు దానికంటూ ఓ ప్రత్యేకమైన సవాళ్లను కలిగి ఉంటుందని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఉంటే, మరికొన్నింటిలో మానవ అక్రమ రవాణా సమస్యలు ఉంటాయని చెప్పారు. కొన్ని ప్రాంతాలు ఆయుధాల అక్రమ రవాణాను, మరికొన్నింటిలో మాదకద్రవ్యాలు, నకిలీ కరెన్సీ రవాణా కోసం డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారని తెలిపారు. అయితే, 2047 నాటికి దేశాన్ని 'వికసిత్ భారత్'గా? మార్చాలంటే వాటిని నిర్మూలించాల్సిన అవసరం ఎంతో ఉందని చెప్పారు. ఈ విషయంలో బీఎస్?ఎఫ్? తమవంతు కృషి చేస్తోందని పేర్కొన్నారు.

### 'దేశ శ్రేయస్సు కోసం గురూజీ ఎంతో కృషి చేశారు'

ఇదిలా ఉండగా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్?ఎస్?ఎస్?) రెండో సరసంఘచాలక్ అయిన గురూజీ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను అమిత్? షా గుర్తుచేసుకున్నారు. "మీలో చాలా తక్కువ మంది మాత్రమే గురూజీ పేరు విని ఉంటారు. అయితే, గొప్ప పనులు సాధించినప్పటికీ, కీర్తి లేదా గుర్తింపును కోరుకోని వ్యక్తులు కొందరు ఉంటారు. పూజ్యనీయ గురూజీ అటువంటి వ్యక్తుల్లో ఒకరు. తన జీవితమంతా అపారమైన సహనం, అచంచలమైన అంకితభావం, భారతమాత పట్ల భక్తితో మెలిగారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది అంకితభావం కలిగిన కార్యకర్తలను తయారు చేయడానికి ఆయన ఎంతో కృషి చేశారు. దేశ శ్రేయస్సు, భద్రత, విద్య, ఆరోగ్యం పట్ల నిబద్ధత కలిగి ఉండి, దేశ సంస్కృతి, చరిత్ర, భాషల పట్ల గర్వపడే వ్యక్తులను ఆయన తీర్చిదిద్దారు. అలాగే ఆర్?ఎస్?ఎస్?ను తీర్చిదిద్దడంలో, దానికి సంస్థాగత రూపాన్ని ఇవ్వడంలో ఆయన కీలక పాత్ర పోషించారు" అని షా పేర్కొన్నారు. ఇక, పర్యావరణ దినోత్సవ సందర్భంగా బీఎస్?ఎఫ్? సిబ్బందితో కలిసి మొక్కలు నాటి కాసేపు వారితో ముచ్చటించారు. చెట్లను నాటే కార్యక్రమంలో భద్రతా దళాలు చూపిన చొరవను షా ప్రశంసించారు. అయితే, ఇది మన సహజ అలవాటుగా మారాలని, అది మన మనుగడకు ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు.

## పారిశ్రామిక వ్యర్థాలతో రోడ్ల నిర్మాణం



నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) దేశవ్యాప్తంగా ఆధునిక రహదారి నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యతను ఇస్తోంది. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లో గ్రీన్ హైవేల నిర్మాణానికి వినూత్న చర్యలు చేపట్టింది. రోడ్డు నిర్మాణం కోసం ఫ్లై యాష్ లేదా పారిశ్రామిక వ్యర్థాలను వినియోగి స్తోంది. మరో వైపు వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేస్తోంది. జంతువుల కోసం జల వనరుల ఏర్పాటు, వాటి నివాసానికి ఆవరణలు ఏర్పాటు చేస్తోంది. ఈ విధంగా అభివృద్ధి-ప్రకృతి మధ్య సమతుల్యతను సాధించేందుకు ఎంతో కృషి చేస్తోంది.

### ఫ్లై యాష్‌తో రహదారి నిర్మాణం

థర్మల్ పవర్ ప్లాంట్ల నుంచి వెలువడే ఫ్లై యాష్‌ను రహదారి నిర్మాణంలో విరివిగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల రోడ్డు దృఢంగా ఉండటమే కాకుండా, పర్యావరణ కాలుష్యం, ఖర్చులు తగ్గుతాయాని నిపుణులు చెబుతున్నారు. దాంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో, ఛత్తీస్‌గఢ్‌లోని వివిధ ప్రాజెక్టుల్లో 21.7 మిలియన్ మెట్రిక్ టన్నుల (2.17 కోట్ల మెట్రిక్ టన్నుల) ఫ్లై యాష్‌ను వినియోగించగా, 2025-26 నాటికి ఈ సంఖ్య 6.2 మిలియన్ మెట్రిక్ టన్నులను (62 లక్షల మెట్రిక్ టన్నులు) దాటింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2026-27), రహదారి నిర్మాణంలో ఇప్పటికే సుమారు 2 మిలియన్ మెట్రిక్ టన్నుల (20 లక్షల మెట్రిక్ టన్నుల) ఫ్లై యాష్‌ను వినియోగించారు. అదనంగా, ఉక్కు పరిశ్రమ స్లాగ్ (వ్యర్థాలు), పాత టైర్ల నుంచి లభించే రబ్బరు, బయో-బిటుమెన్ వంటి ప్రత్యామ్నాయ పదార్థాలను వినియోగిస్తున్నారు. 2024-25లో 30,477 మెట్రిక్ టన్నులు, 2025-26లో 2,691 మెట్రిక్ టన్నుల పునర్వినియోగ పదార్థాలను (రీసైకిల్డ్) ఉపయోగించడం ద్వారా 'గ్రీన్ హైవేల' నిర్మాణాన్ని మరింత ముందుకు తీసుకెళు తున్నారు.

### జల సంరక్షణకు ప్రాధాన్యం

ఎన్‌హెచ్‌ఏఐ రోడ్ల నిర్మాణంతో పాటు, జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై కూడా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. జాతీయ రహదారుల వెంట 13 'అమృత్ సరోవరాలు' (జల వనరులు) నిర్మించింది. వర్షపు నీటి సేకరణను ప్రోత్సహించేందుకు ఒక సంవత్సరంలోనే నీటి సేకరణ గుంతల సంఖ్యను 14 నుంచి 105కు పెంచింది. నిర్మాణ పనుల సమయంలో మొక్కలకు నీళ్లు పోయడానికి తాగునీటిని వినియోగించకుండా, మురుగునీటి శుద్ధి కేంద్రాల(ఎస్‌టీపీలు) నుంచి సేకరించిన 323 కిలోలీటర్ల శుద్ధి చేసిన నీటిని వినియోగించారు.

### వన్యప్రాణుల రక్షణకు ఆధునిక సొరంగం

ఛత్తీస్‌గఢ్‌లోని సీతానది-ఉదంతి అభయారణ్య ప్రాంతంలో సుమారు 3 కిలోమీటర్ల పొడవున అత్యాధునిక సొరంగాన్ని ఎన్?హెచ్?ఏఐ నిర్మిస్తోంది. దీని ద్వారా వాహనాల రాకపోకలు భూగర్భ మార్గంలోకి మళ్లుతాయి. తద్వారా వాహనాలు వన్యప్రాణుల సహజ ఆవాసాల వైపు వెళ్లడం తగ్గుతుంది. అలాగే శబ్ద కాలుష్యం వల్ల వన్యప్రాణులు, పక్షులు ఇబ్బందులు పడకుండా ఎన్?హెచ్?ఏఐ శబ్దాన్ని నియంత్రించే పరికరాలను ఏర్పాటు చేసింది. అదనంగా చెట్లపై నివసించే జంతువుల కోసం 'మంకీ కానోపీలు' ఏర్పాటు చేస్తోంది. అంతే కాకుండా ఏనుగులు, ఇతర వన్యప్రాణుల సంచారాన్ని సులభతరం చేయడానికి ఏనుగుల మార్గాలు, జంతువుల అండర్‌పాస్‌లు అభివృద్ధి చేయనుంది.

### తేనెటీగల కారిడార్లు, ఔషధ పార్కుల ఏర్పాటు

రహదారుల పక్కన "తేనెటీగల కారిడార్లను" అభివృద్ధి చేసే ప్రణాళికపై ఎన్?హెచ్?ఏఐ పనిచేస్తోంది. ఈ చొరవ తేనెటీగల సంఖ్యను పెంచడం, రైతుల పంటలలో సహజ పరాగ సంపర్కాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల దిగుబడి పెరిగే అవకాశం కూడా ఉంది. అంతేకాకుండా, ఖాళీగా, బీడుగా ఉన్న భూములలో ఔషధ పార్కులను అభివృద్ధి చేయనున్నారు. వీటిలో వేప, తులసి, కలబంద, ఉసిరి వంటి ఔషధ మొక్కలను నాటుతారు. "ఏక్ పెడ్ మా కే నామ్ 2.0" (తల్లి పేరు మీద ఒక చెట్టు 2.0) ప్రచారం కింద, గత సంవత్సరం ఛత్తీస్‌గఢ్‌లో జాతీయ రహదారుల వెంట, రోడ్డు డివైడర్లపై 250,000 పైగా మొక్కలు నాటారు. ఈ చొరవ హరిత రహదారుల అభివృద్ధికి కొత్త ఊపునిచ్చింది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137